
ఆంధ్ర సచిత్ర వార



ముద్దు బిడ్డ మొదటి ఘన ఆహారం. ఇందులో సులభంగా జీర్ణమయ్యే బియ్యం, పుష్టికరమైన 11 విటమినులు, మరియు యినుము కలసివున్నాయి

నెస్టమ్

బిడ్డలకై తయారు చేయబడిన బియ్యపు సారం.

మీ ముద్దు బిడ్డకు ఘన రూపమైన ఆహారం పెట్టడం ప్రారంభించారంటే, ఆ బిడ్డకు మంచి పుష్టినిచ్చే ఆహారం యివ్వండి అంతేకాదు, ఆ ఆహారం అతి సున్నితమైన ఆ బిడ్డ జీర్ణావయవముల మీద తేలికగా పనిచేసేదిగా కూడా వుండాలి. సులభంగా జీర్ణమయ్యే ధాన్య ఆహారం బియ్యమేనని డాక్టర్లు అంగీకరించారు. అందుచేతనే మేము బియ్యంతో నెస్టమ్ క్రీమ్ తయారు చేశాము ఇందులో మీ బిడ్డ ఆరోగ్యంగా పెరుగుటకు ముఖ్యంగా అవసరమైన విటమినులు, ఇనుము తగినంత పాళ్లలో చేరియున్నది

మీ ముద్దు బిడ్డకు 3 నెలలు నిండగానే యీ ఆహారం యివ్వడం ప్రారంభింపవచ్చు. బిడ్డ పెరిగే కొద్దీ, యీ ఆహారానికి పండ్లు, కాయగూరలు, పప్పు, కలిపి, క్రొత్త క్రొత్త రుచులు చవి చూపించవచ్చు మెల్ల మెల్లగా.



బిడ్డల జీర్ణ విధానమునకు యెంతో అనువైనది. బిడ్డల పెరుగుదలకు చాలా చక్కనిది.




గరిష్ట ధర రు. 7-00 స్థానిక పన్నులు అదనం.


పూర్తి పోషక పదార్థములతో సులభంగా జీర్ణమగు నిండు ఆహారాన్ని తయారు చేయుటకై దీనిని పాలతో కలపండి.



ముందుగా కాచియుంచిన పాలను వంచుకోండి.



దానికి నెస్టమ్ కలపండి.



వెంటనే యిచ్చుటకు తయారు

NESTLÉ

SAA/FSL/N/1134

ఆనందజ్యోతి 2వ. సంవత్సరములో

సచిత్ర వారపత్రిక

అడుగిడు సందర్భంలో..

1\.
- మీకు 12 రూపాయల విలువగల మీ పేరు అచ్చువేసిన డైరీ.
- మీ బాబుకు ఒక బాల్ పెన్,
- మీ ఇంటిల్లిపాదికి ఆనందజ్యోతి

ఇవి కాక
లక్కీడిప్‌లో ఒక్కొక్క విజేతకు

2\.
- 500 రూ. ల విలువగల 22 కేరట్ల బంగారపు దుద్దుల జత
- 300 రూ. ల విలువగల రిస్ట్ వాచ్
- 100 రూ. ల విలువగల అలారం టైంపీసు
- బహుమతులు స్వయంగా పొందడానికి దారిఖర్చులకై 100 రూపాయలు

లేదా బహుమతులకు బదులు
1000 రూపాయలు రొఖం.

రు 1,25,000 లు ఉచిత బహుమతులు

మంచి పేపరుతో అందమైన ప్లాస్టిక్ జాకెట్‌తో మీ పేరు ప్రింటు చేసిన సుందరమైన 1-4-80 ■ 31-3-81 డైరీ

కేవలం మీకు మీ పేరు అచ్చువేసిన డైరీ, బాల్ పెన్, మీ ఇంటిల్లిపాదికి ఆనందజ్యోతి సచిత్ర వారపత్రిక మాత్రమే అయితే ఆనందజ్యోతి అర్ధ సంవత్సర చందా దారులుగా చేరడమే.

పోస్టుకార్డుమీద పేరు, పూర్తి చిరునామా వ్రాసి పంపండి. లేదా ఈ క్రింది కూపను పూర్తిచేసి పంపాలి అంతే.

మీకు రు. 25/- లకు మీ పేరు ప్రింటు చేసిన డైరీ, ఒక బాల్ పెన్ వి. పి. పి. లో వస్తాయి. వెనువెంటనే మీ ఇంటికి ఆనందజ్యోతి పంపబడుతుంది.

మీరు వి. పి. పి. ద్వారా కట్టేది కేవలం రూ. 25/- లు మాత్రమే. అర్ధ సంవత్సర చందా రూ. 24-70 పోగా 0-30 పైసలకే మీకు బహుమతులు లభిస్తున్నాయి. వి.పి.పి. ఖర్చులు మావే.

ఇవి కాక

లక్కీడిప్‌లో అదనపు బహుమతులు
1000 రూపాయలు నగదు లేదా
500 రూ॥ల విలువగల దుద్దుల జత
300 రూ॥ల విలువగల రిస్ట్‌వాచ్
100 రూ॥ల విలువగల అలారం టైంపీసు
బహుమతులు స్వయంగా పొందడానికి దారిఖర్చులకై 100 రూ॥లు

పొందడం ఎలా?

ఆనందజ్యోతి సచిత్ర వారపత్రిక సంవత్సర చందా రూ. 49-40 మనిఆర్డరు ద్వారా గాని, బ్యాంకు డ్రాఫ్టు ద్వారా గాని, పంపండి లేదా మీకు సమీపములో నున్న వైశ్యా బ్యాంకులో గాని ఆంధ్రా బ్యాంకులో గాని మా పేర జమచేసి, మీ పూర్తి పేరు చిరునామా మాకు వ్రాయండి. మీ పేరు అచ్చువేసిన డైరీ, మీ బాబుకొక బాల్ పెన్, మీ ఇంటిల్లిపాదికి సంవత్సరం పాటు ఆనందజ్యోతి సచిత్రవార పత్రిక పంపడమే కాక మీ పేరు లక్కీ డిప్‌లో నమోదు చేస్తాము.

లక్కీడిప్‌లో విజేతలు ఒక్కొక్కరు
1000 రూ॥ల నగదు
లేదా
బహుమతులు పొందగలరు.

గమనిక : సంవత్సర చందాదారులుగా చేరి లక్కీడిప్‌లో పాల్గొనే వారందరికి ఉచితంగా డైరీ, బాల్ పెన్‌లు పంపబడును. గాన ఆనందజ్యోతి అర్ధసంవత్సర చందాదారులుగా వేరే చేరనక్కరలేదు.

పత్రికాముఖంగా ప్రకటన చేసి చందా దారుల సమక్షంలోనే ఉగాది నాడు ది 17-3-1980 న లక్కీడిప్.

విజేతల ఫోటోలు, అడ్రస్‌లు పత్రికలలో ప్రకటించబడును.

మీ అందరి అభిమానాన్ని చూరగొన్న మాదిరెడ్డి సులోచన, తోటకూర ఆశాలత, కావిలిపాటి విజయలక్ష్మి సీరియల్సు, వైవిధ్యంగల కథలు, కార్టూన్లు, శీర్షికలతో ఇతర సచిత్రవారపత్రికలతో ధీ కొట్టగల స్థాయిలో ఇంటింటికీ ఆనందజ్యోతి – ఆనందజ్యోతి సచిత్ర వారపత్రిక.

ఏజంట్లు లేని చోట ఏజంట్లు కావలెను.
ఆనందజ్యోతి సచిత్ర వారపత్రిక
పి. బి. నెం. 387, చెట్లబజారు,
గవర్నరుపేట విజయవాడ-2.

బహుమతి ప్రదానం ఉగాది నాడు (17-3-80) గాన లక్కీడిప్ ఆనందజ్యోతి చందాదారులుగా చేరుటకు ఆఖరి తేదీ 23-2-1980.

బహుమతి ప్రదానం ఉగాదికి ఆఖరు తేది 23-2-1980!

ఆనందజ్యోతి చందాకూపన్

పేరు ....
చిరునామా ....
....
....
సంతకం ....

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు :
[1938—1972]
శుక్రవారం : 15-2-'80
సిద్ధార్థినామ సం. మాఘ. బ. చతుర్థి
సంపుటము 73 : సంచిక 25
సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ
*
పోస్టులో ఏడాది చందా రు. 41-60
ఆరు మాసాల చందా రు. 20-80
విడి ప్రతి వెల 75 పైసలు
ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక



ఉత్తరాలు

ముఖచిత్రం

ఈ వారం 1.2.80 అందాల ఆంధ్రసచిత్ర వారపత్రిక నటి 'మాధురి' మధురమైన చీర సింగారంలో వచ్చినిపడుచుదనపు జావెట్టుతో మమ్మల్ని పరవశింప చేసింది. ఇంతమంచి ముఖచిత్రం వేసిన మీాకు మా అభినందనలు!

లక్కరాజు ప్రఫుల్ల చంద్ర, యస్. వెంకట నారాయణ, శ్రీమతి శకుంతల [ధర్మవరం]

* * *

అందమైన ముఖచిత్రములతో మీ ఆంధ్ర పత్రిక అత్యంత ఆకర్షణీయంగా మమ్మల్ని ఆనందింప జేస్తుంది. మరియు జి. వి. జి.గారి సినిమా విశేషాలు చాలా బావుంటున్నాయి.

డి. ప్రసాదరావు, పొంగూరు, నెల్లూరుజిల్లా.

సిరియల్

ఆటిన్, క్లావర్, డైమండ్, ఆఫ్ బందు మీారు ప్రచురించిన ఈ ఏడాది పీరులు రేపటి పౌరులు వాకెంతో నచ్చినది.

ఇందులో(తో) ప్రారంభమైన స్వయంవరం సీరియల్ ప్రారంభంలో నా మనస్సును అమితముగా ఆకట్టుకున్నందుకు రచయితకు, మీాకు నా అభినందనలు.

ఎస్. అన్వర్‌హుస్సేన్, నరసింపేట.

* * *

28.12.79 ఆంధ్రసచిత్ర వారపత్రికలో "ఈ ఏడాది 'పీరులు' రేపటి పౌరులు" ముఖచిత్రం చాలా బాగున్నది. 'స్వయంవరం' కొత్త సీరియల్ చాలా బాగా నచ్చింది. 'వేట', "తల్లి—ఒకమన మన విరిసిన మల్లి" అను రెండు కథలు కూడ బాగున్నవి. పత్రిక మాకు నచ్చినట్లు తీర్చిదిద్దినందుకు ఎడిటర్ గార్కి నా ధన్యవాదాలు. 'సినిమా' 'బొమ్మల మహాభారతము' శీర్షికలు పిల్లలకు, పెద్దలకు అందరికీ చాలా బాగా నచ్చినవి.

జి. శ్రీనివాసమూర్తి [హోస్పేట]

సామాన్యుని సణుగుడు

ఈ వారం [1.2.80] ప్రచురించిన నటి మాధురి ముఖచిత్రం ఏమీా బాగాలేదు. యజ్ఞాని విరహం, ఖాకీకుర్రీ, కథలు రెండూ బాగున్నాయి. మీారు మా కొరకు ఆలకించి కథల సంఖ్య పెంచవలసినదిగా కోరుచున్నాము. స్వయంవరం సీరియల్ చాల బాగుంది. సామాన్యుని సణుగుడు 'క్రికెట్ ఆడాలే గాని యుద్ధం చెయ్యకూడదు'లో పాకిస్థాన్ క్రికెట్ టీమ్‌ను గూర్చిన వీరాజీగారి విమర్శ చాలబాగుంది. వోడిపోయిన పెద్దమనుషులు 'పిచ్' లు బాగాలేవనక ఇంకేమంటారు?

టి. వి. శ్రీనివాసరావు, టి. సత్యప్రసాద్, అండలూరు.

ఫాలాక్షుని డైరీ

63 రోజులు 1515 సభలు

శ్రీమతి ఇందిరాగాంధి ఎన్నికల ప్రచారనిమిత్తం అక్టోబరు నెల నుంచి జనవరి నాలుగో తేదీవరకూ అరవైమూడు వేల కిలోమీటర్లు ప్రయాణం చేశారట. 515 సమావేశాలలోనూ వెయ్యి సభలలోనూ, మాట్లాడారట. 63 రోజుల పర్యటనలోనూ ఆమె 24 [illegible] [సుమారు] ప్రజలను [illegible] మాట్లాడారట. 300 [illegible] పర్యటించారట. ఈ విషయాలు ఆమె తెలియజేశారట !

చైనా వయస్సు !

చైనాలో వయస్సు చెప్పుకునేటప్పుడు ఎక్కువ చెప్పుకోడం ఒక గౌరవంగా భావిస్తారట. అంతేగాక ఎవరైనా "మిమ్మల్ని చూస్తే 60 ఏళ్లవారని అనరు. 40 ఏళ్లు అనుకుంటారు" అని ఎవరైనా అంటే అలా అనిపించుకున్న వారు ఆనందించరుట. గజిబిజిగావుందా!! చైనాలో వయస్సు తక్కువచెప్పుకోడం అవమానం, ఎక్కువ చెప్పుకోడం సంతోషం అన్నమాట. చివరికి స్త్రీలు కూడా తమ వయస్సు ఎక్కువే చెప్పుకుంటారట— ఇన్‌క్రెడిబుల్ !

పోటీ చేసిన పదిచోట్లా ఓటమి !

ఈ పార్లమెంటు ఎన్నికలలో పదిచోట్ల నిలబడి, పోటీచేసిన ప్రొఫెసర్ కిరన్ విధాన్‌రాయ్ తాను నిలబడి పోటీచేసిన పది చోటుల్లోనూ విజయవంతంగా ఓడిపోయారట. ఆయన అన్ని స్థానాలలోనూ ధరావతు కోల్పోయారట.

'లా' విద్యార్థి ఆత్మహత్య !

కరీంనగర్ రాజన్‌బాబు అనే ఓ లా చదివే విద్యార్థి విషం త్రాగి ఆత్మహత్య చేసుకున్నాడట. రోడ్డు మీద నడుస్తూ [20వ తేదీ డిసెంబరు] నడుస్తూ మంగమ్మ తోట ప్రాంతంలో పడిపోతే, తోటి విద్యార్థులతన్ని ఆసుపత్రిలో చేర్చారట. అక్కడాతను చనిపోయాడట. ఈతని ఆత్మహత్యకు కారణం తెలీలేదట. బహుశ భగ్న ప్రేమేమోనని అనుమానిస్తున్నారట.

ఆంధ్రలో మెదడు వాపు వ్యాధి !

బ్రెయిన్ జ్వరము ఆంధ్రాలో కొన్ని జిల్లాలలో వచ్చి, వచ్చినవారిలో అధిక శాతం వైద్యం అందే లోగానో, జరిగిన వైద్యానికి ఫలితం లేకనో చనిపోయారట! అనంతపూరు, కరీంనగర్ జిల్లాలలో చాలా మంది చనిపోయారట. ఈ వ్యాధి పందుల నుంచి వ్యాపిస్తున్నట్లు కనిపెట్టారట. మిర్యాలగూడాలో సుమారు మూడు వేల పందులు విజృంభించి విహారం చేస్తున్నాయట. వీటిని చూసి వూరంతా భయపడుతూన్నదట. పందులు హొటళ్ల ముందు, వెనుకా, కూరగాయల మార్కెట్లులోను, వీధి మురికి కాలువల్లోనూ హాయిగా విహరిస్తున్నాయట. ఈ పందులను వీలైనంత త్వరగా వూరు నుంచి తరలించమని గ్రామ పంచాయితీకి ఆజ్ఞ ఇవ్వమని రాష్ట్ర ప్రభుత్వాన్నికోరమని వూరు ప్రజలంతా జిల్లా ఆరోగ్య, వైద్య అధికారికి విన్నవించారట. అయినట్టే!!

రాంకు వెండి తులాభారం !

చండీఘర్‌కు చెందిన సిర్సా అనేవూరి ప్రజలు జగజ్జీవన్‌రామ్ బరువును తూగే వెండి ఆయనకు బహూకరించారట. ఆయన్ను త్రాసులో ఓ పక్క కూర్చోపెట్టి అవతల పక్క వెండిని త్రాసు సమ బరువు చూపించే వరకూ వేశారట. ఈ వెండికి కిమ్మత్తు ఒకటిన్నర లక్షలట. ఆయన బరువెంత! ఈ వెండి గాక ఓ యాభై వేల రూపాయలు కూడా ఆయనకు బహూకరించారట.

విసిగిపోయిన ఇల్లాలి ఆత్మహత్యా ప్రయత్నం!

మైసూరుకు చెందిన లక్ష్మీపురంలో మీనాక్షి అనే ఓవిడ కుటుంబ బాధలు, భర్త నిరాదరణ భరించలేక తన యిద్దరు పిల్లల్ని తీసుకుని ఓ గదిలోపలకు గడియ వేసుకుని, దూలానికి వురి పోసుకుని మెడ నందులో తగిలించేసుకున్నదట. ఈ భయంకరమేమిటో అర్థంగాని పిల్లలు గోలగోలగా ఏడుస్తూ తలుపులు బాదితే చుట్టు ప్రక్కల వాళ్లొచ్చి పుతకలెత్తి చావబోతున్న ఆమెను రక్షించారట.

మిగిలిపోయిన ఆహారానికి విలువ !


సింగపూరులో ప్రతి యింట్లోనూ మిగిలిపోయే ఆహార పదార్థాలను సరసమైన ధరకు కోళ్ల ఫారమ్ వారు, పందుల ఫారం వారూ వచ్చి కొనుక్కుపోతూంటారట. ఇళ్లల్లో మిగిలిన ఆహార పదార్థాలను వారి వ్యానులు వచ్చి కొనుక్కుపోతు ఉంటాయట. ఖరీదుగా పంది మాంసమూ, కోడి గుడ్లూ యిస్తారుట వారు. ఈ ఆహారాన్ని శుద్ధపరచి తమ కోళ్లకూ, పందులకూ ఆహారంగా ఉపయోగించుతారట!

బీస్ సాల్ బాద్ !

జనవరి ఒకటో తేదీన చిట్టిపాలయానికి చెందిన నడయ్యప్ప గవుండరు అనే ఆయన తనభార్య తంగత్తాళ్ గ్రామకోవెలకు వెళ్ళితిరిగి వస్తూండగా నంజప్పన్, బాణన్ అనే యిద్దరూ ఆ దంపతులను దారి అడ్డి నడయ్యప్పగవుండరును కొడవళ్ళతో నరికిచంపేసి, ఆయన భార్య తంగత్తాళ్ మీద కూడా విజృంభించే సరికామె గోలగోలగా అరిచేసరికి వారు భయపడి పారిపోయారట. 20 ఏళ్ళ క్రితం నడయ్యప్ప గవుండరు నంజప్ప తండ్రిని చంపాడనీ, ఆ పగ యీనాడు నంజప్ప తీర్చుకున్నాడనీ పోలీసులకుసమాచారంఅందినదట.

రైల్లో తూట్లు పడ్డ శవం !

వింధ్యాచల్ ప్రదేశ్‌కు వచ్చిన బొంబాయిమెయిల మొదటితరగతి పెట్టెలో నార్దరన్ రైల్వేశాఖకు చెందిన బ్రిడ్జి సర్వే సూపర్‌వైజర్ జి. యస్. ప్రసాద్ అనేఆయన శవం దొరికిందట. ఈయనవంటి నిండా బుల్లెట్ల గుళ్లకన్నాలున్నాయట. ఢిల్లీ నుంచి వస్తూ యీయన అలహాబాదుస్టేషనులో యీ రైల్లోకు మారారట. ●



సీరియల్

దిగిరాని స్వర్గాలు

ఆకెళ్ల వెంకట సూర్యనారాయణ ✳ కెవస్వి

11

(గత సంచిక తరువాయి)

గీత తండ్రి రంగారావు హడావిడి పడిపోతున్నాడు. సర్దిన కుర్చీనే సర్దుతున్నాడు. కిటికీ తెరలు సవరిస్తున్నాడు. అతనికి కంగారుగా వుంది. కోటీశ్వరయ్యలాంటి కోటీశ్వరుడు తనింటికి రావడమా? ఏమనుకొన్నట్టు? ఈవాళ ఆఫీసుకెళ్లగానే గదిలోకి పిల్చి మిస్టర్ రంగారావ్ – పాతికేళ్ళుగా మా కంపెనీలో పనిచేస్తున్నారు. ఒక్కనాడైనా మీ యింటికి పిల్చేరా? నో లాభం లేదు! నేనే ఫామిలీతో వస్తున్నాను మీ యింటికి... మీ కుటుంబం అందరిని పరిచయం చేసుకొంటాను– అన్నాడు. దేనికి? ఆలోచిస్తున్నాడు రంగారావు.

గదిలో కూర్చుని వీక్లీ చదువుకొంటున్న గీతకు పూర్తిగా అయోమయంగా లేకున్నా, ఆమెకు విషయం అర్థం కావటంలేదు. కుసుమ ఇంటినుంచి వచ్చిన తర్వాత ఆమె గుమ్మం దిగలేదు. దానికితోడు కాలేజిలేదు.

సరిగ్గా అయిదుగంటలకు ఇంపోర్టెడ్ కారు రంగారావు ఇంటిముందు ఆగింది. కోటీశ్వరయ్య కారు దిగేడు. వెనుక రాజ్యలక్ష్మి దిగింది. డ్రైవర్ పువ్వులు– అరటిపళ్ళు పుచ్చుకొని ముందు నడిచేడు.

రంగారావు – కుటుంబం హడావిడి పడిపోతూ వాళ్లని ఆహ్వానించేరు.

కోటీశ్వరయ్య ఆరు అడుగుల మనిషి వంగి ఆ యింట్లో అడుగుపెట్టాడు.

అతిథులు కూర్చున్నారు.

సుందరమ్మ లోపలికొచ్చి "పెళ్ళికూతుర్లా– లోపల కూర్చున్నావేంటి? బయటకు రా... ఇదిగో ఈ టిఫెను, కాఫీ వాళ్ళకి య్యి" అంది గీతతో. ఆమె బయటకొచ్చింది.

"నా భార్య సుందరమ్మ కూతురు గీత, కొడుకు బాబ్జి.. మెకానిక్‌గా మన కంపెనీలోనే పనిచేస్తున్నాడు" పరిచయాలు చేశాడు రంగారావు.

"ఇతనూ...మన కంపెనీలో పని చేస్తున్నాడా? నాకు తెలియదే"

నవ్వి ఊరుకొన్నాడు రంగారావు.

"అవునుసార్! అయిదేళ్ళుగా పనిచేస్తున్నాను" బాబ్జి వినయంగా చెప్పేడు చేతులు కట్టుకొని.

"కూర్చోండి రంగారావుగారు... కూర్చోవోయ్! నేనిక్కడ యజమానినికాను. మీ అతిథిని" అన్నాడు కోటీశ్వరయ్య. రంగారావు– బాబ్జి కూర్చున్నారు.

"ఒక్కగానొక్క కొడుకులావుంది. చదివించలేకపోయారా?"

"చదువంతగా అబ్బలేదు. ఐ. టి. ఐ. అయిందనిపించేడు. మన కంపెనీలో ఖాళీ లొస్తే కాగితం పడేసుకొన్నాడు. సెలక్టు అయ్యేడు."

"సెలక్షన్ అప్పుడేనా నాతో చెప్పిన గుర్తులేదు"

జరిగినకథ– 4: రాధ, కుసుమ, గీత, ప్రాణస్నేహితులు. రాధతండ్రి రామయ్య కూతురు పెండ్లి చేయలేని స్థితిలో వుంటాడు. కుసుమ నంపన్నురాలయినా తాను ఒక మనసున్న, సామాన్యమైన మనిషిని చేసుకుంటాననంటుంది. గీత ఒక ఉన్నతాధికారిని చేసుకోవాలనుకుంటుంది. సహాయం చేసే స్థితిలోవున్నా, చేయలేనని ఉత్తరం వ్రాస్తుంది రాధ అన్న రామం. బలవంతం చేయబోయిన గీత అన్న బాబ్జి బారినుండి బయట పడుతుంది రాధ. గీతను ప్రేమిస్తున్నానని ఆమె వెంటపడుతుంటాడు ప్రతాప్. రాధ పెండ్లి ఆగిపోతుంది. ప్రతాప్ తల్లిదండ్రులు కుసుమను చూసుకోవటానికివస్తున్నారని చెప్తాడు లక్ష్మీపతి.

"అవును. మీ కంపెనీ మేనేజరుగా నేను సిఫార్సుచేయడం గాదని ఫూలుకొన్నాను"

"వెరీ గుడ్.. అమ్మాయి.."

"బి యస్ సి పరీక్షలు రాసింది"

గీత టక్కున తలదించుకొని వేలిలోవున్న ప్లేటును అక్కడుంచింది

"చూడండి ఇప్పుడేం తీసికోం అయితే మీరు బాధపడకూడదు. కాఫీ తాగుతాం" అన్నాడు కోటీశ్వరయ్య కాఫీ అందుకొని.

కాఫీలు తాగేరు

కోటీశ్వరయ్య గీతకేసి తిరిగి "నీకెంత వయసూ" అడిగేడు.

"పందొమ్మిది."

"పరీక్షలు బాగా రాశావా?"

ఆ తల వూపింది.

"మీరింకా కొడుక్కి కూతురికి... ఇద్దరికి పెళ్ళి చేయాలనుకోంగాను" అన్నాడు కోటీశ్వరయ్య రంగారావుకేసి తిరిగి

"అవును. ముందు అమ్మాయి పెళ్ళి చేయాలనుకొంటున్నాను. ఈ సంవత్సరంతో చదువుకూడా అయిపోతుంది."

"మా ప్రతాప్‌కి ఓ సంబంధంవచ్చింది. లక్ష్మీపతిగారమ్మాయి కుసుమ..." గీతకేసి చూస్తూ అన్నాడు కోటీశ్వరయ్య నిశ్చలంగా వుండిపోయింది గీత

"కుసుమా! ఆమె మా గీత స్నేహితురాలే" అన్నాడు రంగారావు.

"అలాగా! అయితే గీతా... మీ స్నేహితురాలు మా ప్రతాప్‌కి మేచ్ అవుతుందంటావా?" అడిగేడు కోటీశ్వరయ్య.

"అవుతుంది. మీరు కోటీశ్వరులయితే, లక్ష్మీపతిగారు లక్షలకధికారి" అంది గీత.

ఆమె మాటలు ఆమెకేగాక రంగారావుకి పెడసరంగా తోచింది. "గీతా..." అన్నాడు మందలింపుగా.

"చెప్పనివ్వండి. నేనడిగితే చెప్పిందే కదా..."అని రంగారావు వైపునుంచి గీతకేసి చూసి "వియ్యంకుల విషయంకాదు– వధూవరులు– విషయం" అన్నాడు.

"ఆ విషయం నిర్ణయించవలసింది– నేనుకాదు- మీరు"

"పోనీ ఆమె స్నేహితురాలిగా చెప్పు! నీ స్నేహితురాలికి మా ప్రతాప్ మేచ్ అవుతాడా?"

గీత మాట్లాడలేదు.

'నిన్నే! గీతా! మా పతప్ని కూడ లేవా!

'' ాశాచ ఈడు జోడు బాగుంటుం'' అంది గీత

'వెరీ గుడ్! థాంక్యూ'' లేచి నిల బడ్డాడు కోటీశ్వరయ్య.

మౌనంగా గీతకేసి చూస్తున్న రాజ్యలక్ష్మి లేచింది.

''మీరొచ్చిన పని సెలవివ్వలేదు'' అన్నాడు రంగారావు

'నేనొచ్చిన పని అయిపోయింది రంగా రావుగారూ''

''అయిపోయిందా...''

''అవును... మీ కుటుంబాన్ని కల్సుకోవా లనుకొన్నాను వచ్చేను. అంతే'' అన్నాడు కోటీశ్వరయ్య.

పళ్ళ బుట్ట సుందరమ్మకిచ్చి ''మా ఇంటి కొకసారి రండి. గీతను తీసికొని రండి'' అంది రాజ్యలక్ష్మమ్మ

సుందరమ్మ బొట్టు పెట్టింది.

అతిధులు కారెక్కారు సెలవు తీసికొని.

కారు బయలుదేరింది.

''ప్రతాప్ గీతనే చేసుకొంటానని పట్టు బట్టేడంటే కారణం ఇప్పుడర్థమైంది. ఈ పిల్ల అందమైనదే కాక తెలివైనది కూడాను'' అన్నాడు కోటీశ్వరయ్య భార్యతో. ఆమె తలూపింది.

* * *

''ఎలా వుంది నాన్నా'' అంది రాధ రామయ్య నుదుటిమీద చేయివేసి చూస్తూ.

రామయ్య మాట్లాడలేదు.

తండ్రి చెప్పనక్కరలేకుండానే ఆమెకు తెలుస్తోంది, జ్వరం ఈ పూట కూడా తగ్గుముఖం పట్టలేదని. వారం రోజులుగా రామయ్య మంచం దిగటం లేదు.

''డాక్టరుగారు యింకా రాలేదునాన్నా.''

''డబ్బులివ్వందే ఏన్నిరోజులొస్తాడకా?'' నీరసంగా సమాధానమిచ్చేడు-రామయ్య.

రాధ వంటింట్లోకి వడిచింది. పీట వాల్చుకొని కూర్చుంది. అన్నకు ఉత్తరం రాసి ఐదు రోజు లయింది. సమాధానం కూడా రాకపోవటం ఆమెకు ఆశ్చర్యం కల్గిస్తోంది.

'డబ్బు... అవును. నిన్న మాత్రలు ఈ పూట కూడా వాడితే...' ఆమె కళ్ళు వెదురు మంచినీళ్ళ బిందె కనపడింది.

ఒక నిశ్చయానికొచ్చి లేచి నిలబడింది. బిందెలో గ్లాసు మంచినీళ్ళు తీసి గిందిం. మిగిలిన నీళ్ళు ఒంపేసి బిందె చేతో పట్టు కొని బయటి కొచ్చింది.

''నాన్నా... ఇప్పుడే వస్తాను'' అందామె. ఆ బిందె నామె ఎక్కడికి తీసికెళ తుందో గ్రహించిన రామయ్య ''ఇంకా ఎందుకమ్మా ఈ ముసలి ప్రాణానికి మందులు... నాకేం కాదమ్మా. నీ పెళ్ళి ఆగిపోయిన నాడే పోవల సింది. ఇంక నాకేం దమ్మా...'' అన్నాడు.

''నువ్వు పడుకో నాన్నా'' అంటామె బయటకు నడుస్తూ.

12

''ఏమండోయ్ రామారావుగారు'' పార్కు లోకి నడుస్తున్న రామారావు ఉలిక్కి పడ్డాడు ఆ పిలుపు విని.

పార్కు గేటు పక్కగా చిన్నకారుని ఆపి కారులోంచి దిగింది కుసుమ.

''మీరా...''

''మీరాను కాను కుసుమను అఫ్‌కోర్స్ ఓల్డ్ జోక్'' అంది కుసుమ.

''నాతో ఏదైనా పనుందా?''

''ఏం లేదు ఏం తోచక బయలేరాను.



మీరు కనబడ్డారు. మీతోపాటే కాస్సేపు పార్కులో కూర్చోవచ్చని వచ్చేశాను."

"నాతోనా?" ఆశ్చర్యంగా అడిగేడతను.

"అవును. కూర్చోకూడదా?"

"ఎవరైనా చూస్తే... ఏమను కొంటారూ?" అన్నాడతను.

"ఏమనుకొంటారూ?"

"ఇద్దరికి ఏదో ప్రేమ సంబంధం వుందని అంటగట్టి ప్రచారం చేస్తారు."

"చేయనివ్వండి."

"చేయనివ్వండా?" ఆశ్చర్యంగా అడిగేడు రామారావు.

"రండి. ఇలా కూర్చుందాం" అంది కుసుమ పచ్చగడ్డి కేసి చూపి.

రామారావు కూర్చున్నాడు. అతనికి కొద్ది విడంలో ఆమె కూర్చుంది.

"మీ పెళ్ళిచూపుల విషయం ఏమ యింది?" అడిగేడు రామారావు.

"నా పెళ్ళిచూపులంటే మీకు బాధగా అనిపించిందా?"

రామారావు నివ్వెర పోయాడు. "ఏమిటి విశారనేది?"

"జోక్ అంతే, ఏనాటి పెళ్ళిచూపులు అవెప్పుడో ఆగిపోయాయి."

"ఎందువల్లా."

"అవన్నీ మీకు చెప్పాలంటె చాలా పెద్ద కథ! కథాసంగ్రహం ఏమిటంటే...ఆ అబ్బాయిని చేసికోనని డాడీకి చెప్పేను. ఆ విషయం చెప్పడానికి కోటీశ్వరయ్యగార్కి ఫోను చేస్తే— సారీ! మా అబ్బాయి మరో అమ్మాయిని ప్రేమించేడుట— అన్నారు! మొత్తానికి పెళ్ళిచూపులు కేన్సిల్."

"బావుంది కథ! ఆ అబ్బాయి మరొకర్ని ప్రేమించేడు ... వద్దన్నాడు! మరి మీరెందుకొద్దన్నారు. మీరూ..." రామారావు ఆగిపోయాడు.

ఆమె ఓ క్షణం ఆది "అవును. ప్రేమించేను" అంది.

"అది. అలా చెప్పండి. నేనదే అనుకొన్నాను" అమాయకంగా నవ్వి "ఎవరిని" అడిగేడు రామారావు.

"మీకు చెప్పాల్సినవని లేదనుకొంటాను" అందామె.

"అతను మరోలా అర్థం చేసుకొని సారీ! నాకు చెప్పాల్సిన అవసరంలేదు. అసలు నేను అడగకూడదు. రియల్లీ సారీ" అన్నాడతను.

కుసుమ ఏదో అనబోయింది.

"కారు నువ్వుతెచ్చేవా? ఓ! రామారావు వచ్చేడా" రాజేంద్ర దూరం నుంచే పలకరిస్తూ వచ్చేడు. వెనుకగా భారతి వచ్చింది.

"కారుని బయట చూసి మావగారు వచ్చేరనుకొన్నాం" అంది. వాళ్ళు కూర్చున్నారు.

"మీరిద్దరూ వచ్చేరా" అడిగేడు రాజేంద్ర.

కుసుమ మాట్లాడలేదు.

"లేదు నేనొక్కర్తే వచ్చేను ఆమె నన్నుచూసి పలకరించేరు" సంజాషీగా అన్నాడు రామారావు.

భారతి - రాజేంద్ర ఒకరి మొహాలొకరు చూసుకొన్నారు

"సరే. నేను వెళుతున్నాను. మీరు కారులో వచ్చేరా? నడిచి వచ్చేరా?" అంది కుసుమ లేచి.

"పెద్దకారులో."

"సరే. నేను గీత యింటికెళుతున్నాను" అంటూ పార్కు బయటకు నడిచింది. 'టైము కొచ్చేరు' విసుక్కుంటూ కారు స్టారు చేసింది.

*　　*　　*

రంగారావు హడావిడిగా యింటికొచ్చేడు.

"ఏమిటండీ ఆ హడావిడి" అంది సుందరమ్మ.

"గీత ఏది? గీతా"

"దేనికి?"

"ఏం నాన్నా"

"నా గీతెంతో అదృష్టవంతురాలు: మొన్న కోటీశ్వరయ్యగారు వచ్చినదెందుకో తెలుసా? గీతను చూడటానికి. వాళబ్బాయి గీతనెప్పుడో చూశాడట. ఇంతకాలం పెళ్ళి చేసికోనని పట్టుబట్టి కూర్చున్నవాడు, గీతను చేసికొంటానన్నాడట." గబగబా చెప్పుకుని పోతున్నాడు రంగారావు.

గీత హృదయం ఆనందంతో నిండి పోయింది.

"నా గీతెంతో అదృష్టవంతురాలు" అంది సుందరమ్మ.

"నాన్నా, అయితే నన్ను మెకానిక్ నుంచి

సూపర్‌వైజర్ చేస్తారేమో'' అన్నాడు బాబ్జి.

''నవ్వి కుదరవు. ఆయన దగ్గర బంధుప్రీతి – బంధుత్వమే, ప్రమోషన్ – ప్రమోషన్'' అంటూ రంగరావు సుందరమ్మ కేసి తిరిగి, ''ఒసేవ్! ఈ పదిహేను రోజులు దాటిన తర్వాత ఉన్నాయట ముహూర్తాలు. పెళ్ళికి ఖర్చు అంతా ఆయనే పెట్టుకొంటా నన్నారు'' అన్నాడు.

''అదేమిటండీ''

''నే నొప్పుకోలేకపోతే ఆయనతో పోలిస్తే బీదవాణ్ణి కాని, ఏనేం ముష్టి వాణ్ణి కాలేన్నాను. నేనేచేస్తాను''

గీత నవ్వు దాచుకుంటూ అక్కడనుంచి కదలబోయింది, కుసుమ లోపలికొచ్చింది.

''రా కుసుమా, మా గీతకు ప్రతాప్‌తో పెళ్ళి నిశ్చయం అయిందమ్మా'' అన్నాడు రంగరావు. అన్న తర్వాత అతని స్ఫురణ కొచ్చింది, కుసుమను కూడా ప్రతాప్ కివ్వ బోయేరని... ఏం మాట్లాడాలో తెలియక ''రా బాబ్జి నీతో పనుంది'' బయటకు నడిచేడు. బాబ్జి తండ్రిని అనుసరించేడు.

''రా కూర్చో కుసుమా, కాఫీ తెస్తాను'' సుందరమ్మ వంటింట్లోకి నడిచింది.

''కూర్చో కుసుమా'' పొడిగా అందిగీత.

కుసుమ ఓ క్షణం గీత కేసి చూసి కూర్చుంది.

''గీతా నువ్వు కూర్చోమనకున్నా ఈ ఇంట్లో కూర్చునే అధికారం నాకుందను కొంటాను'' అంది కుసుమ.

గీత మాట్లాడలేదు.

''ప్రతాప్‌తో నీ పెళ్ళి నిశ్చయం అయిందని తెలిసి నా గుండె అసూయతో ఉడికి పోతోందని భావిస్తున్నావు కదూ? నన్నెంత తక్కువగా అంచనా వేశావు.చిన్నప్పటి నుంచి నువ్వు, నేను, రాధ స్నేహితులం. అప్పటి నించి నువ్వు అంతే మనుషులని అంచనా వేయడం నీకు చేతకాదు. ఎవరో చెప్పిన మాటలు విని, చిన్నప్పుడు నాతో దెబ్బలాడే దానివి. ఇప్పుడూ అంతే...

ప్రతాప్‌తో నా పెళ్ళి గూర్చి డాడీ చెప్పి నపుడు ఏం చేయాలో నా కర్థం కాలేదు. నీ విషయం చెప్పనని మాట యిచ్చేను. ఏం చెప్పాలి ఆలోచిస్తూ మేడ ఎక్కేను. నువ్వు వచ్చేవు.అమ్మ చెప్పింది. నీకు...నీకు మనుషు లని అంచనా వేయడం వస్తే మేడెక్కినాతో మాట్లాడేదానివి. అంతే కాని తెలుగు సినిమా కథానాయికలా అపార్థం చేసి కొని వెళ్ళిపోతావా?

ఆ మర్నాడే డాడీతో చెప్పేను. నాకు ఆ సంబంధం వద్దని. కారణం చెప్పలేను. వెంటనే డాడీ అడిగెరు. ఎవరినేనా ప్రేమిస్తే చేవాని. ఆ ప్రశ్నకు సమాధానం లేకే ఆ రోజు వరాండాలో మేడ ఎక్కింది.

ఈ రోజే తెలిసింది నువ్వు, వెళ్ళి వచ్చి నట్టుగా. అందుకే పరుగెత్తుకొంటూ వచ్చేను. అంతేకాని నువ్వు అనుకుంటున్నట్టు ఈర్ష్య పడటానికి కాదు. ఇంకో విషయం, మా డాడీకి చెప్పిన రోజునే నేను ప్రతాప్‌కి ఫోన్ చేసి మా గీత విషయం ఏమిటీ.. నన్ను పెళ్ళి చేసికోవడం ఏమిటీ అని కూడా అడిగేను తెలుసా?'' అంది కుసుమ.

''ఒసేవ్ నన్ను క్షమించే. ఆ పరిస్థితుల్లో...'' అంది గీత కుసుమ రెండు చేతులూ పట్టుకొని.

''క్షమించటా అవి సినిమా డైలాగు అన క్కరలేదు. మనుషులను అర్థం చేసికొందుకు ప్రయత్నించు'' అంది కుసుమ.

''పొరపాటు జరిగింది. ఇంక ఊరుకో తల్లి''

''అలా అన్నావు బాగుంది. ఇక నీ లక్ష్యం ఏమిటో... కలలు కన్నావు. కలలు ఫలించేయి. నువ్వు కోరుకొనిచినట్లు రాకుమా రుడు వేటకొచ్చి నిన్ను వలచేడు. పెళ్ళి చేసి కొంటున్నాడు.''

''అదంతా నీవల్లనే'' అంది గీత.

''సరేలే''

''మరీ... నీ తోటరాము డెక్కడున్నాడో చెప్పు. రాయబారం చేస్తాను'' అంది గీత నవ్వి.

''నా తోటరాముడికి నేను చెప్పిందే అర్థం కావటం లేదు. ఇంకా నీ రాయబారం ఏం అర్థమవుతుంది'' గొణుక్కుంది కుసుమ.

* * *

కుసుమ కారు పోర్టికోలో ఆపి ఇంట్లో కొచ్చింది. లక్ష్మీపతి సోఫాలో కూర్చుని సిగార్ కాలుస్తున్నాడు.

''కనాన్ కుసుమా... ఫ్రం వేర్ యు ఆర్ కమింగ్'' అడిగేడు కుసుమని.

''అన్నయ్యకు తెలుసే... గీత ఇంటి నుంచి.''

''ఆల్‌రైట్. నిన్ను చూసుకొందుకి పెళ్ళి వారు వస్తున్నారు.''


''నాకిప్పుడే పెళ్ళి వద్దు.''

''అదేంటి ప్రతాప్‌ని చేసికోనన్నావు. కారణం అడిగితే చెప్పలేదు. నీ మనసులో ఎవరైనా ఉన్నారంటే మాట్లాడలేదు. వెల్. వాట్ ఈజ్ ఆల్ దిస్'' లక్ష్మీపతి విసుగ్గా అడిగేడు.

కుసుమ మాట్లాడలేదు.

లక్ష్మీపతి ఒక్క నిమిషం కుసుమకేసి చూసి ''ఆల్‌రైట్. రాత్రంతా ఆలోచించు. టెల్ మి ఇన్ ది మార్నింగ్. ఏం చెప్పినా కారణం చూపించి మరీ చెప్పు. యు కెన్ గో'' అన్నాడు.

కుసుమ నిట్టూర్చి మేడెక్కింది. ❖



దిగిరాని స్వర్గాలు

గదిలోకెళ్ళి తలుపు మూసుకొంది. కిటికీ దగ్గరకెళ్ళి చూసింది. రామారావు గదిలో దీపం వెలుగుతోంది. అతను దుమ్మం ముందు కూర్చుని పుస్తకం చదువుకొంటు న్నాడు.

చాలా సేపు ఆలోచిస్తూనే గడిపింది కుసుమ.

"కుసుమా అన్నానికి రా" పిల్చింది మాణిక్యాంబ.

"మీరు కానివ్వండి దమ్మీ వస్తాను" అందామె.

మరో అయిదు నిమిషాల్లో ఆమె నిశ్చయాని కొచ్చింది-మేడ దిగింది. అంతా డైనింగ్ హాల్లో వున్నారు. మెల్లి గా బయటకొచ్చి-ఔట్ హౌస్ కేసి నడచింది.

కుసుమను చూసి రామారావు ఆశ్చర్య పోయాడు.

"చీకటి పడింది, మీరిలా రావటం..." కుర్చీలోంచి లేచి అడిగేడు రామారావు.

"చివరేమను కొంటారో నా కనవసరం. మీరు నా గురించి ఏమనుకుంటున్నారు. అది చెప్పండి" అంది కుసుమ గదిలోకివచ్చి మంచం మీద కూర్చుని.

"నేను ఏమనుకొంటాను."

"ఇంతకాలం ఇలా నోట్లో వేలు పెడితే కొరకలేని అమాయకత్వం నటిస్తారు" అడిగిందామె.

"నేను నటిస్తున్నానా ?" కాళ్ళ అడుగు తప్పినట్లు కూలబడ్డాడు రామారావు.

"అవును. దోబూచులాడుతున్నారు. నా గురించి మీరేమనుకొంటున్నారో చెప్పండి. నా జీవితంలో నేనొక నిశ్చయాన్ని తీసి కొందికి కొన్ని నిమిషాలే టైముంది. త్వర్లో చెప్పండి" గబగబా అడిగింది కుసుమ.

రామారావు ఒక్క నిమిషం మౌనం వహించేడు. చేతిలోని పుస్తకాన్ని చూస్తూ "చూడండి కుసుమా. మీ మనసులో ఉద్దే శాన్ని గ్రహించా నెప్పుడో. ఈలాంటి క్షణం మనిద్దరి మధ్య ఒకటి వచ్చేస్తుందని భయ పడ్డాను. ఆ క్షణం నేను పిల్చిగా చేసిన ప్రశ్నలవల్ల పార్కులో రాజేంద్ర రాకుంటే వచ్చేసి ఉండేది. అప్పుడు గండం తప్పిం దనుకొన్నాను. అందుకే ఇంటికి రాగానే సామాను ప్యాక్‌చేసి రడీగా వున్నాను. మరి కాస్త రాత్రి గడిస్తే నా దారిని నేను పోదా మనుకొన్నాను. మీరు నాకా అవకాశం ఇవ్వ లేదు. నేను భయపడినంతా జరిగింది" అన్నాడు.

కుసుమ ప్యాక్ చేసిన సామాను కేసి చూసి "అయితే నేనంటే మీకు భయం తప్పించి మరేం లేదన్నమాట" అంది.

"లేదని ఆత్మ వంచన చేసికోలేను. నేను మనిషినే."

"మరెందుకూ ఆ భయం."

"మనిద్దరికి ఔట్ హౌస్‌కి బంగళాకి ఉన్నంత తేడా వుంది."

విషవల్లులు

రాజులు పోయినా, రోజులు మారినా
విషవల్లులు అల్లిబిల్లిగా అల్లుకుపోతూ
కల్లబొల్లి కబుర్లతో సమాజాన్ని ఆవరిస్తూ
చిరునవ్వుతో పైకెదిగే చిన్నారి మొక్కల
బ్రతుకుల్లో చితుకులు పోస్తూనేవున్నాయి.
అందరూ రండర్రా ! ఈ అన్యాయాన్ని
ఆపుదాం;
మన అభినవ శాఖా తంత్రశక్తితో
అందమైన సమతా మమతల నందనాల్ని
పెంచుదాం
నువ్వు వస్తావు నోజ్జ్వలతతో, మనిషి
మనస్సుందరంగా
అభిజాత దంధవహంగా పెరిగిన తోటల్లో
గంధర్వుల మవుదాం.

— సుచంద్ర.

"కావచ్చు. మీ ఔట్ హౌస్‌కి నేనె నడిచివచ్చేను."

"మీరిప్పుడు ఔట్ హౌస్‌కి నడిచొచ్చి నంత సులువుగా నా జీవితంలోకి రాలేరు" అన్నాడతను.

"మీ రెందుకలా అనుకొంటున్నారు."

"మీరు నా కుటుంబంలో కష్టసుఖాలు తెలియక భ్రమలో వున్నారు."

"మీరు పక్కనుంటే చాలు" సిగ్గుగా తలదించుకొని అంది కుసుమ.

"బాగా ఆలోచించే ఆ నిర్ణయం తీసి కొన్నారా ?" అడిగేడతను.

"ఆం. మీ నిర్ణయం."

"చెప్పేనుగా. నేను మనిషినే. ప్రేమా దోమా లాంటి ఉపన్యాసాలు నా వల్లకాదు కాని, మీలాంటి మనిషి .. మనసు నర్థం చేసికొనేది భార్య కావాలనుకున్నాను."

కుసుమ సిగ్గుపడింది.

"మనిక్కడున్నావా కుసుమా ? డాడీ పిలుస్తున్నారు." అంటూ రాజేంద్ర లోపలి కొచ్చాడు చుట్టూ చూసి రామారావు కేసి చూసి 'అదేంటి సామాన్లు ప్యాక్ చేసేనేంటి' అన్నాడు. కుసుమా-రామారావుల కేసి అను మానంగా చూశాడు. ఆ చూపులకర్థం గ్రహించిన కుసుమ కంగారు పడలేదు. లేచి నిలబడి "మేమిద్దరం లేచి పోవటం లేదన్నయ్యా ! అంత తెలివితక్కువదాన్ని కాను" అని. రామారావు కేసి చూసి "నివరెవ్వ చెప్పినా నా నిశ్చయం తెలిసికో కుండా మీరు ఎక్కడికి వెళ్ళకండి" అంటూ బయట కొచ్చింది.

రాజేంద్ర ఆశ్చర్యపోయి చెల్లెల్ని అనుస రించేడు.

సావిట్లోనే ఎదురుపడ్డాడు లక్ష్మీపతి. "ఎక్కడనుంచి" అడిగేడు.

"రామారావు గది నుంచి" అంది కుసుమ.

"అర్ధరాత్రి పరాయివాడి..."

"అతన్నినేను పెళ్ళి చేసికొంటాను" అంది కుసుమ దృఢంగా.

లక్ష్మీపతి ఆశ్చర్యపోలేదు. ఒక్క క్షణం ఆగి "అతని కుటుంబ పరిస్థితి నీకు తెలుసా . వాళ్ళ నాన్న ఉత్త రోగ్. అన్నయ్య చెప్పేడు. వాళ్ళకి డబ్బు లేదని నాకు బాధ లేదు వాళ్ళ నాన్న గురించే."

"నేను పెళ్ళి చేసికొనేది రామారావుని."

"నో నీకేం తెలీదు యు ఆర్ క్రేజీ ... హిజ్ ఫాదర్ ఈజ్ రోగ్."

"నాకు సంబంధంలేదు."

"నో. ఇట్ కాంట్ బి..."

"నా నిర్ణయం చెప్పమన్నారు ఉదయం లోపల, ఇప్పుడే చెప్పేను. మీరు ఆలోచించి చెప్పండి. ఆ తర్వాత" మాట పూర్తి చేయ కుండానే మేడ ఎక్కింది కుసుమ.

హాలులో ఉన్న వాళ్ళంతా ఆశ్చర్య పోయారు.

[ఇంకా వుంది]

అన్నిటికన్నా ఎక్కువ శుభ్రత, అన్నిటికన్నా తక్కువ ధరకు




ఇతర అన్ని డిటర్జెంట్ బార్లకంటే ఎంతో ఎక్కువ ఉత్తమమైనది, ఎంతో ఎక్కువ ఆదానిచ్చేది మరియు సబ్బులకంటే 1½ రెట్లు ఎక్కువ శక్తివంతమైనది.

నీలి రంగు స్వస్తిక్ డిటర్జెంట్ ఉతుకే బార్

ఒక మారు స్వస్తిక్ బార్... మరి ఎప్పటికీ స్వస్తిక్ బార్

Shilpi DM 32 A/79 Tel.


ఆంధ్ర సచిత్ర వారపత్రిక పరిశీలనార్థం పంపే బొమ్మలు, ముఖచిత్ర రచనలు పంపేవారు కూడా వాటితోపాటు తగినన్ని తపాలా బిళ్లలు అంటించిన కవరును జతపరచకపోతే అవి త్రిప్పి పంపబడవు. -సం.



గ్రహణం పట్టినా సూర్యుడు సూర్యుడే!

ఫిబ్రవరి 16 న యీ శతాబ్దానికి అపురూపమైన సంపూర్ణ గ్రహణం మన దేశంలో శాస్త్రీజ్ఞుల పరిశోధనలకి వీలుగా సంభవించనున్నది. ఇటువంటిదే పోయినేడాది ఫిబ్రవరి 26 న అమెరికాలో యీ శతాబ్దానికి ఆఖరుసారి ఏర్పడ్డది. మళ్లీ క్రీ. శ. 2017 దాకా అట్టి సూర్యగ్రహణం రాదుట! పై బొమ్మలో అద్భుతమైన ఈ సూర్యగ్రహణ దృశ్యాన్ని 40 వేల అడుగుల ఎత్తున ఎగిరే విమానం నుంచి చూసినట్లు చూడొచ్చును. తెల్లగా ధగద్ధగాయమానంగా వున్న ఆవిస్ఫులింగాలు, 30 లక్షల మైళ్ల నిడివిగల విద్యుదయస్కాంత కాంతి పుంజాలు. [లైఫ్ రంగుల బొమ్మల పత్రికనుంచి...]





స్వయంవరం

సీరియల్ 10

చివుకుల పురుషోత్తం

(గత సంచిక తరువాయి)

"డర్టీ ఫ్యాషన్స్! అన్ హైజినిక్ ఫ్యాషన్స్! అసలు చదువుకున్న ఆడవాళ్లకు బొత్తిగా తలకాయలేకుండాపోతున్నది" అనుకున్నాడు హరికృష్ణ, రైల్వే లైన్ దాటి పదిగజాలు నడిచి సైకిల్ మీద ఎక్కుతూ.

సైకిల్ దిగి అంత క్లోజ్‌గా బ్యూటీ కాళ్ళను పరిశీలించినా, బ్యూటీ కాళ్ళు కనిపించలేదు రంగురంగుల టెర్కోసా చీర నేలమీద జీరాడుతూ, పాదాలను బొత్తిగా కనబడకుండా చేశాయి. అసలు చీర ఇలా నేలకు తగుల్తూ వుండే ఫ్యాషన్‌ను యెవరు ప్రవేశపెట్టి వుంటారు? యస్! ఎవరో బోదకాళ్ళ సుందరి తన లావుపాటి బోదకాళ్ళూ, పాదాలు కన్పించకుండా వుండడానికి ఇలా చీర కట్టుకుని వుంటుంది. ఇంకేం? ఆడసమయాళం వారంతా అదే ఫ్యాషన్ అని అనుకుని ఇలా చీరలు కట్టుకోవడం మొదలెట్టివుంటారు. ఇలా చీర బజారు మట్టిలో, పేడలో, మురికిలో పొర్లాడి పొర్లాడి ఇంటికి చేరంగానే ఆ మురికి అంతా ఇల్లు చేరదా? ఆ మురికిలోని సూక్ష్మక్రిములతో కొంపల్లో రోగాలు రావా? ఈ మాత్రం కామన్ సెన్సు ఇవ్వలేని వీళ్ళ చదువులవల్ల ఉపయోగం ఏమిటి?

ఇలా బ్యూటీ వస్త్రధారణను గురించి హరికృష్ణ కసిగా అనుకున్నాడు. అసలు సంగతేమిటంటే బ్యూటీ పాదాలు చూసి, ఆ పాదాల వ్రేళ్ళకు మెట్టెలు వున్నాయాలేదా? తెలుసుకుందామని హరికృష్ణ భావం.

ఏమో! మెట్టెలు వుంచుకోవడమూ ఫ్యాషన్ కాదేమో! అయితే బ్యూటీ ముఖకవళికలూ, వైఖరీ, వస్త్రధారణలను చూస్తే బ్యూటీ మధ్యతరగతి యువతి అని అనిపించింది. మరి ఆమె పాదాలు కనిపిస్తే, వాటికి మెట్టెలు వుంటే, బ్యూటీ ఈజ్ బ్యూటిఫుల్ అనుకుని ఇక మర్చిపోవచ్చు. లేకుంటే బ్యూటీని గురించి స్వీట్ 'డ్రీంస్' ఊహించుకోవచ్చు. బ్యూటీ గనక పెండ్లైన యువతి ఐతే ఆమెను గురించి తప్పుగా భావించడం సంస్కారంగాదు.

ఇంతకీ బ్యూటీ వివాహితయా? అవివాహితయా? ఈ సంగతి తెలియాలంటే ఏం చేయాలి? కేవలం పరిశీలనతో ఏమీ తేలేట్లు లేదు లేక ... ఆమెను ... ఫాలోఅయి ... ఎక్కడి కెళ్తుందో తెలుసుకుని ... అక్కడ విచారిస్తే?...

హరికృష్ణ గుండెలు గుబగుబలాడాయి. ఇవన్నీ రౌడీ పద్ధతులు! తన జీవితంలో ఇలాంటి పిచ్చివేషాలువేసి ఎరుగడు. ఎన్నడూ అలవాటులేని పని చేయాలంటే భయం పట్టుకుంటున్నది. తను ఇంకా కాలేజీ స్టూడెంటు గాదు. బాధ్యతగల ఉద్యోగి. ఎవరికైనా సంగతి తెలిసినా, లేక బ్యూటీ గ్రహించి గొడవచేసినా పరువేగాదు, ఉద్యోగం కూడా పోవచ్చు! స్టూడెంట్ డేస్‌లో గూడా తను బుద్ధిగా వున్నాడు. ఇప్పుడు పిచ్చివేషాలువేస్తే?... ఇంకేమైనా వుందా?

ప్చ్! బ్యూటీ తనకు కొన్ని అడుగుల దూరంలో వెళ్ళినా నిజానికి ఆమె ఎన్నో మైళ్ళ దూరంలో వుంది. అసలు సాయంకాలంపూట బ్యూటీ యెక్కడి కెళ్తుంటుంది? ఆఫీసు నుండి ఇంటికా? ఇంటి నుండి ఆఫీసుకా? లేక షాపింగ్‌కా?

ఇలా అర్థంగాని ప్రశ్నలు తరుముతూవుంటే హరికృష్ణ ఇల్లు చేరాడు. మల్లిక అందించిన నీళ్లతో కాళ్ళూ చేతులూ, ముఖం కడుక్కుని వాలుకుర్చీలో కూర్చోగా భ్రమరాంబ ఉప్మా ప్లేటు, మంచినీళ్ళ గ్లాసుతో వచ్చి వాటిని టేబుల్ పైన పెట్టి అన్నది – "హరీ! ఆ స్వరూపరాణి చక్కనిచుక్కఅట! పైగా బుద్ధిమంతురాలుగూడా నట!"

"అని ఎవరు చెప్పారు? ఆ పుండరీకాక్షయ్య మళ్ళీ వచ్చాడా? అవునులే! కాకి బిడ్డ కాకికి ముద్దు! మీ తమ్ముడు గూడా అందరితో

చెప్తూవుంటాడుగా – తన నల్లటి మూగి కొడుకు చాలా తెలివిగలవాడని, అందగాడనీ ?''

''పుండరీకాక్షయ్య గామురా చెప్పింది! మూడ్రోజులకింద మనింటికో అమ్మాయి వచ్చి మల్లికకు బ్యాంక్ అప్లికేషన్ ఇచ్చిందిగదా? ఆ అమ్మాయి సంధ్యారాణి – చెప్పింది.''

''ఆ అమ్మాయి పుండరీకాక్షయ్య పంపిన గూఢచారిణి ఏమో ?''

''కాదురా! ఆ అమ్మాయిది విజయవాడట! ఈ ఊళ్ళో ఉద్యోగం చేసుకుంటున్నది. పుండరీకాక్షయ్య గురించి తనకు తెలుసు అన్నది. అసలు ఆ అమ్మాయి స్వరూపరాణికి స్నేహితురాలట!''

''అద్గదీ సంగతి! నేను చెప్పలేదా అమ్మా! ఆ పుండరీకాక్షయ్య దేవాంతకుడు. ట్యూబ్‌లైట్ కాంతిలో పెండ్లిచూపులు అరేంజ్ చేసినప్పుడే అనుకున్నాను. అమ్మా, లైట్ కాంతిలో ఆ అమ్మాయి రంగును గురించి పొరపడటానికి అవకాశం వుంది. కానీ, ఆమె కవళికలు, కనుముక్కు తీరును గురించి ఎలా పొరబడగలను? ఆ పిల్లలో మగరాయుడు లక్షణాలున్నాయి. స్త్రీకి అసహజమైన భారీవిగ్రహం ఈ వయసులోనే ఆ పిల్ల అంత భారీగా వుంటే, ముందు ముందు ఇంకా యెంత భారీ అవుతుందే?''

''ఏమోరా నాయనా? ఆ సంధ్యారాణి చెప్పింది. పిల్ల చక్కనిదట, బుద్ధిమంతురాలట!''

''పోనీ అమ్మా! నీవు, మల్లిక వెళ్ళి చూసిరాగూడదూ? అమ్మలక్కల మాటలు విని, నా ప్రాణాలు తీయకుంటే?''

''ఆఁ! ఇంకా ఏం చూడ్డంలే నాయనా! ఆ పిల్లకు ఇంకో సంబంధం రానూవచ్చింది పెండ్లిచూపులు గూడా అయ్యాయి.''

ఆ మాటలు వింటూనే హరికృష్ణ కుర్చీలో నుండి లేచి, దక్షిణంగా తిరిగి రెండు చేతులూ ఆకాశంలోకి యెత్తి, ''ఏడుకొండలవాడా? వెంకటారమణా? గోవిందా! గోవిం! బ్రతికించావు తండ్రీ! త్వరలో కొండకు వస్తాను' అంటూ తన జేబులో నుండి ఒక రూపాయి నాణేన్ని తీసి భ్రమరాంబకు ఇచ్చి, ''అమ్మా! పసుపుగుడ్డన ఈ రూపాయి ముడుపుగట్టు'' అన్నాడు.

''నేను గూడా ఈ సంబంధం కుదిర్తే కొండకు వస్తానని అర్ధరూపాయి ముడుపు గట్టానురా.''

''అదీ సంగతి! నీవు అర్ధరూపాయే కట్టావు! నేను రూపాయి కట్టాను! అందుకే నా కోర్కె తీరింది. వడ్డికాసులవాడా! వేంకటరమణా! స్వామీ! తండ్రీ!...''

''చాలించరా నీ వెటకారాలు!'' గద్దించింది భ్రమరాంబ.

''అన్నయ్యా! టిఫెన్ తీసుకో. చల్లారి పోతుంది'' అన్నది మల్లిక, ముసిముసినవ్వులను తల్లికి కన్పించనీయకుండా.

''రైటో! ఇంక టిఫెన్ తింటాం'' హరికృష్ణ టిఫెన్ ప్లేట్‌ను అందుకుని ఉప్మాను ఉండగట్టి నోట్లో వేసుకున్నాడు.

''బంగారంలాంటి సంబంధాలు తప్పిపోయినందుకు ఏడవక సంతోషిస్తున్నారు. వీళ్ళకు తెలివి యెప్పుడు వస్తుందో? ఏమో?'' అనుకుంటూ భ్రమరాంబ వంటింట్లోకి వెళ్ళింది.

''మల్లికా!... ఈ సంధ్యారాణి ... ఎవరై వుంటుందంటావ్? ఆ పుండరీకాక్షయ్య పంపిన పుండాకోర్ కాదుగదా?''

''లేదు, లేదు అన్నయ్యా! ఆ అమ్మాయి చాలా మంచిది. ఎంత వినయంగా, ఎంత విధేయతగా, ఎంత ఆప్యాయంగా మాట్లాడిందో తెలుసా?''

''అతివినయం ధూర్తలక్షణం! అది పుండరీకాక్షయ్య సీక్రెట్ ఏజంటు! గూఢచారిణి! నా కంటబడితే ఆమె అసలురంగు బయటపడుతుందని మధ్యాహ్నంపూట వస్తున్నది. అసలు ఆఫీసులలో పనిచేసేవాళ్ళు ఆఫీసులు వదిలి, గంటలు గంటలు స్నేహితుల ఇండ్లలో బాతాఖానీ వేయడం ఏమిటి?''

''అన్నయ్యా! నాకు అలా అనిపించలేదు. ఆ పిల్ల చాలా మర్యాదస్తురాలు. [illegible] బాబాయి కంపెనీలో టైపిస్టులట! [illegible] పైగా ఆమె, స్వరూపరాణీ ఫ్రెండ్‌లట!''

''అది ఇంకా డేంజర్! [illegible] స్నేహితురాలి [illegible] వెయ్యి అబద్ధాలు ఆడివుంటారే [illegible] ఉంటున్నదేమో?''

''ఆ ధోరణి కనిపించలేదన్నయ్యా! స్వరూపరాణిని గురించి అడిగితే [illegible] చక్కనిది, బుద్ధిమంతురాలు! అన్నది. స్వరూపరాణిని మనచేత [illegible] చేయడానికి అనవసరపు మాటలు ఏమీ అనలేదు. పైగా స్వరూపరాణికి నిన్ననే పెండ్లిచూపులు జరిగాయని ఆమె [illegible] చెప్పింది. [illegible] స్నేహితురాలిని మనచేత వప్పించేటట్లైతే ఆమె ఆ సంగతి మనకు చెబుతుందా?''

జరిగిన కథ–7 : సంధ్య, స్వరూపరాణి స్నేహితురాండ్రు. సంధ్య గుంటూరులో టైపిస్టుగా పనిచేస్తోంది. ఆరోజు స్వరూపరాణి పెండ్లిచూపులు అవటంవలన రోజూకంటె ముందుగా విజయవాడకు వస్తున్న సంధ్య ట్రయిన్‌లో పెండ్లికొడుకు హరికృష్ణను చూసి, అతను స్వరూపరాణికి తగడనుకొంటుంది. అతన్ని తన ప్రక్కన ఊహించుకొని ఆనందిస్తుంది. హరికృష్ణ విషయంలో ఎటూ తేల్చి చెప్పలేకపోతుంది స్వరూపరాణి. సంధ్య హరికృష్ణ ఇంటికి వెళ్ళి అతని తల్లి భ్రమరాంబను, చెల్లి మల్లికనీ తన వాక్చాతుర్యంతో ఆకట్టుకొంటుంది. గిరిజ తన జీవితంలో జరిగిన మరుపురాని సంఘటనను ఒక కథగా వ్రాసి చదవమని సంధ్యకిస్తుంది. ఆ కథను చదివిన సంధ్య బాధపడి, దాని ఆఖరు పేరాను కొంచెము మార్చి వారపత్రికకు పంపిస్తుంది. హరికృష్ణ, స్వరూపరాణిని పెండ్లి చేసుకోవటానికి ఇష్టపడడు. అతను సంధ్యకు పెండ్లి అయిందో లేదో తెలుసుకోవటానికి అనేక ప్రయత్నాలు చేస్తుంటాడు.

హరికృష్ణ ఉప్మాను చకచక తింటూ ఆలోచనల్లో పడ్డాడు. మల్లిక ఆర్గ్యుమెంటు సరిగానే వుంది. ఉప్మా తినివేసి, చెయ్యి కడుక్కుని మంచినీళ్ళు త్రాగి రక్కున అన్నాడు – ''మల్లికా! మీ సంధ్యారాణికి నట్స్ లూజ్! కంటిచూపులో లోపం వుంది! బుర్ర తక్కువ! పూర్ జడ్జిమెంట్! స్వరూపరాణిని చక్కనిది అనడంలోనే ఆమె తెలివితేటలు తెల్లం అవుతున్నాయి. బ్యాంక్ పరీక్షకు వెళ్ళొద్దని చెప్పు. ఆమె పరీక్షలో పాస్ అవదు. అయినా ఇంటర్వ్యూలో ఇంటి కెళ్ళాల్సిందే! ఒకవేళ ఇంటర్వ్యూబోర్డు మెంబర్లు నిద్రమొహంగాళ్ళైతే ఆమెకు ఉద్యోగం వస్తే దేశం సంద్రగోళంలో పడిపోతుంది. మంచినోట్లేవో దొంగనోట్లేవో ఆమె గ్రహించలేదు. బ్యాంకులు దివాల యెత్తుతాయి. మహాతల్లీ! మల్లికా! దేశాన్ని రక్షించు తల్లీ! బ్యాంకులను రక్షించు! మన దేశపు ఆర్థిక వ్యవస్థను రక్షించు!''

ఇలా హరికృష్ణ డ్రమెటిక్‌గా అంటూంటే మల్లిక పకపక నవ్వుతున్నది. భ్రమరాంబ కాఫీ కప్పును తీసుకొనివస్తూ మల్లిక వంక తీవ్రంగా చూసింది. మల్లిక వేళ్ళను నోటికి అడ్డం పెట్టుకుని నవ్వును అణుచుకోలేక సతమతమౌతుంటే, భ్రమరాంబ కాఫీ కప్పును హరికృష్ణకు ఇచ్చింది.

''ఏంటా వెకిలినవ్వులు? ఏ సంబంధమూ కుదరక పెండ్లిగాక మీరు పడిపోతే రేపు లోకం మిమ్మల్ని చూసి ఇట్లాగే నవ్వుతుంది.''

''అదికాదమ్మా! అన్నయ్య సంధ్యారాణిని గురించి అన్నమాటలు వింటూంటే నవ్వు వచ్చిందమ్మా! సంధ్యారాణికి బుర్ర తక్కువట! చూపు లోపం అట! బ్యాంక్ పరీక్షలు పాస్ అవదట!''

''ఏంకాదు! ఆ పిల్ల ముఖంలో తెలివి తాండవిస్తున్నది. మీ అన్నయ్యగారి తెలివికి నీవు సంతోషించాల్సిందే! చూసిన పిల్లను గురించి తెలుసుకోలేడు. లోకం అంతా కోడై కూస్తున్నా మనవాడికేం తెలిసింది?''

''లోకం అంతా కోడై ఏమని కూస్తున్నదమ్మా?'' కాఫీ సిప్‌చేసి అన్నాడు హరికృష్ణ.

''స్వరూపరాణి చక్కనిదని!''

''అమ్మా! ఒక్కమాట! సంధ్యారాణినీ, అన్నయ్యనూ పక్కపక్కల నిలబెడితే యెట్లా వుంటుందే? ఈడూజోడుగా వుండదూ?'' హఠాత్తుగా అన్నది మల్లిక.

ఆ మాటతో భ్రమరాంబ ముఖంలో దీపాలు వెలిగాయి. హరికృష్ణకు కాఫీ త్రాగుతుంటే పొరతప్పి దగ్గి కాఫీని పాంటుమీదా, షర్టుమీదా పోసుకున్నాడు కంగారుగా.

భ్రమరాంబ ముఖంలో వెలిగిన దీపాలు చప్పున ఆరిపోయాయి. రెండొందలయాభై రూపాయల ఉద్యోగంకోసం విజయవాడ నుండి గుంటూరుకు ప్రతిరోజూ రైల్లో తిరిగే పిల్ల.

ఆర్థిక పరిస్థితులు ఏంటో ఊహించగలిగింది. హరికృష్ణకు ఈడూజోడు అయిన పిల్ల చిక్కితే సంతోషమే! కాని, హరికృష్ణ మీద వచ్చే కట్నంతో మల్లిక పెండ్లి చేయాలనిగదా భ్రమరాంబ సంకల్పం?

"మల్లికా నీవు నోరుమూసుకో! నోటి కెంత వస్తే అంత మాట్లాడ్డమేనా?" అని భ్రమరాంబ మల్లికను గద్దించింది.

"మల్లికా! మహాతల్లీ! ఇదా నీ వదినె సెలెక్షన్? ఆ గుడ్డి అమ్మాయినీ, బుర్రలేనిదాన్నీ, నట్స్ లూజ్ అమ్మాయినీ నాకు సెలెక్ట్ చేశావా తల్లీ? ఎందుకమ్మా నీకు నామీద అంత కోపం?"

"అదిగాదన్నయ్యా!..." అని మల్లిక ఇంకా ఏంటో అనబోతుంటే, "మల్లికా! నీవు మాట్లాడకు!" అని మల్లికతో అని హరికృష్ణతో ఇలా అన్నది, "నాయనా! పోనీ! పుండరీకాక్షయ్య సంగతి తేలిపోయింది. మరి ఆ ఎక్సైజు ఆఫీసర్ మరదలి సంబంధం అయినా చూస్తావా?"

"కానీ అమ్మా! తొందర ఏముంది? ఈతడవ పద్ధతి మార్చాలి. ముందా అమ్మాయి ఫోటో చూడాలి. ఆ తరువాత మీరిద్దరూ వెళ్లి ఆ అమ్మాయిని చూడాలి. ఆ తరువాత నా సంగతి!" అంటూ హరికృష్ణ లేచి వాహ్యాళికి బయలుదేరాడు.

భ్రమరాంబ ఎక్సైజ్ ఆఫీసర్ సంబంధాన్ని గురించి ఆలోచిస్తున్నది.

స్వయంవరం

11

రాత్రి ఏడుగంటలకు సంధ్యారాణి తన గదిలోకి వచ్చి భుజానికి తగిలించుకున్న బాగ్‌ను తీసి టేబుల్ మీద పడేసి ఉస్సురన్నది.

"సంధ్యా!" అని పిలిచింది, ఆ గదిలోనే మేగజైనును చూస్తూవున్న స్వరూపరాణి.

"ఓ! నీవా? స్వరూపా?" అంటూ సంధ్య మంచంమీద వాలిపోయింది అలసటగా

"అరగంటనుండి నీకోసం ఎదురు చూస్తున్నాను."

"ఏంటి సంగతి? హైద్రాబాద్ కుర్రాడు నచ్చాడా?"

"సంధ్యా! నీవు చాలా రాష్‌గా ఆలోచిస్తావే? నా పరిస్థితిలో నీవే వుంటే?"

"ఏంటే? నీ పరిస్థితులు?"

"ఆ కుర్రాడు నాకంటే పొట్టి, పొడుగో తేలలేదు."

"పక్కపక్కన నిల్చుని కొల్చుకోక పోయారటే?"

స్వరూప రివ్వున వచ్చి సంధ్య భుజంమీద చరిచింది. సంధ్య "అబ్బా!" అని వీపు నిమురుకుని, "స్వరూపా! నోటితో మాట్లాడమని నీకు లక్షసార్లు చెప్పాను" అన్నది.

"లేకుంటే ఏంటే? పెండ్లిచూపులకు వచ్చినవాడి పక్కన నిల్చొమంటావా?"

"మరెలా తేలుతుంది? నీవు మీ బాబాయిని నమ్మవు!"

"కాదే! చాలా చిక్కొచ్చింది. ఆ అబ్బాయి కొలతలు బాబాయి తీసుకున్నాడట! నా కొలతలూ చూసి, నేను ఆ అబ్బాయికంటే రెండంగుళాలు తక్కువ అని తేల్చారు."

సంధ్యకు వినుగనిపించినా ఆ భావాన్ని బయట పెట్టలేదు.

"కానీ, అతడ్ని చూస్తుంటే ఖచ్చితంగా నా అంత ఎత్తు వుంటాడనిపించింది."

"పోనీ, మీ బాబాయికి చెప్పకపోయావా?"

"చెప్పానే!"

"మరి ఆయన ఏమంటాడు?"

"ఇప్పుడేంటో—మగాళ్లకు గూడా హైహీల్డు షూస్ వచ్చాయట! అవి వేసుకుంటే మూడంగుళాలు ఎత్తుగా కనబడతారట!"

"ట! ట! అంటావు? మరి పెండ్లికొడుకు ధరించిన బూట్లేంటో చూడలేదా?"

"చూశానే! కానీ, కన్పించలేదు. ఎలిఫెంట్ బాటం పాంటు వేసుకున్నాడు. కూర్చున్నా బూట్లు గూడా ఆ పాంట్‌లో మునిగిపోయాయే!"

"మరి దగ్గరకెళ్లి కాస్త ఆ పాంట్ ఎత్తి చూడకపోయావా?"

స్వరూపరాణి రివ్వున విసరిన చేతిని దోవలోనే

పట్టుకొని, దెబ్బతగలకుండా చూసుకుంది సంధ్య

"స్వరూపా! నోటితో మాట్లాడమని, చేత్తో మాట్లాడవద్దని లక్షసార్లు చెప్పాను!"

"సారీ సంధ్యా! నీవు నా సమస్యలను సీరియస్‌గా తీసుకోవడంలేదు. నన్ను ఆటలు పట్టిస్తున్నావని నా అనుమానం!" బుంగమూతి పెట్టి, అన్నది స్వరూప

"లేదు స్వరూపా! నీవు మీ బాబాయి మాటలు నమ్మావు! నీకు సందేహం తీర్చుకునే ధైర్యం లేదు! మరిక ఏం చేయాలి?"

"అవును ఏం చేయాలి?"

"పోనీ! మిగతా సంగతులు చెప్పు!"

"ఏం మిగతా సంగతులు?"

"ఆ అబ్బాయి ఎలా ఉన్నాడు? అందగాడేనా? రంగేమిటి? బలంగా ఉన్నాడా?"

"ప్చ్! చామనఛాయ! నాకంటే ఒక ఛాయ తక్కువే అనవచ్చు! కానీ కుర్రాడు, అర్భకుడిలాగా ఉన్నాడు నా వెంట సినిమాకు వస్తే, అక్కాతమ్ముడు సినిమాకు వెళ్ళినట్లుంటుందిగాని, మొగుడూ పెళ్ళాం, సినిమాలకు వెళ్ళినట్లుండదే!"

"ఊ! స్వరూపా! నీ మనస్సు నాకు అర్థం అయిందే! కుర్రాడు బ్యాక్‌గ్రౌండ్ బాగుంది కాని, కుర్రాడు బాగాలేడు! కనుక నీవు డైలమాలో పడ్డావు సెలెక్టు ఆర్ నాట్ టు సెలెక్టు!— అన్న క్లాసికల్ డైలమాలో పడ్డావు! అవునా?"

"కరెక్టు సంధ్యా! ఇప్పుడు బుర్రను ఉపయోగిస్తున్నావు?"

"థ్యాంక్స్! అయితే ఓ పని చెయ్! ఇదీ పెండింగులో పెట్టు! లోకం గొడ్డుపోలేదు! ఇంకేం సంబంధాలూ లేవటనా?"

"ఉన్నాయట! బాబాయి ఒక పెద్ద లిస్టే పట్టుకొచ్చాడు— హైదరాబాద్‌నుండి!"

"వెరీ గుడ్! ఇంకేం? డిటైయిల్స్ నీకు తెలుసునా?"

"ఇదిగో లిస్టు!" అంటూ ఓ పావుటావు కాగితాన్ని తీసి సంధ్యకిచ్చింది స్వరూప! సంధ్య లిస్టును తీసుకుని పరిశీలిస్తున్నది

లిస్టులో మొత్తం ఏడు సంబంధాల వివరాలున్నాయి లక్షరూపాయల కట్నం తీసుకునే సంబంధం దగ్గరనుండి, పదివేల రూపాయల వరకూ తీసుకునే సంబంధాలవారి వివరాలున్నాయి ఆ కాగితంలో

ఒక సంబంధం ప్రక్కన సిరాతో ఆస్ట్రిచ్ మార్కు పెట్టబడివుంది ఆ గుర్తు స్వరూప పెట్టుకుని ఉంటుందని సంధ్య ఊహించి ఆ సంబంధం వివరాలు పెద్దగా చదివింది

"మిస్టర్ రూపేష్ కుమార్! వయస్సు ఇరవై ఎనిమిది సంవత్సరాలు జీతం రెండువేల పైమాట! కట్నం ముప్పై ఐదువేలు! ప్రస్తుత నివాసం ఎయిర్‌ఫోర్స్ సెంటర్, హైదరాబాద్"

"అవును సంధ్యా! ఆ సంబంధం బాగున్నట్లుంది!" అన్నది స్వరూప ఉత్సాహంగా.

"మరి కట్నం ముప్పై ఐదు వేలటగా! అంత కట్నం మీ నాన్నగారు ఇవ్వగలరా?"

"ఆఁ! ముప్పై ఐదువేలు, అని వాళ్ళు వీటీ తగిలించుకున్నంతమాత్రాన, అంతా ఇస్తారా ఎవరన్నా? గీచి గీచి పాతికవేలకు లాక్కురాగలడు మా బాబాయి!"



రేపటి సుఖం కోసం ....

— ఫోటో యస్ సూర్యనారాయణ

"పోనీ పాతికవేలేననుకో! అదైనా మీ నాన్నగారు ఇవ్వగలరంటావా?"

"కొద్దిగా ఇబ్బందిపడవచ్చు! ఎలాగూ, ఇరవైవేలు దగ్గర పెట్టుకుని కూర్చున్నారు — నా పెండ్లి కోసం! ఇంకో అయిదువేలు కట్నంలోకి మరో అయిదువేలు ఖర్చులకీ సర్దలేకపోరు!"

"రైట్ స్వరూపా! గో అహెడ్! నన్నడిగితే, మిలిట్రీ ఆఫీసర్లను కళ్ళు మూసుకుని పెండ్లి చేసుకోవచ్చు వాళ్ళు రెడీమేడ్ హస్బెండ్స్!"

"అదేంటే?"

"అదంతే! వాళ్ళను మిలిట్రీలోకి తీసుకోబోయేముందే, సవాలక్ష ప్రశ్నలు వేస్తారు ఆఖరుకు లక్ష రూపాయల కట్నం ఇచ్చిన ఆడపిల్ల తండ్రిగూడా, అన్ని ప్రశ్నలు అడుగరు"

"ఏం ప్రశ్నలే?"

"అబ్బాయీ! నీ తల్లి బ్రతికి ఉందా? లేకపోతే, ఏ రోగంతో చచ్చింది? నీకు తండ్రి, సోదరులు, సోదరీలు, తాత, అవ్వ వగైరాలు బ్రతికి ఉన్నారా? చచ్చిపోతే ఏ రోగాలతో చచ్చిపోయారు? ఇలాగా — అన్న మాట!"

"అదేంటే? అంతా విడ్డూరం! వాళ్ళంతా బ్రతికితే వీళ్ళకెందుకు? చస్తే వీళ్ళకెందుకు?"

"అవునే! వెనుక పెద్దవాళ్ళు, ఆడపిల్లకు సంబంధం చూస్తే ఇవన్నీ చూసేవారు. అలా ఎందుకడుగుతారంటే, వంశ పారంపర్య రోగాలు — ఉదాహరణకు క్షయ, డయబటీస్, మూర్ఛలు — ఏమైనా ఉన్నాయేమో తెలుసుకోడానికి"

"ఆఁ!"

"ఇలా ఆ కుర్రాడికి దైహికంగా, మానసికంగా, వంశపారంపర్య రూపేణా ఏమాత్రం లోసుగు కన్పించినా సెలెక్టు చేసుకోరు!"

"అబ్బ! ఎన్ని కఠిన నియమాలే, మిలిట్రీ ఆఫీసర్ కావడానికి?!"

"మరి ఆ మిలిట్రీ ఆఫీసర్‌ను పిలిపిస్తావా పెండ్లి చూపులకు?"

"పిలిపించాలనే ఉందే! రేపు బాబాయికి చెప్తాను!"

"సరే కానీయ్!"

"మరి వస్తాను సంధ్యా!" అంటూ స్వరూపరాణి, సంధ్య చేతిలోని లిస్టు కాగితాన్ని తీసుకుని వెళ్ళిపోయింది

"దీనికి ఈ జన్మలో పెండ్లి గాదు! 'అన్నీ వున్నాయి! అల్లుడి నోటిలో శని వుంది!' అన్న అనుభవజ్ఞుల వాక్యాలకు, స్వరూపరాణి ఎక్జాంపుల్!" అని, విషాదంగా అనుకుంది సంధ్య

12

మరునాడు ఉదయం ఎనిమిది గంటలకల్లా మేడం సరోజిని నీట్‌గా అలంకరించుకుని, విజయవాడ స్టేషన్‌లో వెయిటింగ్ రూం దగ్గర నిల్చుని ఆతృతగా ఎదురుచూస్తున్నది — సంధ్య కోసం!

ఎనిమిది ఇరవైదాకా సరోజిని విసుగ్గా అటూ ఇటూ తిరిగింది, తనను పలుకరించిన ఇతర అమ్మాయిలను పెద్దగా పట్టించుకోకుండా

దూరంగా సంధ్య కనబడడంతో, సరోజిని ముఖం వికసించింది "సంధ్యా!" అంటూ కేకపెట్టి, చెయ్యి ఊపింది సంధ్య నేరుగా ఆమె దగ్గరకొచ్చి, "నమస్తే మేడం!" అన్నది

"రా! రా! నీకోసం చూస్తున్నాను!" అని సరోజిని సంధ్య భుజంపైన చెయ్యివేసి, ప్లాట్‌ఫాం మీదకు లాక్కొని వెళ్ళింది అక్కడ జనం కాస్త పలుచగా ఉండేచోటుకు సరోజినీ, సంధ్యా చేరారు

స్వయంవరం

"సంధ్యా! స్వరూప మళ్ళీ పెండ్లిచూపులు చూసిందటగా?!"

"అవును మేడం!"

"అయితే, గుంటూరు సంబంధం వాళ్ళు వదులుకున్నట్లేనా?!"

"అలాగే అనిపిస్తున్నది మేడం!"

సరోజిని ముఖంలో, సంతోషం కొట్టవచ్చినట్లు కనబడుతున్నది

"అయితే మేడం! గుంటూరు సంబంధం కోసం మీరు ట్రై చేస్తున్నారా?"

కించిత్తు కోపంగా అన్నది మేడం "ఎవరన్నారు?"— అని

"మొన్న మీరూ, మీవారూ గుంటూరు వచ్చారట! మీ వార్ని బ్యాంకి దగ్గర చూశానని గిరిజ అన్నది మీరూ ఆ ప్రయత్నంలో ఉన్నారనుకున్నాను!"

సరోజినికి క్షణంపాటు కోపం తారాస్థాయిని అందుకుంది క్రమంగా శాంతపడింది సంధ్య దగ్గర విషయం దాచడం అనవసరం అనుకుంది

"అవును సంధ్యా! వారు బ్యాంక్ దగ్గరికెళ్ళి కుర్రాణ్ణి చూసివచ్చారు! మా చెల్లి ఫోటో ఇవ్వమన్నాడట అబ్బాయి, తీయించాము ఈ రోజు బ్యాంక్‌కెళ్ళి ఫోటో ఇచ్చివద్దామని అనుకుంటున్నాను!"

"అదేంటి మేడం? నేరుగా అబ్బాయి దగ్గరికే వెళ్తున్నారా? వాళ్ళ పెద్దలు?"

"ఆఁ! ఎంతమంది పెద్దలులే? ఒక ముసలి తల్లి ఉందట! ముందా కుర్రాడికి ఫోటో చూపిస్తే .."

"మేడం! మరోలాఅనుకోకండి! ఈ సంబంధం మీకు కుదరదు!"

సరోజిని కోపంగా, సంధ్యను మింగేలాగా చూడ్డం మొదలెట్టింది

"అవును మేడం! అతనికో పెండ్లికాని చెల్లి ఉంది ఆ అబ్బాయికి పిల్లనివ్వబోయేవారు,ఆ చెల్లికి పెండ్లిచేసే బాధ్యతను స్వీకరించాలి! అందువల్లనే, గుంటూరు సంబంధం వద్దన్నది స్వరూప!"

"అలాగా!" అంటూ ఆలోచనలో పడిపోయింది సరోజిని సంధ్య మౌనంగా చూస్తున్నది— హరికృష్ణకు ఈ సంబంధం తప్పిపోతుందా లేదా? అన్న శంకతో

"మరి సంధ్యా! మగపెళ్ళివారు ఇలాటి గొంతెమ్మకోర్కెలు కోరడం సహజమే! మన పిల్లలకే పెండ్లిండ్లు చేసుకోలేక మనం ఛస్తుంటే ఈ బాధ్యతను ఎవరు నెత్తినవేసుకుంటారు? పోనీ, అలాగే అని ఆ తరువాత మనం పట్టించుకోకపోతే?"

సంధ్యారాణికి చిర్రున మండుకొచ్చింది అయినా తమాయించుకుని అన్నది, "మేడం! ఆ కుర్రాడి తల్లి మహా గడుసు పిండం ముందు తన కూతురికి పెళ్ళిచేసి, ఆ తరువాత అబ్బాయి పెండ్లిచేయాలని షరతు పెట్టింది"

"ప్చ్! ప్చ్!" అంటూ నిరాశగా నీరుగారిపోయింది సరోజిని

"మేడం!"

"ఆఁ!"

"స్వరూపరాణి చూసిన ఇంజినీర్ సంబంధం స్వరూపకు నచ్చలేదట!"

"వ్హాట్?! నిజంగానా?!" సరోజిని మనస్సులో వెయ్యి ఆశాజ్యోతులు వెలిగాయి

"అవును మేడం!"

"ఇక ఆ పిల్లకు ఈజన్మలో పెండ్లిగాదు"

"మీరు ఆ సంబంధంకోసం ఎందుకు ప్రయత్నించగూడదూ?"

"అందుతుందంటావా?"

"ఎందుకందదు? మీరు ఇరవై వేలు కట్నం ఇవ్వగలరుగా?"

"ఇరవైవేలు! కొద్దిగా ఇబ్బంది కావచ్చు"

"అయితే ఏం మేడం? ఒక్క ముసలమ్మ తప్ప, ముందూ వెనుకా ఎవ్వరూ లేనివాడు ఆస్తిపాస్తులూ అందచందాలు ఉన్నవాడు పైగా ఇంజనీర్!"

"అయితే కుర్రాడుఅందంగాఉంటాడటనా?"

"ఆఁ! మగాడికి అందం ఏంటండీ? మీ కంటే మీవారు ఏమంత అందంగా ఉన్నారు? మగాడికి ప్రయోజకత గావాలి! మీవారు ఎక్సైజ్ ఆఫీసర్ గదా? కాబోయే మరిదిగారు ఇంజినీర్ అయితేనే బాలన్సుడుగా ఉంటుంది"

"నిజమే! ఇరవై వేలు."

"మేడం! మీరు నిజంగా హైదరాబాద్ ఇంజినీర్ సంబంధం ట్రై చెయ్యాల్సిందేనండీ! మీరు పెద్ద ఆఫీసర్ను చేసుకొని, మీ చెల్లికి గుమస్తాగాణ్ణి చూశారంటారు జనం!"

"నిజమే సంధ్యా! చెల్లికి అన్నీ చచ్చు సంబంధాలు తెస్తున్నావని ఇంట్లో గొడవ! మరి... ఇరవై వేలు?"

"డబ్బుకోసం చూడకండి! అవతల పెద్ద సంబంధం!"

"సరే! ఆ హైద్రాబాద్ కుర్రాడి ఎడ్రస్ తెలుసా?"

"ఇంటి ఎడ్రెస్ తెలీదు —అతను పనిచేసే ఫర్మ్ తెలుసు!"

"చెప్పు!" అంటూ తన బాగ్‌లోని డైరీ తీసుకొని, రవికెలోని పెన్‌ను తీసి, చేతపట్టుకుంది

సరోజిని, సంధ్య చెప్పగా ఫర్మ్ పేరు నోట్ చేసుకుంది

"సంధ్యా!" అంటూ గిరిజ కేకవేసింది, దూరంనుండి

"పదండి మేడం! రైలు కదలబోతున్నది."

"పద!"

ఇద్దరూ చకచక నడిచి లేడీస్ కంపార్ట్‌మెంటు దగ్గరకు చేరారు


"మేడం! మరి గుంటూరు సంబంధం వదులుకున్నట్లేనా?"

"ఆఁ! ఈరోజు గుంటూర్లో దిగి, రేపు కృష్ణా ఎక్స్‌ప్రెస్‌కు ఓ టికెట్ రిజర్వు చేస్తాను రేపు మావారు హైదరాబాద్ వెళ్తారు!" అంటూ సరోజిని కంపార్ట్‌మెంటులోకి ప్రవేశించింది



'క్రోక్విల్' క్లబ్ విభాగం ప్రారంభం

'బాపూ' గౌరవాధ్యక్షతన హైద్రాబాద్‌లో 'శంకు' ఆధ్వర్యాన '78 నుంచి కొనసాగుతున్న ఆంధ్ర క్రోక్విల్‌క్లబ్ రెండు సం.లలో వైజాగ్, విజయవాడలలో రెండు ఛార్టర్‌లు ఏర్పాటు చేసుకుంది. విజయవాడ 'చార్టర్' ప్రారంభోత్సవానికి (జన 12న) 'సీరాజీ'గారిని ముఖ్య అతిథిగా తెచ్చుకున్నారు "క్రోక్విల్లర్స్"— పక్కచిత్రంలో ముఖ్య అతిథితోపాటు కూర్చున్నవారిలో కుడివైపు శంకు, శేఖర్ (విజయవాడ కన్వీనర్),కురుమద్దాలి విజయలక్ష్మి (నాటి వక్త),వేణుగార్లను రెండోవేపునుంచి ['కాటూరి'], 'అరుణ్', సురేష్ గార్లను చూడవచ్చును 'క్లబ్'కు ఆసరాగా వున్న తతిమ్మా "కార్టూనిస్టు ప్రముఖులు" ఆ వెనుక అండగా నిల్చున్నారు. అదేరోజున క్రోక్విల్‌క్లబ్ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ చార్లీచాప్లిన్ మూకీ చిత్రాల ప్రదర్శన మొదలైనవి ముచ్చటగా మూడు గంటలపాటు కొనసాగాయి.


దివ్యమైన తెలుపుకు
ఒకే దారి
క్రొత్త ఫార్ములా
డెట్
డిటర్జెంట్ ఉతికే పౌడర్
Greater Power
Extra Lather
Fresher Perfume
New Formula White Det
det
det
సాటిలేని వుతుకు శక్తి,
అదనపు నురుగు,
తాజా సువాసన మరియు
దివ్యమైన తెలుపు!
దివ్యమైన తెలుపు,
డెట్ యొక్క తెలుపు

ప్రశ్నావళి

-కె. రామలక్ష్మి.

ఏ వి. ఆర్. కె. — విజయవాడ

గోరింటాకు ఏ సీరియల్ నవల ?

★ అది సీరియల్ కాదు. సినిమాకై రాసిన నవల. అందుకే ఒకేసారి పుస్తకంగా ప్రచురించాను. ఇదివరలో జీవనజ్యోతి, కరుణ కథ కూడ సీరియల్స్‌గా వేయలేదు — సినిమాకై రాసినవి కనుక. సినీ కథలో కాస్తో కూస్తో అభిజాత్యం ఉత్ప్రేక్ష, అవాస్తవికత అనిపించే సంఘటనలు వుంటాయి. అలాగే ప్రతి ఎమోషనూ అవసరానికి మించి రెట్టింపబడుతూ వుంటుంది — ప్రేక్షకావసరాలను పట్టి. అందుకే — సినిమాకోసమే రాసిన నవలను నేను సాధారణంగా సీరియల్‌గా యివ్వను

వై. ఎస్. ఆర్ — చుండూరు

గోరింటాకులో సుజాత చేత అడుగున్నర తాడు ... అనే చోట బాస్టర్డు అనిపించారు. అంటే తెలుగులో .... అని అర్థం. లేక సెన్సారుబోర్డులో వేరే అర్థం వుందా ?

★ లేదు. అక్కడా అదే అర్థం ! అదేం — 'అన్‌పార్లమెంటరీ పదం' కాదే. పైగా — వ్యభిచార కథలు కళాఖండాలనీ, కావ్యాలనీ, అభ్యుదయ భావాలకి అద్దం పడుతున్నాయనీ— కదా నేటి ధోరణి ?! అయినా నీతీ నిజాయితీ, మంచీ చెడూ ఆలోచించుకోకుండా కనీసం మానవత్వం కూడా లేని ఓ మృగం లాంటి మనిషిని — ఏమని పిలవాలి ?!

కె. వి. ఆర్. ఎమ్. — షిరిడి

ఎంతో నమ్మకంగావున్న ప్రాణస్నేహితుడే అవసరానికి సహాయం చేయకపోవడమేకాక తిరిగి ద్రోహం చేసేవారిని ఏమనాలి ?

★ సహాయంకోసం అవసరంకోసం స్నేహం చేసిన మిమ్మల్ని మీరు ఏమనుకుంటున్నారు ? అది ఆలోచించండి ముందు.

కె. వి. ఎమ్. — కర్నూలు

జీవితం ఓ రైలుబండి —

★ నిజమే — టిక్కెట్టు రిజర్వు చేసుకోవాలికద. అందుకేకద — కావాలంటేనే — కలగాలి పిల్లలు ! అన్నాం !

జి. ఆర్. ఆర్. — చౌడేపల్లి

కష్టాలలో భాగం యివ్వడం యిష్టంలేక మౌనం వహిస్తే నిర్లక్ష్యంగా భావించడం న్యాయమా ?

★ మౌనం ఒకొక్కప్పుడు — అపార్థాలకి దారితీస్తుంది. అయినా కష్టాలు పంచుకోలేని వాళ్ళకి మీ సుఖాలు పంచుకునే హక్కు యెలా వుంటుంది ?

ఆర్. డి. పి. ఆర్. — రాయగడ

ఈ జగత్తులో అతి ఆకర్షణీయమైనది ఏది ?

★ మనసు. ఎందుకో తెలుసా ? అది కంటికి కనరాదు కనుక. ఊహకి అందదు కనుక.

ఆర్. ఎల్. డి. పి. — రామగుండం

రాజకీయ నాయకులు చనిపోతే దేశభక్తి గీతాలు వినిపించాలిగాని భక్తి గీతాలు వినిపిస్తారెందుకు ?

★ రాజకీయంలోనే వుంది కద దేశభక్తి. చచ్చాక కావలసినది ముక్తి కనుక భక్తికి టైములేని వారి మనశ్శాంతికోసం — ఈ భక్తిగీతాలు. అంతే

బి. ఎస్. — వల్లభాపురం

సినిమాలలో కోతులయిన వాలి సుగ్రీవులకు తోకలు చూపిస్తారు. గాని వారి భార్యలకు తోకలు చూపించరెందుకు ?

★ దీన్నిపట్టే తెలియడంలేదా చిట్టితండ్రీ— మగవాడు కోతి అయినా ఫరవాలేదు — అందమైన భార్యను కోరుకుంటాడని !

కె. ఆర్. — వైజాగ్

కూర్చుని రాసి రాసి వ్యాయామం లేక లావెక్కిపోతున్నట్టున్నారు. రాతలు మాని ఆంధ్రదేశం పర్యటించ రండి...

★ వద్దామనే వుంది - ఏ మంత్రిణిగానో ! !

వి. ఎస్. ఎమ్. — చంద్రాపూరు

మీ జవాబులు చాలా ఆసక్తిదాయకంగా వుంటున్నాయి. సంతోషం. "మంచి మనిషికో మాట. మంచి గొడ్డుకో దెబ్బ" అన్న శాస్త్రం యీ రోజుల్లో పనిచేయడంలేదు...

★ నిజమే. రోజులు మారాయి సోదరీ, గొడ్డుని బాదక్కరలేదు. మనిషిని బాదీ లాభంలేదు !

బి. ఆర్. ఎమ్. — విజయవాడ

తీయని మాటలు నమ్మవచ్చా ?

★ మోసం ఎప్పుడూ తీయని మాటల్లోనే పొదగబడి వుంటుంది.

ఆర్. పి. — కర్నూలు

మీ నారీ దృక్పథం చదివాను. ఇన్ని విషయాలు తెలిసిన మీ మెదడు, ఇన్ని విషయాలను గురించి ఆలోచించే మీ మెదడు పగిలిపోదా !

★ మీరు మరీను ! మెదడు పగిలి ప్రవహించకుండానేకదా గట్టి పుర్రె !

బి. ఆర్. డి. — హైదరాబాదు

ఫామిలీ ప్లానింగు అంటూ తెగ అంటారే, కొన్ని మతాలవారు దీని జోలికే పోడంలేదు. దీనికి కారణం ? ప్రభుత్వం వారిని ఎందుకు మనని ఒత్తిడి చేసినట్టు చెయ్యదు ?

★ వారు మైనారిటీ కమ్యూనిటీల కింద లెక్క. మనతోబాటే వుంటున్నా — వారికి ప్రత్యేక సదుపాయాలుంటాయి. హిందూమతం చాలా ఫ్లెక్సిబుల్ — దేన్ని అయినా 'సరి' అని భరిస్తుంది. హిందువులూ అంతేనని ప్రభుత్వం నమ్మకం ! అందుకే — జనాభా కంట్రోలు మనమీద. రెండుతరాలో మూడుతరాలో గడిచిపోయాక — మన 'ఓట్లు' తక్కువ అయిపోతాయి. ఓట్లు తక్కువ కులాలకి అధికారం ఎలా వస్తుంది ?... రాజకీయాలు చాలా గమ్మత్తుగా వుంటాయి కదూ ? దేశం మొత్తంమీద తరతమ భేదం లేకుండా అమలుజరుపవలసిన — విషయం — ఫామిలీ ప్లానింగు.. దాన్లో మినహాయింపులకి — అర్థం వేరనడం అబద్ధం కాదు.

సంధ్య సంతృప్తిగా నిట్టూర్చి. సరోజిని వెనకాలే వడిచి, గిరిజ ప్రక్కన కూర్చున్నది.

"సంధ్యా ! స్వరూపరాణి మళ్లీ పెళ్లిచూపులు చూసించటగా ?" అని ఒక అమ్మాయి ప్రశ్నించింది.

"ఆ గుంటూరు సంబంధం వదులుకున్నట్లేనా ?" మరో అమ్మాయి ప్రశ్న.

సంధ్య వాళ్లకు సమాధానం చెప్పబోతుంటే, సరోజిని ఛర్రున మండిపడ్డది.

"ఎప్పుడూ పెండ్లిండ్లు, పెండ్లికొడుకులు, పెండ్లిచూపుల గొడవలేనా ? అందుకే మగాళ్ళు మనలను గేలిచేసేది. ఇంకే సబ్జక్టు అయినా వర్ణించండి !" అన్నది సరోజిని తీవ్రంగా. దాంతో అమ్మాయిలు టక్కున నోరు మూసుకున్నారు. అయితే గిరిజమట్టుకు నోరు మూసుకోలేదు

"మేడం ! ఆడదానికి మగాడు, మగాడికి

స్వయంవరం

ఆడది — మించిన సబ్జెక్టు మరోటి లేదు. సృష్ట్యాదినుండీ ఇంతే. కాకుంటే రోగలక్షణాలు, కాలానుగుణ్యంగా మారుతుంటాయి. ఒక కాలంలో — కులం, మతం — ఒక కాలంలో — ఆస్తి అంతస్తు — మరో కాలంలో కన్యాశుల్కం — నేడు — వరకట్నం — ఇవీ రోగలక్షణాలు ! అయినా పాపం, ఈ అభంశుభం తెలీని ఆడపిల్లలను, పెండ్లిని గురించీ, పెండ్లికొడుకులను గురించి, మాట్లాడుకోవద్దనడం అన్యాయం ! పెండ్లిండ్లై ప్రతిరోజూ సంసారాలు చేసేవాళ్లే, పెండ్లి సంగతుల యావలోపడి, కొట్టుకుంటున్నారు." అన్నది గిరిజ.

ఆ మాటతో సరోజిని ముఖం మాడ్చుకుంది. మిగతా అమ్మాయిలు ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు.

"గిరిజా ! వరకట్నం గురించి డిస్కస్ చేద్దామే !" అన్నది ఒక పిల్ల.

"ఓ. కే !" అంటూ గిరిజ, రైలు గుంటూరు చేరేదాకా అనర్గళంగా ఉపన్యసించింది.

గుంటూరు స్టేషన్‌లో దిగి గిరిజ, సంధ్య స్టేషన్ దాటి, బజార్లో నడుస్తున్నారు.

"ఏంటే సంధ్యా ? స్వరూప పెండ్లిచూపుల సంగతి ఏమైందట ? స్వరూప, ఆ ఇంజనీర్ని గూడా రెఫ్యూజ్ చేసిందా ?"

సంధ్య, గిరిజకు స్వరూప విషయాలన్నీ చెప్పింది. దాంతోపాటు సరోజిని సంగతులు గూడా చెప్పింది.

"సంధ్యా ! అయితే, సరోజిని చెల్లెలికి గుంటూరు సంబంధం తప్పించావన్నమాట !"

"నాన్‌సెన్స్ ! అదేంకాదు ! సరోజిని చెల్లెలికి, మంచి సంబంధం చెప్పాను."



daCunha GCM-16 T.L

''మళ్ళీ పుండరీకాక్షయ్య గుంటూరు వచ్చాడు!''

''ఎప్పుడు ?''

''మన బండిలోనే!''

''అహా!''

''సంధ్యా! నా దగ్గరకూడా కొన్ని విషయాలు దాస్తున్నట్లున్నావు!''

''నీ ముఖం! అసలు నీకు అలా ఎందుకు అనిపించింది ?''

''స్వరూప నీకు అన్ని సంగతులు చెబుతుంటుంది గిదా ? వాళ్ళ గుంటూరు సంబంధం గురించి ఇంకా ఆశలు వదులుకోనట్లుంది. స్వరూపకు కాంపెటిషన్ రాకుండా సరోజినిని హైద్రాబాద్ మీదికి పంపుతున్నావు ? అవునా ?''

''కాదు!''

''మరి పుండరీకాక్షయ్య గుంటూరెందుకు వస్తున్నాడంటావు?''

''లక్ష పనులు ఉండొచ్చు!''

''ఏం కాదు! ఆయనకుండే పనులన్నీ విజయవాడ, ఏలూరు, మచిలీపట్టణంలలో ఉంటాయి! గుంటూరు వస్తున్నాడంటే, ఆ అందగాడి సంబంధం మాట్లాడడానికే! అయినా, స్వరూప ఈ గుంటూరు కుర్రాడ్ని నచ్చలేదని వేరే సంబంధం చూసుకుందిగదా ! మళ్ళీ ఈయన ఈ సంబంధం కోసమే ఎందుకు ప్రయత్నిస్తున్నాడంటావు?''

''ఏమో గిరిజా! అయినా ఆయన ఈ సంబంధం చవకగా చిక్కుతుందన్న అభిప్రాయం ఏమో?''

గిరిజ, సంధ్య చీలిపోయి ఎవరి ఆఫీసులకు వారు వెళ్ళిపోయారు.

సంధ్యకు గిరిజ మాటలు చెవిలో గింగురు మంటున్నాయి. ఒకవేళ పుండరీకాక్షయ్య, హరికృష్ణ ఇంటికే వెళ్తున్నాడేమో ? వెళ్తే పెండ్లి సంబంధం మాట్లాడుతాడు. భ్రమరాంబ — ''ఏమయ్యా! పెద్దమనిషీ! మీ అమ్మాయికి వేరే సంబంధం చూశారటగా!'' అని నిలదీస్తే? ''మీకెలా తెలిసింది?'' అని ఆయన అడిగితే? 'సంధ్యారాణి చెప్పింది' అంటుంది. అలా వాళ్ళు చర్చించుకుంటే, తన సంగతి బయటపడుతుందా? బయటపడితే? ఎంతవరకు వాళ్ళు గ్రహించగలరు? హరికృష్ణవాళ్ళ ఆ పోర్షన్‌లో చేరబోయే ముందు ఆ పోర్షన్‌లో ఉన్న ఇంజినీర్‌గారి అమ్మాయీ, తనూ స్నేహితులు కారనీ, కేవలం తను బుకాయించి హరికృష్ణ కుటుంబంతో పరిచయం చేసుకున్నగి అని గ్రహించగలరా? భ్రమరాంబ, పుండరీకాక్షయ్య సంభాషణల వల్ల తేలదు. కానీ ఇంటివాళ్ళను ఇద్దర్నీ కలిపి అడిగితే తన విషయం బయటపడుతుంది. అంతదూరం వెళ్తుందా? వేరే సంబంధం చూసుకున్నాక ఈ పుండరీకాక్షయ్య ఇంకా హరికృష్ణనుపట్టుకొని వ్రేలాడడం ఏమిటి?

ఏమైనా, తను చాలా జాగ్రత్తగా ప్రవర్తించాలి! ఆ భ్రమరాంబకుగానీ, మల్లికకుగానీ, తను హరికృష్ణను ప్రేమిస్తున్నది అన్న అనుమానం కలిగితే చాలా ప్రమాదం! ఇంక ఇంటికి రానీయరు!

స్వయంవరం

హరికృష్ణ ఇంటిలో ప్రవేశం లేకుంటే హరికృష్ణ ప్రేమను తను పొందడం అసంభవం!

కాబట్టి, మళ్ళీ ఏదో పెద్ద ప్లాన్ వేయాలి! ఏ పరిస్థితులలోనూ భ్రమరాంబకు, మల్లికకు అనుమానం రాకుండా చేయాలంటే ఏం చేయాలి?

ఇలా ఆలోచించుకుంటూ సంధ్య ఆఫీసులోకి అడుగుపెట్టింది.

''హలో! సంధ్యా!'' అన్న పిలుపు వినబడింది ఆఫీసులో కాలుపెట్టగనే.

సంధ్య పిలుపు వచ్చిన దిక్కుగా చూసింది. ఒక పెద్ద టేబిల్ వెనుకగా, ఇరవైమూడు సంవత్సరాల వయస్సు కలిగిన యువకుడు కూర్చుని ఉన్నాడు. హిప్పీ క్రాపు, దవడలంతా పరుచుకుని ఉన్న సైడ్ బర్న్స్, బుర్రమీసాలు కలిగిఉన్నాడతడు.

''నమస్కారం అన్నయ్యగారూ!'' అంటూ సంధ్య అతనికి ఎదురుగాఉన్న కుర్చీలో కూర్చుంది.

''శీఘ్రమేవ కళ్యాణ ప్రాప్తిరస్తు'' అంటూ చెయ్యెత్తి కొంచెం హాస్య ధోరణిలో అన్నాడు గిరిబాబు, నాగభూషణం గారి ఏకైకపుత్రుడు.

''సారీ! అన్నయ్యా! నీ దీవెన ఫలించదు! తిరిగి తీసేసుకో!''

''అదేంటి? మన దీవెన వ్యర్థం కావడానికి వీలులేదు!''

''అబ్బా! అంత గొప్పవాక్సుద్ధి ఉందా నీకు? ఉన్నా లాభంలేదు బదర్! మనం బ్యాంక్ ఉద్యోగానికి అప్లై చేశాం!''

''ఓస్! ఇంతేనా? నీకు బ్యాంక్ ఉద్యోగం వస్తే మన దీవెన ఇంకా శీఘ్రంగా ఫలిస్తుంది''

''ఎలాగా?''

''ఎలాగంటే చెబుతానుండు! ఈ నడుమ మా ఫ్రెండ్ ఒకడు పెండ్లి చేసుకున్నాడు ! వాడి ఫ్రెండ్‌షిప్ మానేద్దామా, వద్దా, అని తర్జనభర్జనలు పడుతున్నాను.''

''ఇది మరీ బాగుంది ! మీ ఫ్రెండ్ పెండ్లి చేసుకుంటే, నీవు అతని స్నేహం మానుకోవడం ఏంటి ? కొంపదీసి ఘటిక బ్రహ్మచారుల సంఘాన్ని స్థాపించావేంటి ?!''

సంధ్య మాటలకు గిరిబాబు సన్నగా నవ్వి అన్నాడు,''అలాంటిదేమీలేదు సంధ్యా ! ఈ విషయం చెప్పాలంటే, నాకు ఇష్టం ఉండదు ! నేనూ, వాడూ వరకట్నం తీసుకోకుండా పెండ్లాడాలని ప్రమాణం చేశాము. కానీ వాడు ప్రమాణాన్ని తప్పాడు !''

''నిజమా ? మీ ఫ్రెండ్ కట్నం తీసుకుని పెండ్లి చేసుకున్నాడా ?''

''తీసుకోలేదనే బుకాయిస్తాడు! కానీ సంగతి ఇది ! నీవు చెప్పు ? వాడి తలిదండ్రులు కట్నం తీసుకోవాలని, వాడు తీసుకోనని భీష్మించుకుని కూర్చున్నారు. తీరా జరిగిందేమంటే, వాళ్ళ పెద్దలు పెండ్లి సంబంధాలు చూశారు. మేము కట్నం తీసుకోము అనిగూడా అన్నారు. ఆ పిల్ల ఒక బ్యాంకులో అసిస్టెంటు, ఆ అమ్మాయి మూడేండ్లుగా బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తున్నదట! ఆమె సంపాదన ఈ మూడేండ్లలోనూ కలిసి ఇరవైవేల రూపాయలు అయిందట! కాబట్టి స్త్రీ ధనం, ఆ తలిదండ్రులు వాడుకోగూడదు గనక పెండ్లినాడు వసూలు చేసుకున్నాడట, వాడి తండ్రి. 'అది కట్నంగాదు!' అంటాడు మా ఫ్రెండ్! నీవు చెప్పు? అది కట్నం అవుతుందా ? కాదా ?''

''డెఫనెట్‌గా, అది కట్నమే !''

''దట్స్ ఎ గుడ్ గర్ల్!'' అంటూ గిరిబాబు డ్రాయర్ లాగి, ఒక పేకెట్‌ను తీసి, సంధ్య చేతికిచ్చాడు.

సంధ్య పేకెట్‌ను పరిశీలించి ఏంటన్నట్లు చూసింది.

''తీసిచూడు !''

సంధ్య పేకెట్ విప్పి చూసి, నిర్ఘాంత పోయింది. అందులో ఒక ఫారెన్ నైలెక్స్ చీర, రవికెబిట్ వున్నాయి.

''ఏంటిది ? ఎవరికి ?''

''నీకే!''

తెరిచివున్న పాకెట్‌ను టేబుల్‌మీద పెడుతూ, ''నాకెందుకు అన్నయ్యా ?'' అన్నది.

''సంధ్యా! అది నీవు తీసుకునితీరాలి! లేకుంటే, ఇక నీతో మాట్లాడను!'' అన్నాడు పసిపిల్లవాడిలాగా బుంగమూతిపెట్టి, గిరిబాబు

సంధ్య పాకెట్‌ను తీసుకుంది.

''గుడ్ గర్ల్ ! సంధ్యా ! నన్ను చూసి, అంతా అనుకుంటారు. ఆహా ! వాడికేం ? లక్షాధికారి బిడ్డ! అని. కానీ, నాలో ఎన్ని తీరని కోరిక లున్నాయో తెలుసునా ?''

''నీకా ?! తీరని కోరికలా ?!''

''ఏమ్మా ? నేను మనిషిని కానా ?''

''చెప్పు ? నీ తీరని కోరికలేంటో ?''.

''నాకు ఒక అన్నయ్య వుండాలి. అక్కయ్య, చెల్లి, తమ్ముడు వుండాలని నా కోర్కె !''

సంధ్య పకపక నవ్వింది. నవ్వును ఆపుకుంటూ ''ఓ నాయనమ్మ వద్దా ?!'' అన్నది.

''గుడ్ ఐడియా ! ఓ నాయనమ్మగూడా ఉంటే, ఎంత బాగుంటుంది! హాయిగా కథలు చెప్పి వుండేది, నా చిన్నతనంలో.''

సంధ్య సడెన్‌గా సీరియస్సైపోయింది.

''అన్నయ్యా ! నీకు తెలీదు ! వీళ్ళంతా నీకు లేరుగాబట్టి, నీకేంటో కొరవ అయినట్లు బాధ పడుతున్నావు. అన్నాదమ్ముళ్ళంటే అసూయ లుంటాయి. అక్కాచెల్లెళ్ళంటే, అక్కసులుంటాయి. నాయనమ్మలుంటే, చాదస్తాలతో ప్రాణాలు తీస్తారు నాకు, అందరూ వున్నారు. ఉండి, నేనేం సంతోషపడుతున్నాను ?''

''అవి మీ కుటుంబ పరిస్థితులు గావచ్చు !''

''చాలా కుటుంబాల్లో అంతే! ఊఁ! పోనిద్దూ, ఇంతకీ కలకత్తా ట్రిప్ ఎలా వుంది ?''

''బ్రహ్మాండంగా వుంది !''

''విశేషాలు చెప్పు ?''

గిరిబాబు కలకత్తాను గురించి, చుట్టు ప్రక్కల వున్న ముఖ్య ప్రదేశాలు గురించి వివరించాడు.

[ఇంకా వుంది]

కాళరాత్రిలో హాస్యం-పాకం

''సార్ !'' అని పిలుచుకుంటూ చంద్రం (రంగనాథ్) సరాసరి వంటగదిలోకి వచ్చాడు మిరపకాయలు నూరుతూన్న నాగలింగం (రాజ్‌బాబు) ''వచ్చావటోయ్, చంద్రం ? ఒక్క నిమిషం అన్నం వార్చేశాను అయిదే అయిదు నిమిషాల్లో వేపుడు కూర జిహ్వాకంటుకునేలా వండిపారేస్తాను ఆ తర్వాత పరుగుపందెంతో వెళ్లిపోదాం ఫాక్టరీకి రా . ముందీ కారాన్నోపట్టు పట్టు,'' అంటూ చంద్రాన్ని కూర్చోబెట్టి, తాను పొయ్యి ముందు కూర్చున్నాడు

చంద్రం నూరుతూ, ''ఎందుకు సార్ మీకీ శ్రమ ? పెళ్ళి చేసుకుంటే హాయిగా వండి పెడుతుందిగా ఆ వచ్చే ఇల్లాలు ?'' అన్నాడు

''ఇంకా నాకు పెళ్ళేమిటోయ్—సగం పరువు సంతలో పోతే, ఉన్న పరువు ఊళ్ళోపోయినట్టు ! నాక్కు నచ్చిన పిల్ల కాకపోయినా — నన్ను మెచ్చిన పిల్లయితే చాలని వెదుక్కునే సరికి వయసిలా బెండకాయలా ముదిరిపోయింది అదేం ఖర్మో, చంద్రం! ఇంటికి ఇల్లాలుదొరక్కపోతే పోయింది— కనీసం వండిపెట్టడానికైనా ఓ వంటమనిషి దొరకడం లేదయ్యా !''

''మిమ్మల్ని, మీ అవతారాన్నీ చూసి ఝడుసుకుంటుందేమో! ఇదిగోండి — నూరేశాను ''

''ఏదీ — ఇలా ఇవ్వు ఒక్క మిరపకాయ, రెండు ఆవగింజలు వేసి, తాలింపు వేస్తాను మనిషికి పొడిగింపు, బట్టకు బాడింపు లాగ — కూరకు తాలింపు లేకపోతె అది కూరే కాదు ''

''సార్ ! అవతల టైమైపోతోంది ఇవాళ్టికి సరిపెట్టండి మిమ్మల్ని కరెక్ట్‌గా తొమ్మిది గంటలకు తీసుకురమ్మని ప్రొప్రయిటర్‌గారు చెప్పారు ''

''తెల్సులేవోయ్ కారుకు రిపేరొచ్చిందని చిన్న అబద్ధం చెప్పేసెయ్ !''

''ఏమండీ ! ఇంతకీ, మీరు వస్తారా—రారా?''

''బాగుందయ్యా నువ్వనే మాట ఈ వనంతా దేనికి ? ఆఫీసుకు రావడానికేగా ?''

చంద్రం విసుక్కుంటూ వెళ్ళిపోయాడు

ఈశ్వరీ చిత్ర ''కాళరాత్రి'' వన్నెల చిత్రాన్ని

సినిమా విశేషాలు -జి. వి. జి.

సి చంద్రశేఖరరెడ్డి కధ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో పి. బలరామరెడ్డి, జి రెడ్డిశేఖర్ నిర్మించారు భీశెట్టి లక్ష్మణరావు సంభాషణలకర్త


కృష్ణంరాజు సమర్పణ- దాసరి

''ఫిబ్రవరి 18 నుంచి మద్రాసులో, మార్చి 21 నుంచి విశాఖపట్నంలో, ఏప్రిల్ 1-నుంచి కన్యాకుమారిలో జరిగే షూటింగ్‌తో చిత్రం పూర్తవుతుంది,'' అన్నారు ''సీతారాములు'' వన్నెల చిత్రాన్ని నిర్మించే జయకృష్ణ ''తొలి సంధ్య వేళలో, తొల పొద్దు పొడుపులో'' అనే దాసరి గీతం ఇటీవల సత్యం స్వరకల్పనలో రికార్డ్ చేయబడింది దేవులపల్లి, రాజశ్రీ కూడా గీతాలు రాశారు కృష్ణంరాజు, జయప్రద, సత్యనారాయణ, మోహన్‌బాబు, అల్లు రామలింగయ్య, జయమాలిని వగైరా నటవర్గం. స్వామి ఛాయాగ్రాహకుడు భాస్కరరాజు శిల్ప దర్శకుడు దాసరి రచన దర్శకత్వంలో జయకృష్ణా మూవీస్ నిర్మాణం,

''ఆకాశంలో భూకంపం''

కె బాలచందర్ దర్శకత్వంలో ఎం ఎస్ రెడ్డి పై చిత్రాన్ని నిర్మిస్తారు కౌముదీ ఆర్ట్స్ మరో చిత్రం ''జడకుచ్చులు''లో చంద్రమోహన్, రాజ్యలక్ష్మి నాయకా నాయికలు





"సర్కస్ రాముడు"లో అన్నంతో సర్కస్

రాజా వేషంలో ఉన్న సర్కస్ రాముడు స్పూన్స్‌తో భోంచేయడం చూసి, జయ చకితురాలైంది "ఏంటి, బావా! అమెరికా వెళ్ళాక పద్ధతులు మార్చేశావా? ఇంతకుముందు స్పూన్స్‌తో తినమంటే 'బంగారంలాంటి చేతులు ఉండగా స్పూన్స్ ఎందుకు?' అనేవాడివి!"

సర్కస్ రాముడు తుళ్ళిపడ్డా — వెంటనే తేరుకొని, "అబ్బే—అదేంలేదు, జయా! అమెరికాలో చేత్తోటి తినేవి ఏమీ ఉండవు స్పూన్స్‌తోనే తినాలి— ఆ అలవాటు .." అంటూ అన్నంతో సర్కస్ చేస్తున్నట్టు— చేత్తో అంతా కలిపాడు

ఆ కలపడం చూసి, జయ ఆశ్చర్యపోయింది "బావా, నువ్వు అన్నం కలుపుతుంటే చూడ ముచ్చటగా ఉండేది!"

"ఏం?"

"కొంతమంది అన్నం ముచ్చటగా కలుపుతారు. కొంతమంది అన్నం అంతా కలుపుతారు"

రాజా తడబడ్డాడు

దాసరి నారాయణరావు కథ స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వంలో కోవై చెళియన్ నిర్మించిన కె సి ఫిలిమ్స్ వన్నెలచిత్రం "సర్కస్‌రాముడు" ఫిబ్రవరి 21న విడుదల. ఎన్.టి.ఆర్ ద్విపాత్రధారి జయప్రద, సుజాత, ప్రభాకరరెడ్డి, రావు గోపాలరావు, మోహన్‌బాబు, అల్లు రామలింగయ్య, త్యాగరాజు, కె. వి చలం, అశోక్‌కుమార్, చలపతిరావు, ఏచూరి, వీరభద్రరావు, రాఘవయ్య, సావిత్రి, జయమాలిని, ఝాన్సీ, స్వర్ణ పాల్గొన్నారు సహ దర్శకులు రేలంగి నరసింహారావు, నందం హరిశ్చంద్రరావు అసోసియేట్ డైరెక్టర్ రాధాకృష్ణ సంగీతం, ఛాయ, శిల్పం, కూర్పులను మహదేవన్, కన్నప్ప, భాస్కరరాజు, బాలు నిర్వహించారు డి కోటేశ్వరరావు నిర్మాణ సారథి

ఓ ఇంటి బాగోతంలో వారాల అబ్బాయి

భారతదేశపు నిరుద్యోగ పట్టభద్రుల్లో చంద్రం (చంద్రమోహన్) ఒకడు వారాలు చేసుకొని చదువుకున్నాడు ఉద్యోగం ఉన్నా లేకపోయినా — ఆకలి ఊరుకోదుగా? అందుకని ఇంకా వారాలమీదే బతుకుతున్నాడు వారంలో మిగిలిపోయిన ఒక్క పూట కోసం లక్ష్మీపుత్రుడు, లక్షల అధికారి చిల్లర కనకభూషణరావు ఇంటికివచ్చాడు ఎంగిలి చేత్తో కాకిని కూడా తరమడానికి ఇష్టపడని కనకభూషణరావు ఇంట్లో లేని సమయంలో ఆయన భార్య సుందరమ్మ(రమాప్రభ)ఆప్యాయంగా అన్నం వడ్డించింది ఆదరాబాదరాగా తింటున్న చంద్రం వంక సుందరమ్మ కూతురు అంజనీదేవి (శాంతిశ్రీ కృష్ణకుమారి) కళ్ళప్పగించి చూస్తోంది

"చిల్లర కనకభూషణరావుగారంటే— ఓహోహో ఎంత పేరు? మీకు మాత్రం — సుందరమ్మగారంటే ఎంత ప్రతిష్ట!" చంద్రం మాట్లాడుతూ తినడంలో వెక్కిళ్ళొచ్చాయి దేవి



'సర్కస్ రాముడు'లో....

మంచినీళ్ళు అందించింది తాగి, మళ్ళీ మొదలెట్టాడు "వారాల రాయుడిలా చదివాను ప్రస్తుతం ఉద్యోగం వేటగాణ్ణి ఇప్పటికి పదమూడుచోట్ల ఏర్పాటు చేసుకున్నాను కొంచెం నెయ్యి!" సుందరమ్మ నెయ్యి వేశాక మళ్ళీ తన ధోరణి కొనసాగించాడు "మరో పూటమిగిలింది అంతా మీ పేరు చెప్పేవారే!" అంజనీదేవి వంక చూస్తూ, "అన్నట్టు మీ పేరు చెప్పారుకాదు," అన్నాడు

"అంజనీదేవి" బుగ్గల నిండా సిగ్గు పులుముకుంటూ చెప్పింది

"లక్షణంగా ఉంది చాలా సంతోషం!"

"సంగీతం కూడా వచ్చండి"


"పాడతారా అండీ?" దిగులుగా అడిగాడు ఆ అమ్మాయి నిజంగా పాడడానికి సిద్ధపడడం చూసి, "భోజనంచేశాక వింటానండి," అన్నాడు వాళ్ళలా మాట్లాడుతూ ఉండగానే చిల్లర కనకభూషణరావు (నూతన్‌ప్రసాద్)వచ్చాడు మాయాబజార్‌లో ఘటోత్కచుడిలా తన ఇంటిని అప్పడంలా నమిలేస్తున్నట్లు కనిపిస్తున్న చంద్రాన్ని చూస్తూ, కోపంతో పళ్ళు పటపటలాడించాడు

నవతా ఆర్ట్స్ "ఓ ఇంటి బాగోతం" హాస్యరస ప్రధాన వన్నెల చిత్రాన్ని దేవదాస్ కనకాల దర్శకత్వంలో ఎన్. కృష్ణంరాజు నిర్మిస్తున్నారు

డైరెక్టర్ లక్ష్మి

"ఈ డైరెక్షన్ ఎందుకు చేపట్టానోకాని, రాత్రిళ్ళు ఓ పట్టాన నాకు కునుకు పట్టడంలేదు ప్రతి రాత్రీ మర్నాడు తీయబోయే సీన్‌ల గురించి ఆలోచనే తొలిసారిగా దర్శకత్వం వహిస్తున్నానన్న భయం కాదు అసలు నేనే కార్యాన్ని చేపట్టినా శ్రద్ధ తీసుకొని, సీరియస్‌గా చేస్తాను," అంటుంది లక్ష్మి

'కట్టా మీటా' హిందీ చిత్రం ఆధారంగా కళాకేంద్రంవారు నిర్మించే "మసాలా పట్టాభిశం" తమిళ చిత్రానికి కె బాలచందర్ పర్యవేక్షణలో లక్ష్మి దర్శకత్వం నెఱపుతోంది ఆ చిత్రానికి సంభాషణలు రాస్తున్న విసు కొన్నిచోట్ల ద్వంద్వార్థాలు ప్రయోగించాడట. "నేను నటించే చిత్రాల్లోనే ఇలాంటి మాటలకు అభ్యంతరం చెప్తుంటాను ఇక, నేను దర్శకత్వం వహించే చిత్రంలో ఎలా అనుమతిస్తాను?" అందట లక్ష్మి



"బొమ్మలకొలువు"లో థీమ్ సాంగ్

ఎస్ రాజేశ్వరరావు స్వరకల్పనలో పి సుశీల బృందం గానం చేసిన ఆత్రేయ గీతాన్ని వినిపించారు నిర్మాత హెచ్.సిరాజు ప్రకాశం..

"బొమ్మల్లారా బొమ్మల్లారా కొలువుతీరారు
ఈ తొమ్మిది రోజులు తోడూనీడగ
కలిసి ఉంటారు
అందరిని కలుపుతు ఉంటారు
రంగుల తేడా చూడరాదని
రాజా పేదా ఉండరాదని
జాతి మతాలను మాపెయ్యాలని
మనుషులు చేసిన మట్టిబొమ్మలు—
దేవుడు చేసిన తోలుబొమ్మలకు
బోధించేదే బొమ్మల కొలువు
మన బొమ్మల కొలువు..."

"నెగిటివ్ కట్టింగ్ స్టార్ట్ చేశాం సమయం చూసుకొని విడుదల చెయ్యడమే తరువాయి" అన్నారు అప్సర ఆర్ట్స్‌వారి ఈ వన్నెల చిత్రాన్ని సమర్పించే నిడమర్తి సత్యం చంద్రమోహన్, కవిత, పల్లవి, కాంచన, జగ్గయ్య, ప్రసాద్‌బాబు, కాంతారావు ప్రభృతులు పాల్గొన్నారు. బొల్లిముంత శివరామకృష్ణ సంభాషణలకర్త భాస్కరరావు ఛాయాగ్రాహకుడు కొమ్మినేని దర్శకుడు.

శ్రీదేవి సినీతారగా

శ్రీదేవి స్వంతంగా ఓ తమిళ చిత్రాన్ని సి వి రాజేంద్రన్ దర్శకత్వంలో నిర్మిస్తోంది అందులో ఆమె ఓ సినిమా తార భూమికను నిర్వహిస్తోంది తాను తారాపథాన్ని అందుకోడానికి కారకులైన అసంఖ్యాక అభిమానులలో ఎవరో ఒకరిని తన జీవిత భాగస్వామిగా ఎన్నుకోదలుస్తుంది ఓ తార ముగ్గురు ఆ అవకాశానికి అర్రులు చాస్తారు. 1 డ్రయివర్ 2 మెకానిక్ 3 విద్యార్థి ఆ అదృష్టానికి ఎవరు నోచుకుంటారనే అంశంమీద అల్లబడిన కథ

"నిజానికి నేనసలు సినిమా నటి అవుతానని కలలో **కూడా** అనుకోలేదు," అంటుంది శ్రీదేవి "అసలు నన్ను బాగా చదివించాలనే ఉద్దేశ్యంతోనే మధుర నుంచి మద్రాసుకు మకాం మార్చారు మా నాన్నగారు ఇక్కడ గుడ్ షెపర్డ్ కాన్వెంట్‌లో చేరాను క్లాసులోకి ప్రవేశించగానే కొందరు విద్యార్థినులు నా చుట్టూ చేరి, 'వెల్‌కమ్ ఫ్రెండ్ నాతో ఫ్రెండ్‌షిప్ చేస్తావా? నా పెన్సిల్ ఉంచుకో నా పేనా కావాలా? ఇదో చాక్‌లెట్ చాక్‌పీస్ కావాలా?' అంటూ తలా ఒక్కొక్కటి నాకు కానుకగా ఇచ్చారు ఉబ్బి తబ్బిబ్బయిపోయాను. తొలిరోజే ఇన్ని కానుకలా! మర్నాడు స్కూలుకు వెళ్లేసరికి 'నా పెన్సిల్ ఏదీ? నా చాక్‌లెట్ నాకిచ్చేయ్ నేనిచ్చిన చాక్‌పీస్ ఎక్కడ? నా పేనా తిరిగి ఇచ్చేయవూ?' అంటూ వాళ్ళు క్రితం రోజు ఇచ్చిన వస్తువులన్నిటినీ అడిగి లాగేసుకున్నారు వాళ్ళవంక తెల్లబోతూ చూశాను. ఈ ఒక్కరోజు భాగ్యానికి వాళ్ళా కానుకలు అలా ఇచ్చి పుచ్చుకోవడమెందుకో!

'అదృష్టవంతుడు'లో....

"ఆ కాన్వెంట్‌లో చదువుకునేటప్పుడే 'తుణైవన్' చిత్రంలో బాలసుబ్రహ్మణ్యస్వామిగా నటించడానికి దేవర్‌గారి వద్దనుంచి నాకు పిలుపు వచ్చింది అలా సినిమా రంగంలో ప్రవేశించడంతో నా చదువుకు ఫుల్‌స్టాప్ పడిపోయింది," అంది శ్రీదేవి

సినిమా

దేవుడిచ్చిన కొడుకులో పెంటయ్య పటాటోపం

ఫాక్టరీ బయట ఓ చెట్టుకింద కుర్చీలో కూర్చొనున్నాడు పెంటయ్య (అల్లురామలింగయ్య) ఎదురుగా చేతులు కట్టుకొని వినయంగా బెదురుతూ చూస్తూ నిలుచోనున్న కార్మికులనుద్దేశించి, ''మీకు తినడానికి తిండి, కట్టు బట్ట దొరికాయంటే కారణం ఎవరు ?'' అన్నాడు

''దేవుడు'' అని వాళ్ళలో ఒకడు జవాబిచ్చే సరికి పెంటయ్యకు అరికాలిమంట నెత్తికెక్కి నట్లయింది ''నోర్ముయ్! విసనకర్రల వీర వెంకట పెంటయ్య — నేనేరా మీ అందరికీ పెద్దదిక్కుని పిచ్చివేషాలు వేశారా — నిమిషంలో మిమ్మల్ని పీకిపారేస్తాను,'' అంటూండగా గోపి (కృష్ణ) వచ్చాడు. అతన్ని చూసి, ''ఈ సూపర్‌వైజర్ పెంటయ్య చిన్న చిన్న వాళ్ళెవర్నీ చూడరు కావాలంటే వెళ్లి గజపతిరావుగార్ని కలుసుకో,'' అన్నాడు పెంటయ్య విసుగ్గా,

''ఆయనే నన్ను పంపించారండీ — ఉద్యోగం కోసం,'' అన్నాడు గోపి

''చూడు, తమ్ముడూ! అందమైన పిల్ల, అవసరమైన ఉద్యోగం — అరచేతులో అదృష్టం ఉంటే దొరుకుతాయిగాని, గజపతిరావుగారు చెప్పినంతమాత్రాన పరిగెత్తుకురావు ఈ ఫాక్టరీ ఎవరివల్ల నడుస్తోందో, ఎలా నడుస్తోందో ఆయనకు తెలుసా ? అనుగ్రహం వస్తే చాలు — డబ్బిమ్మని, ఉద్యోగాలిమ్మని సత్రకాయలందర్నీ పంపించేస్తాడు. ఇదిగో గాలి లేకపోయినా — ఎక్కడైనా ఆకులు కదుల్తాయేమోగాని, మన పర్మిషన్ లేకుండా ఇక్కడ మనుషులు కూడా కదలరు ఇకనుంచి ఇలాంటి ఆర్డర్లు ఇవ్వొద్దని ఈరోజే గజపతిరావుగారికి ఆర్డర్ పంపిస్తాను,'' అంటూ రీవిగా వెనుతిరిగిన పెంటయ్య, అక్కడ పాతేస్తూ గజపతిరావు (సత్యనారాయణ)ను చూడగానే ఉలిక్కిపడి, హడలిపోయాడు ''త్ త్ త్... తమరా!''

''చిత్తం, పెంటయ్యగారూ! తమ అనుమతి లేకుండా ఇతన్ని మన ఫాక్టరీలో ఛీఫ్ సూపర్‌వైజర్‌గా వేశాను,'' అన్నాడు గజపతిరావు

''వేసేశారా ? తమరు వేశారంటే ఆ మనిషి అన్నివిధాలా తగినవాడన్న మాటే! మనిషి అంగుళం అంగుళం కొలిచేస్తారు నేను సూపర్‌వైజర్ ఈయన ఛీఫ్ సూపర్‌వైజర్ - వీరికి నేను పనంతా నేర్పాలి అంతేగా ?'' అంటూ గోపి వంక తిరిగి, ''అయ్యా ఛీఫ్‌గారూ! దయచెయ్యండి,'' అన్నాడు పెంటయ్య వెర్రి నవ్వుతో

గోపి, గజపతి నవ్వుకున్నారు


కె ఎస్ ఆర్ దాస్ దర్శకత్వంలో బాబ్జి, పి సాంబశివరావు నిర్మించిన త్రిమూర్తి ప్రొడక్షన్స్ ''దేవుడిచ్చిన కొడుకు'' వన్నెల చిత్రం త్వరలో విడుదలవబోతోంది.



'మహాలక్ష్మి'లో ఒక దృశ్యం

"మదనమంజరి కథ"

దర్శక నిర్మాత బి విఠల ఆచార్య త్వరలో ప్రారంభించే పై జానపద వన్నెల చిత్రంలో రంగనాథ్, జయమాలిని నాయకా నాయికలు. విఠల ఆచార్యగారి ద్వితీయ పుత్రుడు డాక్టర్ శశిధర్‌కు సౌ॥ రేఖ, ఎం. ఎస్‌సి తో జనవరి 23న మద్రాసులో వైభవోపేతంగా వివాహ మహోత్సవం జరిగింది



ఫిల్మోత్సవ్'80- స్వారస్యం

''ఫిల్మోత్సవ్‌కు మీరు బెంగళూరుకు రాలేదా? రాకపోవడమే మంచిదయింది లెండి ఒకటి రెండు చిత్రాలు తప్ప మిగతావేవీ అంత ఆసక్తికరంగా లేవు'' అన్నారొక నిర్మాత ''కొన్ని చిత్రాలు మరీ బోర్ కొట్టాయి రెండు మూడు థియేటర్‌లలో టిక్కెట్ సొమ్మును ప్రేక్షకులకు వాపస్ చేసేశారట కూడా ఈ సెన్సార్ కాని చిత్రాల్లో శృంగారం పాలు ఎక్కువగా ఉంటుందని బ్లాక్‌లో సైతం టిక్కెట్లు కొన్న ప్రేక్షకులకు - అది కాస్తా లేకపోయేసరికి చాలా నిరాశ కలిగింది'' అని అన్నాడి ఒక దర్శకుడు ''రోమన్ పొలాన్స్కీ చిత్రాలు పలువురిని ఆకర్షించాయి మాకు ఉపయోగపడే చిత్రాలేవీ లేవు'' అని ఒక సినీ కథకుని అభిప్రాయం ఈ చిత్రాలలో కొన్నిటిని ప్రదర్శించిన ''సంతోష్ థియేటర్'' అద్దాల మందిరం లాంటిది తారలు, దర్శక నిర్మాతలు ఎక్కువగా ఆ థియేటర్‌కే వచ్చేవారట తారాభిమానులు ఎక్కడ గొడవ చేసి అద్దాలు పగలగొడతారేమోనన్న భయంతో ''మీ అభిమానులవంక చూస్తూ చేతులూపకండి'' అనే స్లయిడ్‌ను ఆ థియేటర్‌లో ప్రతి ఆటకూ చూపించేవారట

1980లో చిత్రాల సంఖ్య

ఏ నమ్మకంతో పత్రికా ప్రకటనలు ఇస్తున్నారో గాని— చిత్ర నిర్మాణంలో ఏమాత్రం అనుభవం లేకుండా రంగప్రవేశం చేసిన కొత్త నిర్మాతలు కొందరు తాము నిర్మించదలచిన చిత్రం ప్రారంభోత్సవం తేదీతోపాటు అది విడుదలయ్యే తేదీయే కాకుండా తదుపరి చిత్రం గురించి కూడా వివరాలు అందజేసేస్తున్నారు. ఇదిలా ఉండగా— మరో వంక అనుభవజ్ఞులైన కొందరు పాత నిర్మాతలు మాత్రం ''వెంటనే కొత్త చిత్రానికి పూనుకోడం లేదండి కాస్త గేప్ ఇవ్వదలచాం'' అనడం తరచు వినిపిస్తోంది ఈ తాత్కాలిక నిర్ణయానికి కారణాలు ఏమైనా— చిత్రాల నిర్మాణ సంఖ్య కాస్త తగ్గడం చిత్ర పరిశ్రమకు అన్నివిధాలా శ్రేయస్కరమని పరిశ్రమలోని పలువురు ప్రముఖుల అభిప్రాయం

దర్శక రచయితకు తాపీ పంజాయిషీ

తమిళ దర్శక రచయిత కె ఎస్ గోపాలకృష్ణన్ యిటీవల తమిళ పత్రికాకర్తల గోష్ఠిలో ''పాలాభిషేకం'' చిత్రంలో శ్రీప్రియచేత నటింపజేయడానికి ఎంత శిలివ్ వేస్ట్ చేయవలసివచ్చిందో! ఇప్పుడా నటి తమిళ దర్శకులు తగరని ఒక తెలుగు డైరెక్టర్‌ను తన సొంత చిత్రానికి ఎన్నుకుంటుందా? ఇది తమిళ దర్శకులను కించపరచినట్లు కాదా?'' అన్న ఆరోపణకు శ్రీప్రియ సమాధానమిస్తూ, ''దాసరి నారాయణరావుగారు అత్యద్భుతంగా డైరెక్టు చేసిన 'శివరంజని' తెలుగు చిత్రం కర్నాటకంలోనూ, మన తమిళనాడులోనూ విశేషంగా ప్రేక్షకులను ఆకర్షించింది అదే చిత్రాన్ని నేను తమిళంలో తీస్తున్నప్పుడు ఆయనకు మించి


రచయితలకు మనవి

కథలు పంపేవారుకూడా విడిగా తపాలా బిళ్లలు పంపటం, లేదా కథ పంపిన కొంత కాలానికి తపాలా బిళ్లలు పంపటం చేయవద్దని మనవి కథల పరిశీలనకు ఆరు నుంచి పది వారాలు పట్టవచ్చును కథ ప్రచురణామోదం పొందిన వెంటనే రచయితకు కార్డు ద్వారా తెలియజేస్తాము నవలల విషయంలో ఏ విషయం తెలియటానికి నాలుగు మాసాలు పట్టవచ్చును ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదని మరోసారి మనవిచేస్తూ — మాతో రచయితలంతా పై నిబంధనల విషయంలో సహకరించాలని కోరుతున్నాము కలర్ ట్రాన్స్‌పెరెన్సీలు పంపేవారు గూడా తిరుగు టపా కవరు పెట్టడం అవసరం సం॥

ఎవరు న్యాయం చేకూర్చగలరు! 'కైకొడుత్త దైవం' తమిళ చిత్రంలో 'సుందర తెలుగు' అనే భాషాభేదాలు తగదన్న అమరకవి భారతి సుప్రసిద్ధ గీతాన్ని ప్రవేశపెట్టిన గోపాలకృష్ణన్‌గారు ఇప్పుడిలా ఆరోపించడం సబబా? నా తదుపరి చిత్రం 'కాదోడిదాన్ పేశువేన్'కు ఎం ఎ ఖాజాను దర్శకునిగా నియమించాను దీంతో నేను మన హిందువులకు విరోధినని ఎక్కడ ప్రచారం జరుగుతుందో! ఇకపోతే— నా వల్ల చాలా ఫిలిమ్ వేస్ట్ అయినట్లు ఆయన చెప్పారు అందులో ఎంత నిజముందో ఆయనకు— ఆయన అంతరాత్మకే తెలుసు'' అందట

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర

రామకృష్ణా సినీ స్టూడియోస్ పతాకంలో హరికృష్ణ నిర్మాతగా కె రాఘవేంద్రరావు దర్శకత్వంలో ''రౌడీ రాముడు — కొంటె కృష్ణుడు'', కె బాపయ్య దర్శకత్వంలో 9వ చిత్రం అనంతరం ఎన్ టి ఆర్ నిర్మాణం, దర్శకత్వంలో ''శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర'' తెరకెక్కుతుంది



'వేంకటేశ్వర మహాత్మ్యం'లో జ్యోతిలక్ష్మి

శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ మహాత్మ్యంలో విష్ణువర్థనరాజు పంతం

పెనుగొండ ప్రభువువద్దనుంచి రాయబారానికి వచ్చిన భాస్కరాచార్యులను చూడగానే విష్ణువర్ధనుడు "గురుదేవులకు అభివాదం శాంతిప్రియులైనవారిప్పై దాడిచేసి అశాంతి రేకెత్తించుట మాకు మాత్రము సంతోషమా ఏమి? ఇంతకూ, లగ్నపత్రిక తెచ్చితిరా - లేదా?" అన్నాడు

"మీ సందేహములోనే సమాధానమున్నదికదా తేలేదని," అన్నాడు భాస్కరాచార్యులు

"మరి, మీ రాక దేనికి?"

"మహారాజా! మా వాసవాంబ తన వీణా గానముతో మీ మనస్సున అమృతపు జల్లు కురిపించినదే! మీ రామె హృదయమున నిప్పులవాన కురిపించుట ధర్మమేనా?"

"పరవశించి మేము బహూమతి ఇవ్వబోగా - ఆ దురహంకారులందర్నూ తృణీకరించి మాట్లాడుట ఉచితమేనా?"

"బహుమతి ఇచ్చువారి భావన కలుషమైనప్పుడు నిరాకరించుట దోషము కాదుకదా? తండ్రివంటి మీరే పంతగించి ఆ కన్యను వివాహమాడెదననుట గౌరవభాజనము కాదు, మహారాజా! ఆమె తన జీవితమును ఆ పరమేశ్వరికే అంకితమొనర్చినది. ఆమెకు వివాహకాంక్షయే లేదు."

"వివాహకాంక్ష ఆమెకున్నదో - లేదో అనవసరం. మేము మా ప్రతిజ్ఞ తీర్చుకొనక తప్పదు"

భాస్కరాచార్యులుగా జగ్గయ్య, విష్ణువర్ధనుడుగా ప్రభాకరరెడ్డి నటించిన మణి ఆర్ట్ ఎంటర్‌ప్రైజెస్ "శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ మహాత్మ్యం" వర్ణ చిత్రాన్ని కమలాకర కామేశ్వరరావు దర్శకత్వంలో గంజి మునుస్వామి, మారంశెట్టి కేశవరావు నిర్మించారు. చిల్లర భావనారాయణ రచయిత ఎస్ రాజేశ్వరరావు సంగీత దర్శకుడు

శ్రీకాంత్ పిక్చర్స్‌కు కె. ఎస్. ఆర్. దాస్ --


"ఫిబ్రవరి 8, 9న పాటల రికార్డింగ్ జరుగుతుంది," అన్నారు సుందర్‌లాల్ నహతా సమర్పించే వర్ణ చిత్రానికి దర్శకత్వం నెరపే కె ఎస్ ఆర్ దాస్ శోభన్‌బాబు, మురళీమోహన్, జయప్రద, జయలక్ష్మి ముఖ్య భూమికలు నిర్వహిస్తారు జంధ్యాల, వేటూరి, సత్యం, శ్రీకాంత్, వెంకటరత్నం, బి ఎల్ వి ప్రసాద్ సాంకేతికవర్గం "ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు తొలి షెడ్యూల్ జరుగుతుంది," అన్నారు నిర్మాత శ్రీకాంత్ పటేల్


"గ్రహణం విడిచింది" కథ ఇతివృత్తం

"పచ్చని చేలతోను, పూదోటలతోను అలరారే పల్లె అది- పసిపాపల్లాంటి మనసులుగల మనుషులను తన హృదయంలో దాచుకుందా పల్లె తల్లి... తల్లికి అందరూ ఒకేలాంటి వాళ్ళు పుట్టనట్లే- ఆ పల్లె తల్లికి కూడా ఓ మేడిపండు పుట్టింది అది పగలు మామూలు మేడిపండే కాని, రాత్రి పూట మేకవన్నె పులి అయి, తన పంజాతో అందిన పువ్వులన్నా నలిపేసి, నవ్వుకుంటూ ఉంటుంది ఎంత నవ్వే మనిషైనా ఎప్పటికో ఒకప్పుడు నవ్వులపాలు కావలసిందే-అని చెప్పే ఇతివృత్తం," అన్నారు కల్యాణ చక్రవర్తి పిక్చర్స్ "గ్రహణం విడిచింది" చిత్రానికి కథ, చిత్రానువాదం, దర్శకత్వ బాధ్యతలు వహించిన వి బోస్ మురళీమోహన్, నూతన్‌ప్రసాద్, గోకిన రామారావు, సారథి, సాక్షి రంగారావు, మిక్కిలినేని, కవిత, లక్ష్మిశ్రీ, ఝాన్సీ తారాబలం దాసంగోపాలకృష్ణ, ఎస్ ఎస్ లాల్, మారపనేని కళాధర్, అంకిరెడ్డి, రావినూరి కోటేశ్వరరావు తెరవెనుక కృషి చేశారు "త్వరలో రీ రికార్డింగ్ పూర్తిచేసి, విడుదల చేయబోతున్నాం!" అన్నారు నిర్మాతలు డి ఎం రెడ్డి, కె తేజేశ్వరరావు



'అసాధ్యులకు అసాధ్యుడు'లో ఒకదృశ్యం




VEP
VEP
మీ చర్మానికి
సహజమైన
సంరక్షణ-
వేప్
సబ్బు
మీ శరీర ఛాయను క్షీణింపజేసే అపరిశుభ్రమైన
వానిపై వేప్ సబ్బు బహు చాతుర్యంగా
పనిచేయగలదు. వేప్ నురుగు మీ చర్మంలోని
సహజమైన నూనెలను హరింపక,
జిడ్డు, మురికిని, సూక్ష్మమైన
మరకలను నిర్మూలించగలదు.
కేరళ సోప్స్ & ఆయిల్స్ లిడ్.
(ఒక కేరళ ప్రభుత్వ సంస్థ)
కాలికట్
FDS KS 2871 TEL

సినిమా

శ్రీ లక్ష్మీ ప్రొడక్షన్స్‌కు తాతినేని రామారావు

తాతినేని రామారావు దర్శకత్వంలో అట్లూరి పూర్ణచంద్రరావు తెలుగు, హిందీ భాషల్లో చెరొక చిత్రాన్ని నిర్మించడానికి నిశ్చయించారు ఎన్ టి ఆర్‌తో "జేమ్స్‌బాండ్" అనే వన్నెల చిత్రాన్ని జూలై 11న ప్రారంభిస్తారు. శ్రీదేవి నాయిక సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, రావు గోపాలరావు, అల్లు రామలింగయ్య, నూతన్‌ప్రసాద్ ఇతర ముఖ్య భూమికలను పోషిస్తారు జంధ్యాల, చక్రవర్తి, కన్నప్ప, జి వి. సుబ్బారావు సాంకేతిక సహకారాన్ని అందజేస్తారు "కార్తీకదీపం" హిందీ పరివర్తనం "మాంగ్‌భరోన్‌సజనా"! షూటింగ్ ఫిబ్రవరి 28న మొదలవుతుంది. జితేంద్ర, రేఖ, మౌశుమీ ఛటర్జీ, అస్రానీ వగైరా తారాగణం కన్నప్ప ఛాయాగ్రాహకుడు లక్ష్మీకాంత్ ప్యారేలాల్ సంగీత దర్శకులు

సంగీత - సాధన

సంగీత ఈమధ్య బాగా సన్నబడి నాజూకుగా తయారైంది "సన్నాయి అప్పన్న" చిత్రంలో చాలా చలాకీగా నటించింది. ఆమెవద్ద ఉన్న పెద్ద కారులో ఒక సైకిల్‌ను ప్రతిరోజూ వేకువయామునే బీచ్‌కి తీసుకెళ్లి, అక్కడ వ్యాయామం కోసం సైకిల్ తొక్కుతుందట



"వైతరిణి"

పై వాసిరెడ్డి సీతాదేవి నవల్ను తీరం మస్తాన్‌రావు దర్శకత్వంలో టి. కె ప్రసాద్ నిర్మాతగా నారాయణమూర్తి సమర్పిస్తారు

ప్రేమ తరంగాలు'

విజయా పిక్చర్స్ పంపిణీ సంస్థ అధినేత శ్రీ చెరుకూరి పూర్ణచంద్రరావు తొలి క్లాప్, శ్రీ డి వి ఎస్ రాజు కెమెరా స్విచ్ ఆన్‌తో ఎస్. పి చిట్టిబాబు దర్శకత్వంలో పాం. రాయపరాజు నిర్మించే ప్రభు చిత్రవారి పై వన్నెల చిత్రానికి ప్రారంభోత్సవం జరిగింది కృష్ణంరాజు, చిరంజీవి, సత్యనారాయణ, కాంతారావు, త్యాగరాజు, కె వి చలం, సారథి, భీమరాజు, కనకరాజ్, జయసుధ, సుజాత, బేబీదేవి, సావిత్రి పాత్రధారులు గొల్లపూడి సంభాషణలకర్త చక్రవర్తి స్వరకల్పనలో ఆత్రేయ, సి నారాయణరెడ్డి గీతాలు రాశారు విలియమ్స్ ఛాయాగ్రాహకుడు డి. రాజగోపాల్ సంకలనకర్త

విజయమాధవీ పిక్చర్స్‌కు వి. మధుసూదనరావు


"ఫిబ్రవరి 28న తొలి పాట రికార్డ్ చేయబడుతుంది," అన్నారు నిర్మాత వడ్డే రమేష్ కృష్ణంరాజు హీరో. సత్యానంద్, జె. వి రాఘవులు, వి ఎస్ ఆర్ స్వామి, జి జి కృష్ణారావు తెరవెనుక కృషి చేస్తారు వడ్డే కిశోర్ సమర్పణలో వి. మధుసూదనరావు దర్శకత్వం వహించే ఈ వన్నెల చిత్రం షూటింగ్ మార్చిలో మొదలవుతుందని నిర్వహణ బాధ్యతలు వహించే వడ్డే రమేష్ చెప్పారు



'శంకరాభరణం'లో మంజు భార్గవి, బాలుడు

ఆదిత్య చిత్రకు దాసరి నారాయణరావు

"మనుషులంతా ఒక్కటే" అనంతరం ఎన్ టి ఆర్, దాసరి కాంబినేషన్‌లో శిల్ప దర్శకుడు రాజేంద్రకుమార్ నిర్మించే ద్వితీయ వన్నెల చిత్రం షూటింగ్ ఏప్రిల్ నుంచి జూన్ వరకు జరుగుతుంది సత్యనారాయణ, ప్రభాకర రెడ్డి, అల్లు రామలింగయ్య, ముగ్గురు నాయికలు ఉంటారు స్వర్గీయ మహేష్ కథకుడు కన్నప్ప ఛాయాగ్రాహకుడు చక్రవర్తి సంగీత దర్శకుడు ★



దూరం



పెమ్మరాజు సంధ్యారాణి

ఇంట్లోకి అడుగుపెట్టిన కొడుకుని చూడగానే 'ఇంటర్‌వ్యూ ఎలా చేశావురా?' అని అడగాలనుకున్నాడు నిరంజనం

కానీ అడగలేకపోయాడు. నోట్లోంచి మాటలు బయటికి రాలేదు అడగడం కష్టమైన పనేమీ కాదు. అడిగిం తర్వాత అతని దగ్గర్నించీ ఎటువంటి సమాధానం వస్తుందోనని ఆ పని చెయ్యలేకపోయాడు.

ఈ ఉద్యోగమైనా వీడికొస్తే బావుం- తను వూపిరి పీల్చుకోవచ్చు...

"నాన్నా! నీకు వనజగారు తెల్సా?" హఠాత్తుగా శేఖర్ అడిగిన ప్రశ్నకు వులిక్కిపడ్డాడు నిరంజనం.

వనజ!

ఎన్నాళ్ళయింది ఆ పేరు విని...

ఏం చేస్తోందో ఇప్పుడు? బహుశా తనూ ఇలానే సంసార బాధ్యతల్తో కొట్టుకొంటూ వుండి వుంటుంది! అయినా వనజ వీడికెలా తెల్సు?

"ఏ వనజ?" ఆతృతని అణచుకుంటూ అడిగాడు నిరంజనం.

"ఆవిడే నాన్నా...చిన్నప్పుడు నువ్వు కొన్నాళ్ళు వాళ్ళింట్లోవుండి చదువుకున్నావట. వాళ్ళ నాన్నగారు మాష్టారు ... ఇవాళ నన్ను ఇంటర్‌వ్యూ చేసింది ఆమే!" ఎంతో ఆనందంగా చెప్పకు పోతున్నాడు శేఖర్.

"నువ్వు ఫలాన అని ఆవిడకెలా తెల్సు?" ఇన్నాళ్ళ తర్వాత వనజ ఇలా హఠాత్తుగా దర్శనమివ్వడమేకాక ఇంకా తనని గుర్తుపెట్టుకోవడం ఆశ్చర్యంగానూ, ఆనందంగానూ అనిపించింది నిరంజనంకి. ఒకవేళ గుర్తున్నా తన కొడుకునెలా గుర్తించగల్గింది. అతనికి అంతా అయోమయంగా వుంది.

"ఏముంది నాన్నా వెరీ సింపుల్! అప్లికేషన్ మీద తండ్రి పేరుంటుందికదా. నేను లోపలికి వెళ్ళగానే ఆమె అడిగిన మొదటి ప్రశ్న 'నువ్వు నిరంజనంగారి అబ్బాయివా?' అని..."

"నువ్వేం జవాబు చెప్పావ్?"

'ఏ నిరంజనంగారి అబ్బాయి నమకుంటున్నారు?' అని అడిగాను. మనింటిపేరు చెప్పడమే కాకుండా వూరుపేరు కూడా చెప్పి, మీరుకొన్నాళ్ళు వాళ్ళ ఇంట్లోవుండి చదువుకుంటువున్నట్లు కూడా చెప్పారు. ఆ తర్వాత ఆవిడ 'మీరేం చేస్తున్నారు? ఎక్కడ వున్నారు? ఎలా వున్నారు?' మొదలైన ప్రశ్నలడిగిందే కాని ఇంటర్‌వ్యూ చేయలేదు. బయటికి వచ్చేసేటప్పుడు 'మా ఇంటికి వస్తారా?' అని అడిగాను. 'వస్తానంటే సాయంత్రం వచ్చి తీసుకువెళ్తాను' అని కూడా చెప్పాను.

"ఇక్కడకు వచ్చి నువ్వు నన్ను తీసుకువెళ్ళడం బావుండదు. అదీకాకుండా అర్జంట్‌గా ఇవాళ సాయంత్రం ట్రైన్‌లోనే నేను హెడ్ ఆఫీస్‌కి వెళ్ళిపోవాలి. టికెట్టుకూడా రిజర్వ్ చేసుకున్నాను. ఏమాత్రం వీలున్నా మీ నాన్నగార్ని ట్రైన్‌దగ్గరకు రమ్మని చెప్ప" అంది...

వనజకి తనమీదవున్న అభిమానం ఇంకా అలానే వుందన్నమాట! ఆనందంతో వుక్కిరిబిక్కిరైపోయాడు నిరంజనం.

"నాన్నా! సాయంత్రం నువ్వు ట్రైన్ దగ్గరకి వెళ్ళినప్పుడు ఒక్కమాటన్నావంటే చాలు, నాకు వుద్యోగం గ్యారంటీ. నువ్వంటే ఆమెకి అంత అభిమానం!"

కొడుకు మాటలు నవ్వు తెప్పించాయ్ నిరంజనంకి. తన జీవితంలో అతిముఖ్యమైన విషయాన్నే ఆమె నడగలేకపోయాడు. మరి ఈ విషయాన్ని అడగ్గలడా?

"నా విషయం చెప్తావ్ కదూ?" మళ్ళీ అడిగాడు శేఖర్.

"చూస్తాలే..." ఏం జవాబు చెప్పాలో అర్థంకాక అనేసాడు నిరంజనం.

పొంగుతున్న పాలమీద నీళ్ళు చల్లినట్లయింది శేఖర్ పరిస్థితి. తండ్రి ఆమెకు తన గురించి చెప్తాడు. తనకీ వుద్యోగం తప్పకుండా వస్తుంది అని ఎంతో ఆనందపడిపోయాడు... ప్చ్...

నిరుత్సాహంగా లోపలికి వెళ్ళిపోయాడు శేఖర్.

కొడుకునలా చూసేసరికి జాలేసింది నిరంజనంకి. తనమీద తనకే కోపం వచ్చింది.

తను వట్టి అసమర్థుడు. తనకోసమేకాదు, తనవాళ్ళకోసం కూడా ఎటువంటి పరిస్థితుల్లోనూ, ఎవరిదగ్గిరా బయటపడి అడగలేడు. చిన్నప్పుడే పాతుకుపోయిన దురలవాటది! అమ్మని అన్నం పెట్టమనికూడా అడిగేవాడు కాదు. పెడితేనే తినేవాడు, లేకపోతే అలానే వుండేవాడు.

తండ్రిని పుస్తకాలు కొనిపెట్టమనికూడా అడిగేవాడు కాదు. ఒకసారి సైన్స్ రికార్డ్ కొనలేదని మేష్టారు క్లాసులోంచీ బయటికి పంపించేశారు. అయినా పుస్తకం కోసం తండ్రి నడగలేకపోయాడు ఆ విషయం పక్కింటి జయ ద్వారా తెలుసుకుని చితక్కొట్టాడు తండ్రి. అన్ని దెబ్బలయినా తను భరించగలిగాడు కాని, కావాలని అడగలేకపోయాడు. వయసుతోపాటే ఆ మొహ

మాటమూ పెరుక్కుంటూ వచ్చింది. ఎవ్వరినీ ఏమీ అడగలేకపోయేవాడు ఆ కారణంతో జీవితంలో ఎంతో పోగొట్టుకొన్నాడు

పడక్కుర్చీలో వెనక్కివాలి కళ్ళు మూసుకున్నాడు నిరంజనం గతమంతా కళ్ళముందు మెదలసాగింది

తను ఏడవ తరగతి చదువుతున్నప్పుడు హఠాత్తుగా సంవత్సరం మధ్యలో తండ్రికి ఆ వూరు నించీ ట్రాన్స్‌ఫర్ అయింది తనని వెంట తీసుకెళ్ళాలంటే కష్టం అక్కడికి, ఇక్కడికీ పుస్తకాల మార్పు ఏం చేయాలో ఎవ్వరికీ అర్థంకాలేదు.

అటువంటి సమయంలో ఆపద్బాంధవుడిలా ఆదుకున్నారు రామారావు మాష్టారు ఆ సంవత్సరం పూర్తయేవరకూ తమింట్లోనే వుంచుకుని చదివిస్తానని పట్టుబట్టారు ఫలితంగా తల్లిదండ్రులు వెళ్ళిపోయినా తనా వూళ్ళోనే మిగిలిపోయాడు

అప్పుడు తన వయసు పది సంవత్సరాలుంటాయేమో! మాష్టారు వాళ్ళింట్లో ఎంత ఆప్యాయంగా చూసినా దిగులు దిగులుగానే వుండేది

వారం రోజులు ఎలాగో భరించగలిగాడు ఆ తర్వాత తనవల్ల కాలేదు వెంటనే వెళ్ళి అమ్మని చూడాలని మరీ మరీ అనిపించసాగింది కానీ ఆ విషయం మేష్టారికి చెప్పలేదు

పెరట్లో వున్న జామచెట్టుకింద కూర్చున్నాడు గుడ్లనీరు కుక్కుకుంటూ వనజ అక్కడికి ఎప్పుడు వచ్చిందో కూడా తను గమనించలేదు

"ఎందుకూ ఏడుస్తున్నావ్!" ఆమె ఆశ్చర్యంగా అడిగేసరికి వులిక్కిపడ్డాడు తను

"అబ్బెబ్బే ఏంలేదు" గబగబా చొక్కాతో కళ్ళు తుడుచుకుంటూ అన్నాడు

"నాకు తెల్సులే. మీ అమ్మ గుర్తొచ్చింది కదూ?"

ఆమె అంత ఆప్యాయంగా అడిగేసరికి భోరున ఏడ్చేశాడు తనకన్నా ఆమె దాదాపు సంవత్సరం చిన్నది అయినా రెండుమూడేళ్ళు పెద్దదాన్లా ఓదార్చింది ఆమె ఓదార్పులో స్వాంతన దొరికింది తనకి అక్కడ్నించీ బలవంతాన తనని ఆగ కోవడానికి లాక్కెళ్ళింది

ఆ రోజునించీ ఆమె దాదాపు ఎప్పుడూ తనని వెన్నంటేవుండేది కలిసే స్కూల్‌కి వెళ్ళేవాళ్ళు కలిసే వచ్చేవాళ్ళు, కలిసే ఆడుకునేవాళ్ళు, కలిసే భోంచేసేవాళ్ళు, కలిసే చదువుకునేవాళ్ళు ..

రెండు మూడ్రోజులలా గడిచేసరికి తనూ ఆమెను విడిచి ఒక్క క్షణం కూడా వుండలేని స్థితికొచ్చాడు!

వనజ సావాసంలో ఆరు నెలలూ ఆరు రోజుల్లా గడిచిపోయాయి. మర్నాడే తనా వూరు వదిలేస్తున్నాడు. వనజను వదిలి వెళ్ళాలంటే ఎంతో బాధగా వుంది ఆమే అదే పరిస్థితిలో వున్నట్లుంది తను చివరి పరీక్ష రాసి వచ్చేసరికి ఇంట్లో ఎక్కడా కనిపించలేదు

సరాసరి జామచెట్టు దగ్గరకి పరుగెత్తుకుంటూ వెళ్ళాడు అక్కడ దిగులుగా కూర్చొనుంది వనజ.

ఆమెనలా చూసేసరికి తనకి మరింత దిగులేసింది తనకి దిగులు వచ్చినప్పుడల్లా ఆ చెట్టు దగ్గరకి వెళ్ళికూర్చుంటే, ఆమె వచ్చి ఓదార్చేది ఇప్పుడామె అక్కడ దిగులుగా కూర్చుంటే, తనకి మరింత గుబులుగా వుంది ఆమె నెలా ఓదార్చాలో అర్థం కావడంలేదు

నెమ్మదిగా దగ్గరకి వెళ్ళాడు

"ఏంటి వనజా అలా వున్నావ్..." బొంగురు గొంతుతో ఆమె గడ్డాన్ని పైకెత్తుతూ అడిగాడు

తను పలకరించగానే ఒక్కసారిగా బావురుమంది తనకీ ఏడుపొచ్చేసింది

"నువ్వేడవకు వనజా. నాకూ ఏడుపొచ్చేస్తోంది" వెక్కిళ్ళమధ్య అన్నాడు తను

"నువ్వు నన్ను విడిచివెళ్ళిపోతూంటే ఏడుపు రాదేంటి?" అమాయకంగా అడిగింది. అప్పటి ఆమె కళ్ళని ఇప్పటికేకాదు, ఎప్పటికీ మరచిపోలేదు తను

"ఇప్పుడు వెళ్ళిపోతే మాత్రమేం? మళ్ళా రానా ఏంటి? ప్రతీ శలవుల్లోనూ ఇక్కడికొస్తాను ఇంచక్కా మనం తొక్కుడుబిళ్ళ, రింగాటలు ఆడుకోవచ్చు."

"నువ్వు తప్పకుండా ప్రతీ శలవుల్లోనూ ఇక్కడికి వస్తావా?" కళ్ళు తుడుచుకుంటూ ఆశగా అడిగింది

"తప్పకుండా వస్తాను" ఆ చేతిని చిన్నగా గిల్లుతూ నవ్వాడతను

ఆమే నవ్వింది

ఇద్దరూ ఒకళ్ళ చెయ్యి మరొకళ్ళు పుచ్చుకుని ఆనందంగా లోపలికి పరుగెట్టుకొచ్చేసారు

తను ఆ వూరు వదిలి వచ్చేసేటప్పుడుకూడా ఆమె బస్సుదాకా వచ్చి కన్నీళ్ళతో సాగనంపింది

మరో మూడు సంవత్సరాలదాకా తిరిగి ఆ వూరు వెళ్ళడానికి పడలేదు వనజను చూడకుండా అన్నాళ్ళు గడపడం బాధే అయినా తప్పలేదు

తనెన్నిసార్లు అడిగినా 'ఇప్పుడంత దూరం ఎందుకు?' అంటూ కొట్టిపారేసారు తన మాటని అమ్మ, నాన్న ఆఖరికి పంపిస్తేనేకాని అన్నం తిననని మారాంచేస్తే, యిక తప్పక పంపించారు ఆనందంగా బయల్దేరాడు తను

బస్సు దిగగానే కాళ్ళు చకచకా మేష్టారింటికేసి పడసాగాయి

వనజ మనసులో ఇంకా తన స్థానం అలానే వుందా? అప్పటిలా ఆప్యాయంగా తనతో మాట్లాడుతుందా? — మేష్టారింటికి చేరుకునే వరకూ రకరకాల ఆలోచనలు తన మనసుని వుక్కిరిబిక్కిరి చేయసాగాయి.

"ఏమేవ్! నిరంజనం వచ్చాడు.." తనని చూస్తూనే గట్టిగా కేకేసారు మాష్టారు

అందరూ ఒక్కసారిగా బయటికొచ్చారు వనజ కూడా!

ఆమెను చూడగానే తన కళ్ళు తళుక్కున మెరిసాయి

"ఇప్పుడేనా బాబూ రావడం అంతా కులాసాయేనా?" పలకరించారు మేష్టారి భార్య.

"కులాసాయేనండి మావయ్యా వాళ్ళింటికి బయల్దేరాను చాలా కాలమైందికదా అని దార్లో ఇక్కడ దిగాను ..." తనకి తెలియకుండానే అబద్ధం ఆడేసాడు. ఆక్కడికే వచ్చానని చెప్పడం తనవల్ల కానిపని!


"అంతేగాని మా ఇంటికి రావాలని రాలేదన్న మాట!" నిష్ఠూరంగా అంది వనజ అప్పుడుగాని అర్థంగాలేదు తను మొహమాటంతో ఏమేమో మాట్లాడి వాళ్ళని నొప్పించాడని!

"అబ్బే...అలాకాదు" నసిగాడు తను

"అతను వచ్చీరాకముందే ఏమిటా దండయాత్ర వనజా? ముందతన్ని లోపలికి రానివ్వు" మేష్టారి మందలింపుతో వాకిటకి అడ్డం తప్పుకుని దారిచ్చింది అంతా లోపలికి వెళ్ళి హాల్లో కూర్చున్నారు

మూడు సంవత్సరాల తర్వాత వాళ్ళందర్నీ, అప్పుడు తను తిరిగిన ప్రదేశాన్ని చూస్తుంటే మనసు తియ్యటి బాధతో నిండిపోసాగింది భోంచేసింతర్వాత ఆ రాత్రి బాగా పొద్దుపోయే

ఆ మధ్య బరోడా ఆంధ్ర సమితి మహిళలు "యింటర్వ్యూ" నాటికను యూనివర్సిటీ ఆడిటోరియంలో ప్రదర్శించారు. అందులో ఒక దృశ్యం.



వరకూ తను, వనజ, ఆమె చెల్లెళ్ళు కుసుమ, రజని కబుర్లు చెప్పుకుంటూ గడిపారు.

మర్నాడు పొద్దున్నే తను బయల్దేరాడు.

"మరో రెండు రోజులుండకూడదూ?" ఎవ్వరూలేని సమయం చూసి దగ్గరికొచ్చి, నెమ్మదిగా అడిగింది వనజ.

అంత దగ్గరగా ఆమెను చూస్తుంటేగానీ తను గుర్తించలేకపోయాడు — ఆమెలో వయసు తెస్తున్న మార్పుల్ని! ఆమె దగ్గరగా నిలబడితే ఇదివరకెన్నడూ కలగని వింత అనుభూతి కలగసాగింది!

"నాకూ వుండాలనే వుంది. కానీ ఇవాళ అర్జంటుగా ఇంటికి వెళ్ళిపోవాలి. వస్తానని చెప్పాను అమ్మతో..."

"తప్పదంటావా?"

ఇంతలో మాష్టారటుగా రావడంతో వులిక్కిపడి ఇద్దరూ దూరంగా జరిగారు. ఆ తర్వాత మళ్ళీ ఆ వూరు వెళ్ళడం పడలేదు.

ఏడెనిమిది సంవత్సరాల తర్వాత అనుకోకుండా విజయవాడ బస్టాప్‌లో కనిపించింది —

అక్కడే ఏదో కాలేజీలో చదువుకుంటోందిట. శలవులకు ఇంటికి బయల్దేరింది. తనతోపాటే ఇంటికి రమ్మని బలవంతం చేసింది. కానీ వుద్యోగంలో చేరిన కొత్తలు కావడంతో ఆమెవెంట వెళ్ళలేకపోయాడు. ఆఫీస్ పనిమీద విజయవాడ వెళ్ళిన తను, మర్నాడు ఎటువంటి పరిస్థితుల్లోనూ ఆఫీస్‌కి ఎటెండవ్వాలి. ఇద్దరూ అరగంట లోపలే విడిపోయారు.

అప్పటి ఆమె రూపం మాత్రం మనసులో అలానే ముద్రించుకుపోయింది. పెళ్ళనేది చేసుకుంటే ఆమెనే చేసుకోవాలనికూడా నిశ్చయించుకున్నాడు తను.

కానీ ఎలా? ఈ విషయాన్ని ఆమెకి తెలియజేసేదెలా?

ఉత్తరం రాస్తేనో—?

అమ్మో! ఇంకేమైనా వుందా? ఈ విషయం ఇంట్లో వాళ్ళందరికీ తెలిసిపోదూ... ఇంతవరకూ తననెంతో మంచివాడుగా గౌరవించినందుకు బాధపడతారు. తనని ఛీదరించుకుంటారు. నో... అలా జరగడాన్కి వీల్లేదు. వాళ్ళందరి సంగతెలా వున్నా వనజకి తనంటే ఎలాంటి అభిప్రాయముందో? ఆ విషయం తెలీకుండా తనెలా బయటపడతాడు? ఒకవేళ ఆమెకు తనంటే ప్రత్యేక అభిప్రాయం లేకపోతే ఆమెను బాధించినవాడు కాడూ? తానామెను బాధించలేడు!

బలవంతాన ఆ కోరికను మనసులోనే తొక్కేసాడు.

ఏ మొహమాటమైతే వనజని తననించీ దూరం చేసిందో అదే మొహమాటం రాధని తన భార్యగా చేసింది.

తన కూతుర్ని చేసుకొమ్మని వచ్చిన మావయ్యని, ఆయన మాటని బలపరిచే అమ్మానాన్నలని తను కాదనలేకపోయాడు. ఫలితంగా రాధ తన జీవితభాగస్వామి అయిపోయింది.

గడచిన ఈ ఇరవై సంవత్సరాల్లోనూ వనజ తనకెన్నోసార్లు గుర్తుకొచ్చింది ఆమెను చూడా

దూరం

లనే కోరిక కూడా ఎన్నోసార్లు కలిగింది. కానీ వనజ తనకు పరాయి స్త్రీ. అందుకే ఆ ఆలోచనలన్నిటినీ మనసులోనే సమాధి చేసేసాడు.

"మీరు బండి దగ్గరకు వెళ్తున్నారా? లేదా?" రాధ పలకరింపుతో ఈ లోకంలోకి వచ్చాడు నిరంజనం.

"ఎందుకూ?"

"ఎందుకేమిటండీ నా మొహం. వెనుకటికి మీలాంటివాడే, రామాయణమంతా విని రాముడికి సీత ఏమవుతుందీ అని అడిగాట్ట! సాయంత్రం రైల్లోనే ఆవిడ వెళ్ళిపోతున్నానని చెప్పిందట కదా..."

"బావుంది. ఆవిడ వెళ్ళిపోతుంటే నేనెందుకు వెళ్ళాలి స్టేషన్‌కి?" వనజని చూడాలనే వున్నా ఆ భావాన్ని మనసులోంచీ తోసివేయాలని ప్రయత్నిస్తూ అన్నాడు నిరంజనం.

"ఆవిడ్ని చూట్టానికి కాదండీ మిమ్మల్ని స్టేషన్‌కి వెళ్ళమంటూంది — మనవాడి వుద్యోగం విషయం హెచ్చరించడానికి!"

"బావుంది. ఇంతకాలం తర్వాత ఆవిడ కనిపించి మర్యాదగా పలకరించేసరికి రికమండేషన్లకి బయల్దేరనా? నావల్లకాదు!" అంతవరకూ మనసులో వున్నమాటనే బయటికి వెళ్ళగక్కేసాడు నిరంజనం.

వనితలకు మనవి

కొత్తరకం వంటలు
క్లుప్తంగా వ్రాసి పంపితే
త్వరగా పరిశీలించ వీలు —సం.

ఆ మాటలు రాధని రెచ్చగొట్టాయి.

"పెళ్ళయి ఇప్పట్నించీ చూస్తూనేవున్నాను అయిన దానికి, కాని దానికీ ప్రతీ దానికీ మొహమాటం! మీ మొహమాటంతో మేమెన్ని బాధలుపడ్డా ఫర్వాలేదు. మీరు మాత్రం మీ పద్ధతి మార్చుకోరు...! మీకు నమస్కారం పెడతాను ఈ ఒక్కసారికీ మీ మొహమాటాన్ని విడిచిపెట్టి ఆవిడకి చెప్పండి చాలు... ఇకముందు మా అందరి సంగతీ వాడే చూసుకుంటాడు..." కళ్ళనీళ్ళ పర్యంతమైంది రాధ.

"నాన్నా... ఆవిడతో నువ్వొక్కమాట చెప్తే చాలు..." జాలిగా దగ్గరకొచ్చాడు శేఖర్.

తన జీవిత సమస్య విషయంలోనే ఆమె ముందు బయటపడలేకపోయాడు. ఇప్పుడీ విషయంలో బయటపడగలడా?

తప్పదు! ఆమె కెలాగైనా చెప్పాలి. తన బలహీనతవల్ల తనవాళ్ళంతా బాధపట్టానికి వీల్లేదు. స్టేషన్‌కి వెళ్ళితీరాలి. వనజను కలవాలి. శేఖర్ విషయం ఆమెతో మాట్లాడాలి ---

వెంటనే బయటికి బయల్దేరాడు నిరంజనం. ఆయన ఎక్కడికి వెళ్తోందీ అర్థంగాక అలానే చూస్తూ అక్కడే నిలబడిపోయారు తల్లికొడుకులు.

* * *

వెళ్ళాలా? వద్దా? అనే సందిగ్ధంలో అటు ఇటు తిరిగి ఎప్పటికో స్టేషన్‌కి చేరుకున్నాడు నిరంజనం.

బండి బయల్దేరడానికి సిద్ధంగా వుంది.

గేటు దగ్గర నిలబడి ఆత్రంగా ఎదురు చూస్తున్న వనజ అతన్ని చూడగానే "నిరంజనం గారూ..." అంటూ ఆనందంగా కేకేసింది.

"అరె! మీరా!" ఆమెకోసం వచ్చినట్లు చెప్పలేక ఆశ్చర్యాన్ని నటిస్తూ అన్నాడు నిరంజనం.

ఆమెనక్కడ చూడడం అతనికి ఆశ్చర్యాన్ని కలిగించకపోయినా, వయసు తెచ్చిన హుందాతనంతో నిండుగా వున్న ఆమె రూపం అతనికి ఆశ్చర్యాన్ని కలిగించింది

అవన్నీ వయసుతో వచ్చే మార్పులైనా అతని దృష్టిని ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నాయ్!

ఎంతమారిపోయింది! అప్పటి చిలిపి వనజకు, ఈ వనజకూ ఎక్కడా పోలికలేదు! విస్తుపోయి ఆమెనే చూస్తూ నిలబడిపోయాడు నిరంజనం.

"అదేంటి! మీరు నాకోసం కాదా వచ్చింది!" ఆశ్చర్యంతోను, బాధతోను ఆమె మాటలు నీరసంగా వచ్చాయి.

నిరంజనం మనసు కలతపడింది.

తను వచ్చింది ఆమె కోసమే! అయినా ఆ విషయాన్ని ఆమెముందు చెప్పలేకపోయాడు. ఈ బలహీనత తనని వదల్దు...!

"మీవాడు చెప్పలేదా?" మళ్ళీ ఆమే ప్రశ్నించింది.

"చెప్పలేదు..." మొదటి అబద్ధాన్ని కప్పిపుచ్చుకోడానికి మరో అబద్ధం ఆడేడు.

రైలు గట్టిగా కూత వేసింది.

"ఇక్కడ కొన్ని ఇంటర్‌వ్యూలు కండక్ట్ చేయడాన్కి నిన్న వచ్చాను. నాకు మీరిక్కడ వుంటున్నట్లు ముందే తెలిసుంటే ఖచ్చితంగా మీ ఇంటికే వచ్చుండే దాన్ని." చిన్నగా నవ్విందామె.

కంగారు పడ్డాడు నిరంజనం.

"నువ్వీ వూరు వచ్చావని తెలిస్తే నేను మాత్రం వూరుకునే వాణ్ణా ఏంటి? ఇంతకీ ఇప్పుడే వూళ్ళో వుంటున్నారు?" అడిగాడు.

జవాబు చెప్పిందామె.

మరోసారి కూతవేసి, నెమ్మదిగా బయల్దేరింది రైలు.

"మీ ఆయనకూడా అక్కడే పనిచేస్తున్నారా? ఏం చేస్తున్నారు?" అతనడిగిన ప్రశ్నలకు ఆమె చెప్పిన జవాబు రైలు శబ్దంలో కలిసిపోయింది.

దూరమైపోతున్న ఇద్దరూ ఒకళ్లనొకళ్లు కన్నీళ్ల పొరలగుండా చూసుకోసాగారు.

అతని మొహమాటమే ఆమెను కన్యగా మిగిల్చిందని అతనికి తెలీదు. అంతేకాదు — తనలాగే మరికొన్ని జీవితాలు కూడా అతని మొహమాటానికి బలైపోగూడదని ఆమె శేఖర్‌కి ఆ వుద్యోగం వచ్చేటట్లు చేసిన విషయం కూడా అతనికి తెలీదు! అతని కొడుకే తన కొడుకనుకొంటున్న ఆమెకు ఆ విషయం అతనికి తెలీడంకూడా ఇష్టంలేదు. ఎప్పుడూ ఒకళ్ళ మనసులో మరొకళ్ళు నిండుకొని వున్నా ఆ విషయాన్ని ఇద్దరూ బయటపెట్టలేరు. వాళ్ళమధ్య దూరం ఎప్పటికీ తరగనిది!

డాక్టర్ సలహాలు ✚

- డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

ఎస్. ఎస్. ఆర్. — తెనాలి

మా అబ్బాయికి 11 సం॥లు. సరిగ్గా మాట్లాడలేడు. 3 వ సంవత్సరము నుండి మాట్లాడలేదు వయస్సు పెరిగేకొలది ఇప్పుడిప్పుడు మాట్లాడుతున్నాడు అవి గూడా సగం మాట మింగేసి పలుకుతాడు. స్పష్టంగా పలుకలేడు. చెముడు లేదు. గ్రహింపు వున్నది మా బాబుని ఎక్కడ చూపించమంటారు.

★ ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ అనే సంస్థ మైసూరులో వున్నది. అక్కడ చిన్నపిల్లలకి ఏర్పడే మాటల అవకతవకలకి తగిన శిక్షణ ఇవ్వటం జరుగుతుంది. స్పీచ్ తేరపిస్టుల ద్వారా తగిన శిక్షణ ఇవ్వడంవల్ల మాటలు బాగా వచ్చే అవకాశం వున్నది. మెదడులో నిరంతర లోపం వున్నవారికి మాత్రం మాటలు మామూలుగా రావటం కష్టం అని చెప్పవలసి వుంటుంది.

పి ఎల్. — అమలాపురం

నేను నాలుగు నెలల క్రితం ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్నాను. నాకు భవిష్యత్తులో ఏదైనా అపాయం సంభవించవచ్చా? నాకు పుట్టబోయే పిల్లలకు ఈ ప్రమాదం సంభవించడానికి ఆస్కారం వున్నదా?

★ ఓపెన్ హార్ట్ సర్జరీ విజయవంతంగా ముగిసిన తర్వాత ప్రమాదాలు వచ్చే అవకాశాలు చాలా తక్కువ. ఈ ఆపరేషన్ అంత విజయవంతం కానప్పుడు మాత్రమే ఇదివరకు వున్న లక్షణాలు తిరిగి కనబడటంగాని, లేక క్రొత్తగా ఆపరేషన్ మూలాన ఏర్పడే లక్షణాలు కనబడటంగాని జరుగవచ్చును. కాని ఇలా జరుగటం అరుదు.

మీకు వున్న లక్షణాలు మీ పిల్లలకి ప్రమాదం ఏర్పడే అవకాశం లేదనే చెప్పాలి.

ఒ. ఆర్ ఆర్. — వరంగల్

నా వయస్సు 16 సం॥లు. ఒక సంవత్సరము నుండి నా చెవిలో గుంయ్ మనే శబ్దాలు వినవస్తున్నాయి. నడుస్తున్నప్పుడు తల ఆడించినపుడు, ఒళ్ళు విరిచినపుడు ఇంకా మరికొన్ని సమయాల్లో ఈ శబ్దాలు వినవస్తున్నాయి. దీనివలన నాకు తలనొప్పిగా వుంటుంది. తల పై భాగాన, వెనుక భాగాన నొప్పి వుంటుంది. చెవులు గూడా సరిగ్గా వినపడట్లేదు.

★ మీరు నిపుణులైన ఇ. ఎన్. టి. వైద్యులకి చూపించుకోవటం అవసరం. ఇంటర్నల్ ఇయర్‌లో ఏర్పడగల మార్పులవల్ల గాని, చెవుల వెనుక భాగంలో వున్న ఎముకలో ఏర్పడగల కొన్ని రోగాలవల్ల గాని ఇలా జరిగే అవకాశం వుంటుంది.

రోగిని ప్రత్యక్షంగా పరీక్షచేయకుండా రోగ నిర్ధారణ చాలా కష్టం.

కె. ఎల్. — గుంటూరు

నాకు వివాహమై 1 సం॥ అయినది. సంభోగము తరువాత విపరీతమైన బాధ కలిగి మూత్రము వెలువడిన తరువాత మంట, క్రింది కడుపు, కాళ్ళ నరములు జివ్వున లాగినట్లుంటుంది. మూత్రము సాఫీగా పోతున్నది. కాని మూత్ర ద్వారను వెంటవెంటనే నిండుకొనినట్లుండను. మూత్రము వెలువడు సమయములో చిన్న రక్తపు తునకలు ఒకటి రెండు పడుతున్నవి.

★ ఈ లక్షణాలు యూరెత్రైటిస్‌ని తెలియజేస్తాయి. ఈ యూరిత్రైటిస్ ఏర్పడటానికి చాలా కారణాలున్నా, వాటిలో గోనోకాక్కల్ యూరిత్రైటిస్ ముఖ్యమైనది. అరుదుగా నాన్ స్పెసిఫిక్ యూరిత్రైటిస్ వల్ల యిలా జరుగుతుంది. మీరు వైద్యుల సలహామేరకు పెన్సిలిన్ ఇంజక్షన్లు (లాంగ్ ఏక్టింగ్ రకానికి చెందిన పెనిడ్యూర్ — 12 వంటివి) టెస్ట్ డోస్ చేయించుకున్న తర్వాత ఒకేసారి రెండు పిర్రలలోను వేయించుకోవటం మంచిది

ఆర్. సి. — విజయవాడ

నా వయస్సు 18 సం॥లు. కొంచెము పొట్టిగా వుంటాను. ఏడాది క్రితం వరకు ఋతుక్రమము సరిగ్గా లేదు. మందులు వాడితే ఇప్పుడు క్రమముగా అవుతున్నది. కాని బహిష్టు సమయములో నెప్పి వుంటోంది. పెళ్ళయి మూడు సంవత్సరములు అయినా గర్భము రాలేదు. ఆపరేషన్ చేస్తే పిల్లలు పుడతారని చెప్పారు. మీ సలహా ఏమిటి?


★ ఋతుక్రమం సరిగా రావటం మొదలయ్యాక గర్భధారణ జరిగే అవకాశాలు ఎక్కువ. అయినా మీ వయస్సు 18 మాత్రమే గనుక త్వరపడి 'డి' అండ్ 'సి' ఆపరేషన్ చేయించుకోవటం అనవసరం.

ఋతుక్రమ సమయాలలో ఏర్పడే నెప్పికి ఆస్ప్రిరిన్, బరాల్గాన్ వంటి మాత్రలు పని చేస్తాయి. తెరలు తెరలుగా వచ్చే నెప్పికి మాత్రమే బరాల్గాన్ వాడవలసి వుంటుంది.

ఎన్. ఆర్. — కర్నూలు

మా అమ్మాయి వయస్సు 5 సం॥లు నిండినవి. అయినా మాటలు రావు, కూర్చోలేదు, నడవలేదు. మన మీద ధ్యాస కూడా వుండదు. అన్నము బాగానే తింటుంది రాయవేలూరు, మద్రాస్‌లలో పెద్ద డాక్టర్లకు చూపించినాము. వారు మెదడు చిన్నదిగా వున్నది. అన్నీ నిదానముగా వస్తాయి అని చెప్పారు. చాలా మందులు వాడినాముకాని ప్రయోజనం కన్పించలేదు.

★ ఈ రోగాన్ని సెరిబ్రల్ పాల్సీ అని అంటారు. ప్రసవ సమయంలో పిల్లలు పుట్టగానే బాగా ఏడవటంవల్ల ఊపిరితిత్తులు బాగా వ్యాకోచించి మెదడుకి సరిఅయిన సమయంలో ఆక్సిజన్‌ని సరఫరా జరుగుతుంది. అలా జరుగనిపక్షంలో ఈ ఆక్సిజన్ సరఫరా ఆలస్యం అవుతుంది. మెదడులోని జీవకణాలు ఆక్సిజన్ లేకుండా రెండు నిముషాలుపాటు గూడా వుండలేవు. ఇలా జరుగటంవల్ల, అన్ని కార్యక్రమాలు పిల్లలకి ఆలస్యంగా జరుగుతాయి. వీటికి ప్రత్యేకంగా మందులులేవు. క్రమబద్ధంగా వ్యాయామం మాత్రమే ప్రస్తుతం చేయతగిన చికిత్స.



(గత సంచిక తరువాయి)



[ఇంకా ఉంది]


మీరు అందమయిన
దుస్తులు ధరిస్తే చాలా?
మీ ముఖ సౌందర్యాన్ని
పెంపొందింపుకోవాలి!
మీ ముఖం అందంగా
వుండటానికి... పాండ్స్ ఫేస్ పౌడర్
మృదుత్వమే కారణం.
అది మీ ముఖానికి మృదుత్వంతో
అసమానమయిన కళనీ తీసుకు
వస్తుంది. ఆ కళ అలాగే
వుంటుంది. గంటల తరబడి...
గంటల తరబడి...
FACE POWDER
Pond's
FACE POWDER
పాండ్స్ ఫేస్ పౌడర్
అనుపమ ముఖసౌందర్యానికి అద్వితీయమయినది
Pond's
CP-1462

అడ్రసు లేని మనుషులు



పంతుల జోగారావు

"ఇవాళ మీ శంకరం గారి నుంచి మళ్లీ ఉత్తరం వచ్చిందండీ" అని చెప్పింది సీత ఇంటోకి అడుగు పెడుతున్న భర్తతో.

ఆ మాటలు విని, అనంతరావు గతుక్కుమన్నాడు. అతని ముఖం ఓ క్షణం వివర్ణమయి పోయింది. భారంగా నిట్టూర్చాడు. శంకరం నుంచి యిది ఆరో ఉత్తరం! ఏం వ్రాసాడో? జవాబు వ్రాయనందుకు తనమీద కోపం వెళ్ళగక్కుతూ వ్రాసి వుంటాడు. తనమీద వాడికెంత కసిగా వుందో!

కాని...కాని, ఏం చెయ్యగలడు తను! శంకరానికి జవాబు ఏలా వ్రాయగలడు? తనిప్పుడు ఏంత విచిత్రమయిన పరిస్థితిలో యిరుక్కుని వున్నాడో శంకరానికేం తెలుస్తుంది? తన పరిస్థితిని వాడెలా ఊహించగలడు? పాపం, వాడికి మాత్రం అసలు విషయం ఏలా తెలుస్తుంది? అసలు తెలిపే మార్గం అంటూ వుంటే కదా!

'భగవాన్! ఏలాంటి దుస్థితి కలిగించావయ్యా' నిట్టూరుస్తూ కుర్చీలో కూలబడ్డాడు అనంతరావు.

సీత కాఫీ అందించి, దానితో పాటే శంకరం నుంచి వచ్చిన ఉత్తరం అతని చేతిలో పెట్టింది.

ఉత్తరం అందుకుని, అనాసక్తంగా ప్రక్కనే టేబిలుమీద పడేసాడు అనంతరావు. అతని మనసంతా చికాగ్గా తయారయింది. ఏదో వెలితి అతని గుండె నిండా ఆవరించింది. ఉత్తరం చదవాలనిపించటం లేదు. అందులో ఏం వ్రాసి వుంటాడో తెలుసు. మామూలే. లోగడ వచ్చిన నాలుగయిదు ఉత్తరాలూ ఏలా వున్నాయో, యిదీ అలాగే వుంటుంది. కాకపోతే యిందులో మరింత ఘాటుగా తిడుతూ రాసి వుండొచ్చు.

కాఫీ త్రాగటం పూర్తిచేసి, గ్లాసు సీతకి అందించాడు. భర్త మనసు చికాగ్గా తయారయిందని సీతకి తెలుసు. ఆ సమయంలో ఏం మాట్లాడినా అతన్ని మరింత విసిగించినట్టు అవుతుంది. అందుకే మరేం మాట్లాడకుండా వంటింటోకి వెళ్ళిపోయింది.

అనంతరావు ఓ నిముషం కళ్ళుమూసుకుని, కణతలు వేళ్ళతో రుద్దుకుంటూ కుర్చీలో వెనక్కి జేరబడి పోయేడు. అతని మనస్సూ, శరీరమూ రెండూ పూర్తిగా అలసిపోయి విశ్రాంతి కోరుతున్నాయి. ఓ క్షణం అలా సొంసిపోయినట్టుగా వున్నాక మళ్ళీ నెమ్మదిగా కళ్ళు తెరిచాడు. ప్రక్కనే టేబిలుమీద ఉత్తరం కనిపించింది.

ఆ వుత్తరం తన బాల్య మిత్రుడు శంకరం వ్రాసింది. ఆ దస్తూరీతో తనకు చాలా సంవత్సరాల పరిచయం వుంది. అడ్రసు చూసేడు. 'ఏ. అనంతరావు, సెకండరీ గ్రేడు టీచరు, కంచర వీధి, పార్వతీపురం' అని వుంది. అక్షరాలు పడుకోబెట్టినట్టుగా రాస్తాడు. ఆ పరిచితమైన దస్తూరీ చూస్తూ వుంటే శంకరాన్ని చూసినట్టుగానే అనిపిస్తోంది.

నిజానికి శంకరాన్ని చూసి ఏంతకాలమయింది! ఆరేళ్లు కావటం లేదూ? ఏప్పుడో ఆరేళ్ళ క్రిందట అరుణ పెళ్ళికని ఒంగావూరొచ్చాడు. సాయంత్రం చీకటి పడుతూండగా రైలు దిగేడు. మళ్లీ చీకటితోటే వెళ్లిపోయేడు. శలవు లేదుట. వాడి వుద్యోగం అలాంటిది మరి! ఏం ఉద్యోగం చేస్తున్నాడో? అడిగితే నవ్వి ఊరుకున్నాడు, 'ఏదో—పొట్టగడవటానికి ఓ కంపెనీలో చిన్న గుమాస్తాపని' అన్నాడు. కంపెనీ పేరు తనడగనూ లేదు, వాడు చెప్పనూ లేదు.

శంకరం, తనూ యిద్దరూ కలిసి యిక్కడే హైస్కూల్లో చదువుకున్నారు. కలిసే తిరిగారు. ఒక్క క్షణం విడవకుండా తిరిగేవాళ్ళు. చీమచింత బొట్టలు ఏరుకోడం కోసం చెట్టెక్కితే ముళ్ళు గీరుకుపోయి రక్తాలు కారడం, ఖాళీ సిగరెట్ పెట్టెలు కూడబెట్టడం కోసం ఎండని లక్ష్యపెట్టకుండా నవరత్నా టాకీస్ వెనకాల చెత్తకుప్పల్ని కెలుకుతూ తిరగడం, బయ్యన్న కోనేరులో ఈత కొట్టడం, ఏడు కానాల దగ్గర ఇసకమీద సాయంత్రం పూట పడుక్కుని సినిమా కబుర్లు చెప్పుకోవడం... ఒక్కొక్క దృశ్యం... ఓహ్... ఎంత మధు

రంగా యిప్పటికీ తన కళ్ళకి కట్టినట్లుగా గుర్తుకొస్తున్నాయి.

వసారాలో, నాన్న కోప్పడుతాడేమోనని.. బిక్కుబిక్కుమంటూ తెలుగు వాచకం పట్టుకుని కూచునేవాడు తను. శంకరం వీధిలోంచి సన్నగా ఈల వేసేవాడు. అది తాము ఏర్పరచుకొన్న సంకేతం. అంటే ఆటకి రమ్మని అర్థం. దబ్బునలేచి తను వీధిలోకి పరుగుతీసేవాడు. ఓసారి ఆ ఈల కాస్త నాన్న చెవిన పడనే పడింది. 'ఓరి రౌడీ వెధవన్నారా!' అంటూ నాన్న యిద్దరి వీపులూ పగలగొట్టేడు.

అడ్రసులేని మనుషులు

అన్నీ, నిన్నటికీ- నిన్న జరిగినట్లున్నది. కాని ఎన్నేళ్లయిందో!

హైస్కూలు చదువు పూర్తవగానే శంకరం ఉద్యోగం వెతుక్కుంటూ విశాఖపట్నం వెళ్ళిపోయేడు. తనుండి పోయేడు ఈ వూళ్ళోనే. ట్రైనింగు పూర్తిచేసి, యిక్కడే టీచరు వుద్యోగం సంపాయించుకుని, సంసారాన్ని లాక్కొస్తున్నాడు. అప్పట్లో శంకరం చిన్నాన్నెవరో విశాఖలో వుండేవారు. వుద్యోగం వేయిస్తానని అమ్మానాన్నలతో బాటు వెళ్ళిపోయేడు.

వాడ్ని రైలెక్కించడానికి వెళ్ళాడు తను. అలవాటయిన ప్లాట్ ఫారమే. కాని అప్పుడు మాత్రం కొత్తగా, వింతగా, ఏదో వెలితిగా వున్నట్లనిపించింది. రైలు కదిలి పోతూ వుంటే కళ్ళంట నీళ్ళు తిరిగాయి. ఉత్తరాలు జీవితాంతం రాసుకుంటూ ఒకర్నొకరు ఎప్పటికీ మరచి పోగూడదని ప్రమాణాలు చేసుకున్నారు.

తనమంచి శంకరాన్ని వేరుచేస్తూ రైలు హడావిడిగా వెళ్ళిపోయింది. అంత హడావిడిగానూ, వేగంగానూ కాలం తిరిగి పోయింది. పెళ్ళిళ్ళయాయి. పిల్లలూ బాధ్యతలూ పెరిగి, జీవితంలో ఒక స్తబ్దత, యాంత్రికత యేర్పడ్డాయి.

అయినా, తమ మధ్య ఉత్తరాలు మాత్రం నడుస్తూనే వున్నాయి. కనీసం నెలకో వుత్తరమయినా వ్రాసుకుంటూ వుంటారు. శంకరం ఏదో కంపెనీలో స్థిరపడ్డాడు. ఈలోగా కొన్ని యిళ్ళు మార్చేడు. యిల్లు మారినప్పుడల్లా కొత్త అద్దెయింటి అడ్రసుయిస్తూ ఉత్తరం రాసేవాడు.

తన అడ్రసు మాత్రం మారలేదు. ఈ ఊళ్ళోనే- తాతలు కట్టించిన యిప్పుడు శిధిలమయిపోతున్నట్టున్న పాత పెంకుటింట్లోనే - మును పెలా వుండేవాడో, యిప్పుడూ అలాగే వున్నాడు. కాకపోతే కొంచెం వయసూ, బరువు బాధ్యతలూ పెరిగాయంతే.

ఈ ఊరు కూడా ఏం మారలేదు. పైకి పొడుచుకొచ్చి కాళ్ళకి గుచ్చుకునే మెట్లంటి రాళ్ళతో రోడ్డూ, నడివీధుల్లోనే అడ్డంగా కట్టేసిన పశువులూ, వాటి పేడా,

అరిగిపోయిన సినిమా రికార్డులనే వేస్తూ, మధ్య మధ్య బొంగురు గొంతుకతో, తప్పుల తడకలతో "నేనే నూడండి...మీ అభిమాన థియేటర్లో— అందాల అందగాడు... మీ రంగు రంగుల సొప్పుసుందరి..." అంటూ చాప చదంటు ప్రకటనలు చేసే సినిమా వాళ్ళ రిక్షాలూ... ఈ జీవితం నిజానికి చాలా యిరుకైనది. కానీ, చాలా కాలంగా అలవాటయిన వాతావరణం కనుక యిది కూడా యిబ్బందిగా లేదు.

ఇక్కడ— పల్లె పట్నం కాని యీ మధ్యస్థపు గబ్బిలంలాంటి యీ వూళ్ళో తనతో తిరిగిన శంకరం — ఇప్పుడు వైజాగ్‌లో వుంటున్నాడు. ఆ జీవితమే వేరు! ఆ సముద్రం, ఆ సిటీబస్సులూ, కార్లూ, స్కూటర్లూ, హడావిడీ, ఆ జన చైతన్యమూ—రాత్రిపూట కళ్ళు మిరుమిట్లు గొలిపే ఆ విద్యుద్దీపాల తోరణాలూ— ఆ 'లైఫ్' వేరు. అందులో థ్రిల్ వేరు.

పాత పందిరి మంచం మీద పడకలాంటి తన జీవితానికీ, పడకకీ సోమరితనానికీ తావులేని జీవన ప్రవంతి ఉరవడితో శంకరం బ్రతుక్కీ ఎంత అంతరం వుంది! అదే విషయం వాడికి ఉత్తరాల్లో రాస్తే, వాడు పట్టించుకున్నట్టే కనిపించడు.

అరుణ పెళ్ళికని వచ్చినప్పుడు ఆ ఒక్క రాత్రీ ఎన్నికబుర్లు చెప్పాడో! సుడిగాలిలాగానే వెళ్ళిపోయేడు. ఎంత బతిమలాడినా వున్నాడు కాదు; శలవు లేదుట. అసలు ఆ నెలలో శలవు దొరకడమే అపురూపంట!

ఆ రాత్రి ఉన్నచోట కూచోనివ్వలేదు; ఒక్కచోట నిలబడనివ్వలేదు. ముహూర్తం పూర్తయి భోజనాలు చేశాక తనని వీధిలోకి బయల్దేరదీసాడు. తాము కలిసి, తిండీ తిప్పలూ మరిచిపోయి, మరీ తిరిగిన ప్రదేశాలన్నీ చూసి తీరాలని పట్టుబట్టాడు. రాత్రంతా తిరిగి తిరిగి, నిద్ర ముంచుకురాకుండా టీలు తాగుతూ, సిగరెట్లు కాలుస్తూ—ఆ రాత్రంతా వర్తమాన జీవితాన్నీ, చికాకుల్నీ మరిచిపోయి, అన్నీ చిన్ననాటి ముచ్చట్లే ముచ్చటించుకున్నారు. ఏడు కానాల దగ్గర యిసకలో, ఆ వెన్నెల్లో వెల్లికిలా పడుక్కుని కబుర్లు చెప్పుకోవడం అది వింత అనుభవం!

అంతే!

ఆ తరువాత శంకరాన్ని మళ్ళీ చూడడం తటస్థించనే లేదు. అరుణ పెళ్ళికి వచ్చి వెళ్ళిన తరువాత యిల్లు మారినట్టున్నాడు. అడ్రసు మారింది నెలకో, రెణ్ణెళ్ళకో శంకరం నుంచి క్షేమాలు తెలుపుతూ ఉత్తరం వచ్చేది. దానికి తనూ వెంటనే జవాబు వ్రాసేవాడు.

కాని...

ఈ మధ్య మాత్రం వాడి నుంచి వరుసగా ఉత్తరాలొస్తున్నాయి తను సమాధానం వ్రాయటం లేదు. ఎలా వ్రాస్తాడు. తన యిబ్బంది వాడికేం తెలుస్తుంది? అసలీ పరిస్థితే విచిత్రమయింది. ఎప్పుడూ వూహించనిదీనూ! తలచుకుంటూ వుంటే నవ్వు వస్తోంది. ఒక్కోసారి చెప్పలేనంత చిరాకూ, విసుగూ కూడా కలుగుతున్నాయి.

నిట్టూర్చి ఉత్తరం చింపి చదివాడు.

"అనంతం,

ఇప్పటికి అయిదు ఉత్తరాలు నీ నుంచి నాకు బాకీ. జవాబు ఎందుకు రాయడం లేదు? బద్ధకం కారణం అనుకోను అదే కారణమయితే మాత్రం నీమీద చాలా కోపం వస్తోంది. వెంటనే మనూరొచ్చి నిన్ను చెడామడా తిట్టి పోదామనిపిస్తోంది. కనిపిస్తే నిలువునా కడిగేద్దామని వుంది. ఒక వేళ... ఏమయినా యిబ్బందుల్లో, చికాకుల్లో వున్నావేమో! అని కూడా అనిపిస్తోంది. నీ గురించి తెలుసుకోవాలని ఆరాటంతో ఓ ప్రాణి ఇక్కడ వుందని మరిచిపోతున్నావురా అనంతం!


దీనిక్కూడా నీ నుంచి జవాబు రాకపోతే— మన స్నేహలతని నిర్దాక్షిణ్యంగా నువ్వే క్రూరంగా త్రుంచివేసినట్టు భావిస్తాను. బిగపట్టిన వూపిరితో నీ మంచి ఉత్తరం కోసం ఎదురు చూస్తూ—

— నీ, శంకరం."

ఉత్తరంలో ప్రతి అక్షరంలోనూ, పదంలోనూ పొంగి పొరలిన స్నేహ తుషారంతో శరీరం తడిసిపోయినట్టనిపించింది. మనసు పిడచకట్టుకు పోయినట్టనిపించింది. ఏం చెయ్యాలో తెలీని అశక్తతతో నిస్త్రాణగా అయిపోయాడు అనంతరావు.

ఈ ఉత్తరానికి జవాబు ఎలా రాయాలి? ఏ అడ్రసుకి వ్రాయాలి! వాడిప్పుడు ఏ అడ్రసులో వున్నాడో ఎలా తెలుస్తుంది?

అనంతరావు విశాఖపట్నం వెళ్ళివచ్చి దాదాపు మూడు నెలలు దాటుతోంది. ఈ మూడు నెలల్లోనూ యిది ఆరో ఉత్తరం! ఇంతవరకూ వచ్చిన ఉత్తరాలలో వాడి అడ్రసు వాడెక్కడా వ్రాయలేదు - లోగడ యిల్లు మారినప్పుడల్లా శంకరం విధిగా మారిన యింటి అడ్రస్ వ్రాసేవాడు. ఇప్పుడెందుచేతో అలా చెయ్యలేదు. అలాంటప్పుడు శంకరానికి ఏ అడ్రసుకని ఉత్తరం వ్రాయడం! పాత అడ్రసుకే రాద్దామంటే శంకరం అక్కడ నుంచి యిల్లు మారిపోయినట్టు స్పష్టంగా తను విశాఖ వెళ్ళడంతో తెలిసింది. వాడినుంచి ఉత్తరం



మారుతున్నట్టు గాని, మారినట్టు గాని, ఉత్తరం లేదు.

అనంతరావు సాధారణంగా ఊరు వదిలి ఎక్కడికీ వెళ్ళడు. శంకరం దగ్గరికి వెళ్దామనుకుంటూనే యిన్నేళ్ళుగా ఆ ఆలోచనని ఆచరణలో పెట్టలేకపోయాడు.

అనుకోకుండా విశాఖ వెళ్ళే పని తగిలింది. తను వస్తున్నట్టుగా శంకరానికి ముందుగా తెలియజేసే వ్యవధి కూడా లేకపోయింది. హఠాత్తుగా బయల్దేరాల్సి వచ్చింది. ఉల్లిపాయల వారి వీధిలో, పద్మనాభరావు కేరాఫ్ అడ్రసుగల యింట్లో వుంటున్నాడు శంకరం. ఆ అడ్రసు పట్టుకుని విశాఖపట్నం బయల్దేరాడు అనంతరావు.

ఆ యిల్లు కనుక్కోవడం ఏమంత కష్టం కాలేదు. ఆ యింట్లో నాలుగు వాటాల వాళ్ళుంటున్నారు.

ఓ యిరవైయేళ్ళ అమ్మాయి ముందర వసారాలో కూచుని ఏదో చదువుకుంటోంది. ఆ అమ్మాయిని శంకరం గురించి అడిగాడు తను. ఆ అమ్మాయి ప్రశ్నార్థకంగా తన వేపు చూసింది.

"ఆ పేరుగల వాళ్ళెవరూ యిక్కడ లేరండీ" అంది.

"పద్మనాభరావు గారుండేది యిదే యిల్లేనా?"

"అవునండీ, ఆ వాటాలో వుంటున్నాం. ఆయన మా నాన్నగారే."

"ఇదే యింట్లో వుంటున్నట్టుగా అడ్రస్‌లో వుందమ్మా" మరోసారి అడ్రసు చూసుకుంటూ చెప్పాడు అనంతరావు.

ఆ అమ్మాయి పెదవి విరిచి "లేదండీ— శంకరం గారిక్కడలేరు— ఒకవేళ యింతకు ముందు వుండేవారేమో! బహుశా యిల్లు మారిపోయి వుండొచ్చు" అనేసింది.

అనంతరావు కంతా అయోమయంగా అనిపించింది. నిరాశగా వీధిలోకి వచ్చేసాడు. ఎందుకయినా మంచిదని వీధిలో మరో యిద్దరు ముగ్గుర్ని కూడా వాకబు చేసాడు. ఎవరూ శంకరం గురించి చెప్పలేకపోయారు.

శంకరం ఆఫీసు అడ్రసు అసలే తెలీదు. వాడితో సరదాగా ఓరోజు గడపాలనుకున్న తను ఎంతో ఆశతో, ఆత్రుతతో బయల్దేరాడు. కాని తనకు పుట్టెడు నిరాశ, నిస్పృహ మిగిలింది. బాధతో బరువెక్కిన గుండెతో తిరిగి వచ్చేసాడు.

అడ్రసు లేని మనుషులు

వచ్చేసాక, శంకరం నుంచి కొత్త అడ్రసు యిస్తూ ఉత్తరం వస్తుందేమోనని వెయ్యి కళ్ళతో ఎదురు చూసాడు. ఈ మూడు నెలల్లోనూ అయిదారు ఉత్తరాలు వచ్చాయి కానీ— ఎక్కడా యిల్లు మారిన విషయం లేదు. ఆ యింట్లో లేడని ప్రత్యక్షంగా తెలిసి కూడా తిరిగి అదే పాత అడ్రసుకి వ్రాయడం బుద్ధి తెలివి తక్కువ తప్ప మరేం కాదు.

శంకరం ఏం చేసాడేం! వాడి బుర్ర యింత మొద్దుబారి పోయిందేం చేత?

ఈ సమస్యకి పరిష్కారం ఏమిటి?

ఈ అర్థంలేని ఫార్స్‌కి పర్యవసానం ఏమిటి?

అంతు పట్టడం లేదు అనంతరావుకి. ఉత్తరం ఉత్తరాల కట్టకి గుచ్చి, వంటింట్లోకి వెళ్ళాడు.

సీత పిల్లలకి అన్నాలు పెడుతోంది.

"చూసావా వాడు మళ్ళీ యథాప్రకారంగా వ్రాశాడు" అన్నాడు భార్యతో. అతని గొంతులో ఆవేదన తొణికిసలాడుతోంది. సీతకి కూడా ఈ పరిస్థితి వింతగానే వుంది.

"అడ్రసు యివ్వడు. ఉత్తరం వ్రాయలేదని ఆడిపోసుకుంటాడు. ఏం చెయ్యడం?" చిన్నపిల్ల కంటిమీద రాసుకున్న అన్నం మెతుకుల్ని చూపుడు వేలితో తొలగిస్తూ మళ్ళీ అన్నాడు అనంతరావు.

సీత ఓ క్షణం ఆలోచించి అంది: "పోనీ మళ్ళీ ఆ పాత అడ్రసుకే— అంటే ఉల్లిపాయలవారి వీధికే ఓ ఉత్తరం వ్రాసి చూడకూడదూ?"

అనంతరావు కనుబొమలు ముడిపడ్డాయి. "వాడక్కడ లేడని తెలిసీ అలా చేస్తే ఏం ప్రయోజనం!"

"ఉహూ.. కాదండీ... మీరు కనుక్కున్నది ఎవరో ఓ అమ్మాయిని కదా! ఆ పిల్లకి సరిగా తెలిసి వుండక పోవచ్చు— ఇంట్లో పెద్దాయన లేడని చెప్తున్నారాయె. శంకరంగారు యిల్లు ఎక్కడికి మార్చిందీ ఆయనకి తెలిసి వుండొచ్చు. అలాగయితే ఆ అడ్రసుకే ఉత్తరం వ్రాస్తే ఆయనా ఉత్తరం శంకరం గారికి పంపించే యేర్పాటు చెయ్యవచ్చును కదా! ప్రయత్నించి చూస్తే తప్పేముంది?"

సీత ఆలోచన సబబుగా వున్నట్టు తోచింది అనంతరావుకి. వెంటనే ఓ ఉత్తరం వ్రాసి పడేసాడు.

''శంకరం,

నీ ఉత్తరాలు అందుతున్నాయి. నేను జవాబు వ్రాయకపోవడానికి వేరే కారణం ఏది లేదు. ఆ మధ్య పనిమీద విశాఖపట్నం వచ్చేను. నిన్ను కలుసుకుందామని వచ్చాను. నువ్వాశ్రమములో లేవని తెలిసింది. తరువాత ఉత్తరాల్లో నువ్వు యిక్కడికి మార్చిందీ వ్రాయలేదు. నీకు జవాబు ఎలా రాయాలో తెలీక తటపటాయిస్తూ వుండిపోయేను. భగవంతుడి దయవల్ల నీకీ ఉత్తరం అందితే అదృష్టమే

— అనంతం''

ఇలా వ్రాసి, చివర్న ఎందుకయినా మంచిదని ''ఈ ఉత్తరం దయచేసి శంకరం గారికి అందజేయవలెను'' అని వ్రాసాడు. ఉత్తరం పోస్టుచేసి నిట్టూర్పు విడిచాడు.

*　　*　　*

ఆశ్చర్యం!

వారం తిరక్కుండానే శంకరం నుంచి జవాబు వచ్చింది అనంతరావుకి. అది చూడగానే అనంతరావు మనసు ఆనందంతో పొంగిపోయింది. ఆనందం పట్టలేక చింపి చదివాడు.

''అనంతం,

నీ ఉత్తరం అందింది. నువ్వీమధ్య విశాఖపట్నం వచ్చికూడా నన్ను కలుసుకోలేక పోయిన విషయం తెలుసుకుని ఎంత బాధగా వుందో వివరించలేను. జరిగిన దానికి సిగ్గుతో, అవమానంతో క్రుంగిపోతున్నాను.

అసలు విషయం వ్రాస్తే నువ్వెంత బాధపడతావో ఊహించలేక పోతున్నాను. కాని... వ్రాయక తప్పదు. ఈ విష్యం కుంపటిని సేవింక మొయ్యలేను. రసహీనమూ, తుచ్ఛమూ అయిన ఈ నాటకాన్నిక ఆడలేను. విపులంగా నీకంతా వ్రాస్తున్నాను. అంతా చదివి నన్ను క్షమిస్తావో? నామీద ఆగ్రహిస్తావో!

అనంతం— ఈ పట్నంలో మన మధ్యతరగతి జీవితాలు ఎంత దుర్భరమో నీకిప్పుడు వేరుగా పని గట్టుకుని వివరించనక్కరలేదు.

నాకొచ్చే సంపాదనతో ఇల్లు గడవడమే దుర్భరంగా వుంటోంది. చాలీచాలని జీతంతో, మనిషిని నిలువునా క్రుంగదీసే యిళ్ల అద్దెల భారంతో— ఆకాశాన్నంటుతున్న ధరలతో... ఇక్కడ బతుకులో ప్రశాంతత లేదు. ఏదో బెంగా బెగులూ అనుక్షణం గుండెను దొలిచేస్తూనే వుంటుంది.

ఈ భయాల మధ్య చికాకుల నడుమ, యిలా నాసిరకం బ్రతుకు గడపడం కన్నా— మన వూరొచ్చి ప్రశాంతంగా వుండగలిగితే ఎంత బాగుంటుంది—అనిపిస్తూ వుంటుంది. ఒక్కో దుర్భరమయిన క్షణాలలో మనసు పిచ్చెత్తినట్టు యీ ఆలోచనల్తో ఘోషిస్తూ వుంటుంది. కాని— ఇది జీవితం. ఇందులో ఆటుపోట్లని తట్టుకుంటూ నిలబడాలి. కనీసం అందుకు ప్రయత్నించాలి. తప్పదు.

అమ్మ జబ్బుతో చాలా కాలం మంచం పట్టింది. మందులకి, ఆ వైద్యానికి చాలా ఖర్చయింది అయినా అమ్మ దక్కలేదు అప్పు మిగిలింది. పరామర్శ కోసం వచ్చే చుట్టపక్కాల వత్తిడితో భారం యింకా పెరిగిపోయింది. అన్నీ భరించాను.


చేసిన అప్పులకి వడ్డీలు కడుతూ, సగం సగం బ్రతుకుతూ ఎలాగో సంసారాన్ని ఈడుస్తున్నాను.

కానీ అనంతం! యింటి వాతావరణంలో మార్పులేదు. ఖర్చులూ బంధువుల రాకపోకలూ తగ్గలేదు. పైపెచ్చు పెరిగాయి.

ఇది పట్నం—ఖరీదైన, అందమైన ఆకర్షణలున్న పట్టణం. కోర్టుల పనిమీదా, ఎంప్లాయ్‌మెంటులో పేర్లు నమోదు చేసుకునే పనిమీదా, ఆస్పత్రిలో వైద్యం నిమిత్తం వచ్చేవాళ్ళూ... ఈ బంధువుల తాకిడికి ఎలా తట్టుకోవాలో తెలీదు. ఒక పూట వుండీ ఒకపూట లేనట్టు తినే నా దైన్యం బంధువులకి తెలీడం యిష్టంలేని 'ఫాల్స్ ప్రెస్టీజ్' నరనరమూ కోతపెడుతూ బాధిస్తూ వుంటుంది. ఒక మామూలు మధ్యతరగతి మనిషిగా ఈ బంధుత్వాలతో క్రుంగిపోతూ అప్పుల భారంతో మునిగి పోయాను.

ఇక్కడే అసలు విషయం చెప్పాల్సివుంది. దాదాపు ఇలాంటి స్థితిలోనే వున్న నామితుడొకాయన ఉన్నాడు. ఆయనపేరు— పద్మనాభరావు! ఇద్దరం కలిసి ఒకరి బాధలు ఒకరి ముందు వెళ్లబోసుకునే వాళ్ళం చివరకి... చివరకి యిద్దరం కలిసి ఒక నిర్ణయానికొచ్చేం... ఆ నిర్ణయం నీచమైనదే కావచ్చు; కాని అలాంటి నిర్ణయం తీసుకోవడం వెనుక ఎంత విషాద మనోభావించి వుందో నువ్వు ఊహించగలవా అనంతం?

బంధువుల తాకిడిని— కనీసం పాత అప్పులన్నీ చెల్లుబెట్టే వరకయినా— తట్టుకోవడం కోసం— ఒకరి అడ్రస్ మరొకరి కేరాఫ్ అడ్రసుకి యిచ్చుకునే యేర్పాటు చేసుకున్నాం. అంటే వివరంగా చెప్పక్కర



అడ్రసులేని మనుషులు

లేదనుకుంటాను? నాకొచ్చే ఉత్తరాలన్నీ కేరాఫ్ పద్మనాభరావు అడ్రసుతో వుండడం వల్ల—ఆయనకీ, ఆయన వుత్తరాలు కూడా అలాగే నాకూ అందుతాయి. తరువాత ఎవరి ఉత్తరాలు వాళ్ళకి అంగజేసుకుంటూ వుంటాం. ఆ అడ్రసుకి బంధువులెవరైనా వస్తే మాత్రం... అనంతం, అసహ్యించుకుంటున్నావు కదూ!... వారికి ... వారికి నీకు దొరికిన జవాబే దొరుకుతుంది...

క్షమించగలవా అనంతం? నువ్వీ ఊరు వచ్చి కూడా నన్ను కలుసుకోలేకపోయిన పరిస్థితి సృష్టించినందుకు సిగ్గుతో కుమిలి పోతున్నాను. అవమాన భారంతో నా మనసు దహించుకు పోతోంది ... నువ్వు వస్తున్నట్టుగా ముందుగా ఓ ఉత్తరం వ్రాస్తే ఎంత బాగుండేది!

అనంతం! ఇక్కడ అందమయిన బజార్లూ, పార్కులూ, మిరిమిట్లు గొలిపే దుకాణాలూ, షోకేసుల్లో అందాల వారి విల్లుల్లా నవ్వులు చిందిస్తూ విల్లునే ప్లాష్టర్ ఆఫ్ పారిస్ సుందరాంగుల సోయగాలూ, మనుషులకన్నా నిబ్బరంగా, ముద్దుగా పెంచబడే కుక్కలూ, అనంతమైన మనుష్యులున్నా, లేనట్టు మరిపింపజేసే అనంత సముద్రమూ, ఇరుకు మనుషుల సంకుచితపు ఆలోచనల్లాకాక— అత్యంత విశాలమయిన రోడ్లూ— మీ పాపాలన్నీ ఓ కంట చూస్తున్నాను సుమా అని బెదిరిస్తూ దిక్కులు పరికించే లైట్‌హౌస్ కాంతీ—కార్లూ, బస్సులూ, ఆటోలూ— అన్నీ ఉన్నాయి. ప్రశాంతత తప్ప—ఇక్కడ నిర్భీతిగా, ధైర్యంగా ఊపిరి పీల్చుకోగలిగే అదృష్టవంతులు ఏ కొద్దిమందో!

మరి, నాలాంటి వాళ్ళు—

తిలక్ చెప్పినట్టు, మావి బల్లపరుపు జీవితాలు— గొంగళి పురుగు బ్రతుకులు. నిజానికి మేం అడ్రసులేని మనుషులం. అంతే!—

క్షమిస్తావు కదూ!

—నీ శంకరం."

ఉత్తరం నా గోరువెచ్చని కన్నీళ్ళతో ఎప్పుడు ముద్దగా తడిసిపోయిందో? అక్షరాలన్నీ మసక మసగ్గా అలుక్కుపోయినట్టు కనిపిస్తున్నాయి...

హైదరాబాద్ నోట్‌బుక్

ముగ్గురు మంత్రులు :

ఎన్నికల కోలాహలం ముగిసింది కేంద్రంలో మంత్రివర్గం శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వంలో ఏర్పడింది. తొలి మంత్రుల జాబితాలోనే ఆంధ్ర ప్రదేశ్ నుంచి ఎన్నికయిన నలుగురు మంత్రులుండడం రాష్ట్రానికి గర్వకారణం ఈ నలుగురిలో శ్రీ పి శివశంకర్ సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు తక్కిన ముగ్గురు ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ మెదక్ నుంచి, శ్రీ పి. వి. నరసింహారావు హనుమకొండ నుంచి, శ్రీ పెండేకంటి వెంకట సుబ్బయ్య నంద్యాల నుంచి ఎన్నికయ్యారు

కేంద్రంలో న్యాయశాఖా మంత్రిగా నియమితులైన శ్రీ పి శివశంకర్ తూర్పు హైదరాబాద్ తాలూకా మామిడిపల్లి గ్రామంలో 1929 ఆగస్టు 10వ తేదీన ఒక రైతు కుటుంబంలో జన్మించారు. హైదరాబాద్‌లో మెట్రిక్యులేషన్ పూర్తి చేసినపిదప అమృత్‌సర్‌కు వెళ్ళి హిందూ కాలేజీలో చేరి బి. ఏ ఆనర్స్ పట్టభద్రులై హైదరాబాద్‌కు తిరిగివచ్చి, అప్పటి మునిసిపల్ కార్పొరేషన్ మేయరుకు పర్సనల్ అసిస్టెంటుగాచేరారు పనిలోఉంటూనే 1952లో ఎల్ ఎల్ బి పట్టం పుచ్చుకొని వకాల్తా ప్రారంభించారు. 1958 నుంచి 1967 వరకు సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ కార్యదర్శిగా వ్యవహరించారు 1964 లో ఆయన ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు 1969లో ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులయారు. 1970లో ఆంధ్ర ప్రదేశ్ బార్ కౌన్సిల్ క్రమశిక్షణ సంఘం చెయిర్మన్‌గాను, 1972లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన ప్రభుత్వ న్యాయవాదిగాను నియమితులయారు 1974లో ఆయనను హైకోర్టు న్యాయమూర్తిగా నియమించారు కాని,ఆయన సంవత్సరం తర్వాత న్యాయమూర్తి పదవికి రాజీనామా ఇచ్చి, మరల వకాల్తా చేపట్టారు. 1977 నుంచి సుప్రీం కోర్టులో వకాల్తా ప్రారంభించారు. 1979 లో లోక్‌సభ ఉపఎన్నికలలో సికిందరాబాద్ నియోజకవర్గం నుంచి జనతా అభ్యర్థిని శ్రీమతి అక్కీ కాంతమ్మను ఓడించి ఎన్నికయ్యారు మొన్నటి లోక్‌సభ మధ్యంతర ఎన్నికలలో మరల సికిందరాబాద్ నియోజక వర్గం నుంచి ఎన్నికయారు ఆయన సహార్‌డిటెన్షన్ కేసులో ప్రత్యేక న్యాయస్థానంలో శ్రీమతి గాంధి పక్షాన వాదించారు ప్రత్యేక న్యాయస్థానం బిల్లుపై రాష్ట్రపతి పత్రిప్రస్తావన సందర్భంగా సుప్రీంకోర్టులో ఆంధ్ర ప్రదేశ్ పక్షాన వాదించారు. న్యాయ రంగంలో ఇంతటి అనుభవం గల శ్రీ శివశంకర్ న్యాయశాఖ మంత్రిగా రాణించగలరనే అందరూ ఆశిస్తున్నారు.

విదేశాంగమంత్రిగా నియమితులయిన శ్రీ పాములపర్తి వెంకట నరసింహారావు కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ తాలూకా వంగరలో 1921 లో జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం వరంగల్‌లో పూర్తి చేసి నాగపూర్‌లో న్యాయ శాస్త్ర పట్టభద్రులయ్యారు.పూర్వపు హైదరాబాద్ రాష్ట్రంలో వందేమాతరం ఉద్యమంతో రాజకీయాలలో ప్రవేశించారు. శ్రీ బూర్గుల రామకృష్ణారావుకు జూనియర్‌గా వకాల్తా ప్రారంభించారు హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు 1957లో తొలిసారిగా రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు ఐదేళ్ల తర్వాత రాష్ట్ర మంత్రి అయ్యారు సంజీవరెడ్డి, బ్రహ్మానందరెడ్డి మంత్రి వర్గాలలో న్యాయ, ఆరోగ్య విద్యామంత్రి పదవులను నిర్వహించారు. 1971 సెప్టెంబరులో రాష్ట్ర ముఖ్య మంత్రి అయ్యారు 1972 మార్చిలో సాధారణ ఎన్నికల తర్వాత 1972 లో మరల ముఖ్యమంత్రి అయ్యారు. రాష్ట్రంలో ఏర్పడిన కల్లోలం కారణంగా రాష్ట్రంలో మార్పులు వచ్చాయి. లండన్ విశ్వవిద్యాలయం ఆసియా, ఆఫ్రికా అధ్యయన పాఠశాల ఆగ్నేయాసియా వ్యవహారాలపై ఏర్పాటుచేసిన మహాసభలో పాల్గొన్నారు 1974లో ఇంగ్లాండు, అమెరికా, పశ్చిమ జర్మనీ, స్విట్జర్లాండ్, ఇటలీ, ఈజిప్టులలో పర్యటించారు 1977 లో జరిగిన సాధారణ ఎన్నికలలో హనుమకొండ నియోజక వర్గంనుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు హనుమకొండ నుంచే మళ్ళీ ఎన్నికయ్యారు. తెలుగు, ఉరుదూ, హిందీ, మరాఠీ, ఆంగ్ల భాషలలో అనర్గళంగా ప్రసంగిస్తారు

కేంద్ర హోంశాఖలో సహాయ మంత్రిగా నియమితులయిన శ్రీ పెండేకంటి వెంకట సుబ్బయ్య వయస్సు 58 సంవత్సరాలు. ఆయన చిన్ననాటి నుంచే సహకారోద్యమంతో పాల్గొన్నారు. 1957 లో లోక్‌సభకు ఎన్నికయ్యారు. భారత జాతీయ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. కాంగ్రెస్‌లో చీలిక ఏర్పడినప్పటి నుంచి శ్రీమతి గాంధీ పక్షంలో ఉన్నారు 1977లో నంద్యాల నియోజక వర్గంలో శ్రీ నీలం సంజీవరెడ్డితో ఓడిపోయారు. పిదప ఆ నియోజకవర్గం ఉపఎన్నికలలో గెలుపొందారు. మొన్నటి మధ్యంతర ఎన్నికల్లోను నంద్యాల నుంచి ఎన్నికయ్యారు. సహాయమంత్రి అయినందుకు రాష్ట్రంలోని ఆర్యవైశ్యులందరూ తక్కిన వారితోపాటు విశేషంగా సంతోషిస్తున్నారు !


డాక్టర్ల నిర్ణయం :

రాష్ట్రంలోని డాక్టర్లు జనవరి 17న కొత్త నిర్ణయం చేశారు. సమ్మె చేస్తున్న డాక్టర్లపై ప్రభుత్వం కసి తీర్చుకుంటున్నందుకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా మూక ఉమ్మడిగా రాజీనామా యివ్వాలని ఈ నిర్ణయం సమ్మె చేస్తున్న 365 మంది డాక్టర్లను ప్రభుత్వం సర్వీసు నుండి తొలగించింది ప్రభుత్వ డాక్టర్ల సర్వీసును అత్యవసర సర్వీసుగా ప్రకటించింది కాని, ఈ ఉత్తరువు అమలు కాకుండా రాష్ట్ర హైకోర్టు జనవరి 17న స్టే ఇచ్చింది రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఈ సమ్మెలో 5000 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లు,2500 మంది జూనియర్ డాక్టర్లు ఉన్నారు

ఉపశ్రుతి :

"ఏంసార్, ప్రతంబెట్టా ఫలించలేదని పామెత సారు, పార్టీ మార్చినా ఫలితందక్కలేదే" అనడిగాడు పార్టీ మార్చి గెలిచి మంత్రి పదవి అందుకోని ఒక నాయకుని "కొందరెందుకు? ఇంకా రెండవ జాబితా రాలేదుగదా !" అన్నారు తాపీగా ఆయన.

— తిరుమల రామచంద్ర



"దేవుడే దుర్మార్గుడా?" చిత్రానికి పాటలు రికార్డింగ్ సందర్భంలో బాబు జెవర్జీ, యస్ జానకి, చక్రవర్తి, ప్రేమ్‌కుమార్, యం.బాల్జీ,యస్ పి.బాలసుబ్రహ్మణ్యం,నాగేష్.

ధర్మపథం — బులుసు వేంకట రమణయ్య

షట్కర్మ నిరతులు

ప్రాచీనులైన మహర్షులు ఆయా వర్ణాల వారికి కొన్ని కొన్ని కర్మలు విధించారు. వాటిలో షట్కర్మలు ప్రసిద్ధమైనవి. అవి- యజనం, యాజనం, అధ్యయనం, అధ్యాపనం, దానం, ప్రతిగ్రహం అనేవి.

యజన మంటే యజ్ఞ యాగాదులు చెయ్యడం. యాజనమంటే యజ్ఞయాగాదులను చేయించడం. అధ్యయనమంటే వేదములను క్షుణ్ణంగా అభ్యసించడం. అధ్యాపనం ఇతరులకు వేదములను బోధించడం. దానం యోగ్యులైనవారికి ఇచ్చుట. ప్రతిగ్రహమంటే ఇతరులనుండి దానాన్ని గ్రహించడం. వీటిలో యజన, అధ్యయన, దానాలు మూడున్నూ చెయ్యడానికి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులనే వర్ణత్రయం వారికి అధికారం ఉన్నది. యాజన- అధ్యాపన- ప్రతిగ్రహాలకు యోగ్యులైన బ్రాహ్మణులే అధికారులు వేదాధ్యయన సంపన్నులైన వారున్నూ, శ్రౌత ప్రక్రియ తెలిసి యజ్ఞ యాగాలను సరియైన పద్ధతిని చేయించ గలవారున్నూ, దానాన్ని స్వీకరించడానికి అర్హత కలవారున్నూ, వేదాలను ఇతరులకు బోధింప గలిగినవారున్నూ, స్వయంగా యాగాలు చేసేవారూ, దానాలివ్వగలిగిన వారూ షట్కర్మ నిరతులని ప్రసిద్ధి.

కొందరు వేదంబాగుగా చదువుకోవచ్చును. కాని ఇతరులకు బోధించడం చేతకాకపోవచ్చు. ఆ విధంగా శ్రౌతం తెలిసినా ప్రక్రియ సరిగా తెలియకపోవచ్చు. అటివారు షట్కర్మ నిరతులు కారు. క్షత్రియులు, వైశ్యులు ప్రతిభావంతులై యాగం చేయుంచుటకు, వేదం యితరులకు చెప్పుటకు సామర్థ్యం కలిగి ఉండవచ్చును. కాని, వారికి యాజన, అధ్యాపన, ప్రతిగ్రహాల అధికారం ఇవ్వబడలేదు. కారణం ఏమిటని ప్రశ్నించవచ్చును.

రాజులు రాజ్యాన్ని పాలించవలసి వుంటుంది. అట్టివారు వైదిక కర్మలలో నిమగ్నులయితే వారి రాచరికం దెబ్బ తింటుంది. రాజులు ఇతరులకు యిచ్చేవారే కాని, యితరులను యాచించి పుచ్చుకొనే వారు కారు. అది వీరత్వానికి లోపం. అందు వల్ల దానంపట్టే అధికారం వారికి లేకుండా పోయింది. వైశ్యులు వర్తక వ్యాపారాలలో సతమత మవుతూ ఉంటారు. వారిదృష్టి వ్యాపారంపైనే ఉండాలి వైదిక కర్మలలో ప్రవేశిస్తే వారి వర్తకం కొనసాగదు. క్షత్రియుల వలెనే వైశ్యులు శ్రీమంతులు. కాబట్టి దానం ఇచ్చే అధికారమే వారి కున్నది. పుచ్చుకునే పద్ధతి వారిలో లేవ్వడూ లేదు.

విప్రులకు కూడా యజన- అధ్యయన- దానాలే ముఖ్యమైనవి. తమ నిత్యజీవితం గడవ డానికి మార్గాంతరం లేనప్పుడే వారు యాగాలు చేయించి, చదువు చెప్పి, దానాలు తీసుకొని దినాలు వెళ్ళబుచ్చాలి. ఇది రెండవ పక్షం. అందువల్లనే ధర్మశాస్త్రంలో "త్రిషు కర్మ స్వభిరతః" అని మూడు కర్మల యందే విప్రుడు ఆసక్తి కలిగి వుండాలనీ, అది సాధ్యం కానప్పుడే మిగిలిన మూడింటినీ స్వీకరించాలని "షట్సునా" అని రెండవ పక్షంగా చెప్పబడింది.

జబల్పూరు ఆంధ్రుల సంక్రాంతి

జబల్పూరు ఆంధ్ర సంఘం 1980సంక్రాంతి వాడు షహీద్ స్మారక భవనంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించింది. జబల్పూరు విశ్వ విద్యాలయం గత సంవత్సరం నిర్వహించిన వివిధ పరీక్షలో ప్రప్రథములుగా ఉత్తీర్ణులై, విశ్వ విద్యాలయం స్వర్ణ పతక విజేతలైన తెలుగు విద్యార్థులు శ్రీ ఐ. ఆర్. కె. భగవాన్లు, శ్రీ డి. సుధాకర్, కుమార్ ఎం. జోత్స్నలకు ఆంధ్ర సంఘం తరపున శ్రీమతి ఎస్. ఎస్. మూర్తి రజత పతాకాలను బహూకరించారు. తారువాత బాలికలు సునందారాణి, అనితారావు, శ్రీలత, శ్రీకళ రమణిరావు, స్వేతారావు, లత, అనూరాధ, వాణిలు జానపద నృత్యాలను చేశారు. 'ఇక నాటకం వేసినట్టే!'అనే బాలల నాటికను కుమారి ఆశా, పద్మశ్రీ, శారద, శ్యామల, మరియు శ్రీనివాసరావు, రాంమోహన్, శేషసాయిలు శ్రీమతి బి. సీతాలక్ష్మిగారి దర్శకత్వంలో ప్రదర్శించారు. ఎనిమిది సంవత్సరాల వై. మధుసూధనరావు చెప్పిన 'గజేంద్ర మోక్షం' హరికథ ప్రేక్షకులను ముగ్ధులను చేసింది. ఆనాటి కార్యక్రమాలలో 'ఇల్లు చేరి చూడు' నాటిక, శ్రీ కె. పి. ఆర్. రెడ్డిగారి మేజిక్ ప్రదర్శన, మాస్టరు శ్రీనివాసరావు తబలా సోలోకూడా ఉన్నాయి. సంఘ అధ్యక్షులు శ్రీ ఎస్. ఎస్. మూర్తి అధ్యక్షత వహించగా శ్రీ గుమ్మా ప్రసాదరావు వందన సమర్పణ చేశారు, అని కోశాధికారి తెలియజేశారు.

పవిత్ర ప్రణయిని చిత్రాంగి

కర్నూలు జిల్లా రచయితల సహకార ప్రచురణ సంఘం వారు ప్రచురించిన పద్య కావ్యం. రచన : శ్రీ కలుగొట్ల విజయాత్రేయ, 38 పేజీలు. వెల మూడు రూపాయలు. ప్రతులకు: ప్రచురణకర్తల పేర కర్నూలుకు వ్రాయాలి.

బాపురెడ్డి కవితాత్మ

కవితా వ్యక్తిత్వాల సమీక్ష. రచన : శ్రీ జి. రామమోహనరావు, 64 పేజీలు, వెల 5 రూ.లు. ప్రతులకు : భాషాకుటీరం, వెంకటేశ్వర కాలనీ, నారాయణగూడ, హైదరాబాద్—500029.

నైషధ గీత

నల చరిత్ర గేయ కవిత. రచన : శ్రీ పప్పు చిట్టిదాసు. 70 పేజీలు, వెల : 5 రూ.లు. ప్రతులకు : రచయిత పేర, సంపాదకుడు, "విజయ సారథి", రాజాం—532127, శ్రీకాకుళం జిల్లా.

అంతరిక్ష యాత్ర

భగవతి ప్రసాద్ శ్రీవాత్సవ హిందీలో విద్యా విజ్ఞాన శాస్త్రవేత్త. ఆయన రచన అంతరిక్ష యాత్రను నేషనల్ బుక్ ట్రస్టువారు 175 పుటల గ్రంథంగా వెలువరించారు. అనువాదం ఏ. వి. ఎస్. రామారావుగారు. ఈ పుస్తకం వెల : కొంచెం ఎక్కువ, రూ. 8 లు. ప్రతులకు: నేషనల్ బుక్ ట్రస్టు యిండియా, న్యూఢిల్లీ—16 కి రాయవచ్చును.

అవీ-ఇవీ-అన్నీ

మనసుగతి

కర్నూలుజిల్లా రచయితల సహకార సంఘ ప్రచురణ "మనసుగతి" నవల ప్రతి మా కార్యాలయం చేరింది. 116 పుటలు గల యీ పుస్తకం రచయిత, శ్రీ శిష్టుకృష్ణమూర్తి. వెల : రు. 6లు. ప్రతులకు పై సంఘానికి వ్రాయవచ్చును.

సామెతల స్రవంతి

వివిధ సామెతల కథలను సేకరించి శ్రీ చవను సుదర్శనరావు రచించిన యీ పుస్తకం వెల. 5 రూ.లు, పుటలు 95. ప్రతులకు కర్నూలు రచయితల సహకార సంఘానికి కర్నూలు వ్రాయవచ్చును.

దరిజేరిన కెరటం

శ్రీమతి పి. శారదానాథ్ వ్రాసిన యీ నవల బందరు స్పందన సాహితీసమాఖ్యవారు ప్రచురించారు. వెల : రు.5లు. ప్రతులకు స్పందన సాహితీసమాఖ్య మచిలీపట్నంకి వ్రాయాలి.

వ్యంగ్య చిత్ర

"వెంకట్" అవార్డుల కార్టూన్ల పోటీ ప్రత్యేక సంచిక "వ్యంగ్యచిత్ర" మా కార్యాలయం చేరింది. ఇందులో1978 బహుమతి గ్రహీతలైన కాటూరి, 'శంబంగి' నియంతల వివరాలు, యింకా ప్రముఖుల వ్యాసాలు చాలా కార్టూన్‌లు, అవార్డు ప్రధానోత్సవ విశేషాలు మొదలైనవి చక్కగాపొందుపరచబడి వున్నాయి. వెల : పదిరూపాయలు. ప్రతుల కోసం సాధనసమితి, 1—1—336/30 వివేక్‌నగర్ చిక్కడపల్లి, హైదరాబాద్‌కి రాయాలి.

భావాతీత ధ్యానము

శ్రీ మహేష్‌యోగివారి "ట్రాన్సెండెంటల్ మెడిటేషన్" ప్రబోధమునకు తెలుగు స్వేఛ్ఛానువాదము. రచన : శ్రీ "శివం". 60 పేజీలు, వెల : రూపాయి. ప్రతులకు : శ్రీ కేశనకుర్తి వీరన్న, శ్రీ రామదాస్ మెడికల్‌హాల్, మెయిన్‌రోడ్డు, కాకినాడ.

గ్రామ వికాస వాణి


గ్రామీణ వార్తాపత్రిక జన్మదిన ప్రత్యేక సంచిక. భాగవతుల చారిటబుల్ ట్రస్ట్,యలమంచిలి వారి ప్రచురణ. సంపాదకుడు : శ్రీ టి. అయ్యప్ప నాయుడు. 6 పేజీలు. వెల : 15 పైసలు. ప్రతులకు, వివరములకు : భాగవతుల చారిటబుల్ ట్రస్ట్, వోరుగంటివారి వీధి, యలమంచిలి— 531055.

చదరంగం

ఆరుద్ర అంతర్జాతీయ విధానం చదరంగం మీద నేర్చుకునేవారికి ఉపయుక్తంగా సరళంగా తయారు చేసిన చదరంగంగ్రంథాన్ని న్యూస్టూడెంట్సు బుక్ సెంటర్, ఏలూరురోడ్డు, విజయవాడ—2 వారు 265 పుటల పుస్తకంగా వేశారు. వెల : పన్నెండు రూపాయలు.

రాక్షస ద్వీపం

ఎం. డి. సౌజన్య రాసిన పిల్లలనవల రాక్షసద్వీపం మా కార్యాలయం చేరింది. సుమారు నూరు పుటలు వెల : రూపాయిపావలా. ప్రతులకు : బాలభారతి, మద్రాసు—24 కి రాయవచ్చును.



15-2-1980 శుక్రవారం మొదలు
21-2-1980 గురువారం వరకు

వారఫలం

మేషం: ఈవారం యీరాశి వారికి ఆరవ రాశిలో స్థితుడైన శనిగ్రహం సర్వానుకూలుండు. వ్యాపారరీత్యా అనుకూలం. ఉద్యోగంలో ప్రమోషన్ ఆశింపవీలున్నది. పత్రిక, గ్రంథ విక్రేతులకు, లాభదాయకం. గౌరవాధిక్యతకు అనుకూలం. రాజకీయంగా ఉత్తమ ఫలాలను అనుభవింపగలరు. స్త్రీలకు :— శుక్ర, శనివారాలు యోగదాయకం. ఋణబాధా నివారణం. వ్యవహార విజయం సంభవం.

వృషభం: రాశికి చతుర్థంలో, ఉన్నగ్రహాలు ఏ రంగంలో కూడ అనుకూల దాయకంగా ఉండవు. కృత్తికా నక్షత్ర జాతకులు తప్ప తక్కిన వారికి అన్ని రంగాలలో అభివృద్ధి కనబడుతుంది వ్యయం అధికం. రాబడి ఏ విధంగా అనుకూలతగాదు. సంతాన విషయక వ్యవహారాలు చికాకు కల్గజేయనున్నవి. సుఖశాంతులకు భంగం వాటిల్లే గ్రహచారమున్నది. స్త్రీలకు :— ఈ రాశి వారికి ద్రవ్యాదాయం, గౌరవాధిక్యత, సాహిత్య కృషి రాణించే మార్గమున్నది.

మిథునం: రాశ్యాధిపతి బుధుడు యోగప్రదుడు. వ్యాపారంలో నూతనావకాశాలు సంభవం కాగలవు. గురువు కూడా అనుకూలుడు కాబోవు చున్నాడు. షష్ఠలాభాధిపతి పూర్ణపాపియైనందున, శత్రు, రోగ ఋణబాధలుండగలవు. చాలవరకు పాప ఫలములను అనుభవింపనున్నారు స్త్రీలకు:—గృహ సంబంధంగా, భూసంబంధంగా నూతన సమస్యలు తలయెత్తనున్నవి. ఆరోగ్యం కూడా జాగ్రత్తగా చూచుకోవాలి.

కర్కాటకం: మీ రాశికి గోచారరీత్యా, శుక్ర, శని వారాలు, అన్ని రంగాలలో అభివృద్ధికి సాయం చేయగలవు. ఆ రెండు దినాలలో, మీ ప్రయత్నంలో లోపం లేకుంటే, తలంచిన పనులు సానుకూలం కాగలవు. సాహిత్య కృషి రాణింపనున్నది. రచయితలు మీరైతే, కళారంగానుభవం గలవారైతే కొత్తగా కొన్ని అవకాశాలు చేజిక్కించుకోగలరు. స్త్రీలకు:— ధనాదాయం, ఉద్యోగంలో రాణింపు సంభవం.

సింహం: రాజకీయంగా మీరు గావించిన కృషి ఫలవంతమయి, గౌరవార్హమైన లాభదాయకమైన పదవులను చేబట్టనున్నారు. అప్రయత్నంగా ధన లబ్ధి గలదు. గ్రామ పెద్దరికం రాణించగలదు. పెద్ద పెట్టున మీరు గావించే వ్యాపారం మంచి ఫలితము లివ్వగలదు. దూర బంధువులో, మిత్రులో సహాయం సమయంలో చేయుటం గమనింపగలరు. స్త్రీలకు : శుభకార్యాలోచన, వృత్తి రాణింపు, స్వల్పాదాయం సంభవం.

కన్య: మీ రాశిలో శని ఏ విధంగా మేలు చేకూర్చదు. వ్యయంలో గల గురువు శుభకార్యాల మూలంగా అధిక వ్యయం చూపగలడు. అక్కడే స్థితులైన రాహు కుజ గ్రహాలు, మానసిక శాంతిని తగ్గింపనున్నారు. దీనికితోడు ఆరోగ్యలోపం కూడా కనిపింపగలదు. స్త్రీలకు :— ఆరోగ్యలోపం, గృహకార్యభారం, మనశ్శాంతి లోపించటం గమనింపగలరు.

తుల: వ్యయం చేయవలసిన ఘట్టాలు అధికంగా కనిపించే వారం. ఆదాయం కూడా అనుకున్నంతగా లభించదు. ఇరుగుపొరుగు వారితో మాట పట్టింపులుండగలవు. మంచికిపోయినా, ఎదురు దెబ్బలు తగలటం, బాధపడటం సంభవం. ప్రాణ స్నేహితులుగా ఉండే వారు దూరం కావటం కూడా జరిగే వారం. స్త్రీలకు :— పెద్దగా చెప్పతగిన గౌరవంగాని, ధనాదాయం కాని చెప్పదగిన వారంగాదు.

వృశ్చికం: ధనాదాయానికి అనుకూలమైన వారం. క్రొత్తగా నగలుగాని, బట్టలుగాని కొనగలరని, బంధువుల రాకడ సంభవమని, అనుకూలదాయకమైన మార్పులు వృత్తిలో సంభవం. ఇంకా పరులచేత చిక్కిన ధనం కొంతవరకైనా చేతికందే మార్గమున్నది. వ్యాపారాన్ని గూర్చిన ఆలోచనలుండగలవు. జాయింటు వ్యాపారం ఫలితానికి రాగలదు. భూసంబంధంగా, గృహసంబంధంగా, కొన్ని సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశమున్నది. స్త్రీలకు :— హాయి, ఆనందం లభ్యం.

ధనుస్సు: మీ వ్యాపారం ఫలించే వారం. మీ ఉద్యోగంలో అభివృద్ధి కనిపిస్తుంది. ఆర్థికంగా హాయి, ఆనందం లభ్యమయ్యే వారం. అధికారుల వలన జరుగదగిన అనుకూల కార్యాలు, మీ అభీష్టానికి తగినట్లే నెరవేరగలవు. ఓర్పు తక్కువ వారు, బంధువులో, మిత్రులో మిమ్ము విసిగించటానికి ప్రయత్నిస్తారు. ఇది పరీక్షా సమయంగా భావించండి. పరోపకారానికి పోయి, తిరస్కారం తెచ్చుకోకండి. స్త్రీలకు :— గృహకార్యభారం అధికమయ్యే వారం. ద్రవ్యార్జనకు అవకాశమున్నది.

మకరం: రాజకీయంగా, సాంఘికంగా, ఆర్థికంగా లోపం లేకపోయినా, శుభకార్యాలోచనలతో, బంధువులతో ఇష్టాగోష్ఠితో వారం శుభావహంగా జరుగుతుంది. సాహిత్య కార్యక్రమంలో, మీ తెలివితేటలు రాణిస్తాయి. 'ఉత్తరాషాఢ' నక్షత్ర జాతకులు సర్వవిధాలా అనుకూల ఫలాలు అందుకోగలరు. స్త్రీలకు :— అనేక విధాల ఉద్యోగ వృత్తులలో నూతనావకాశాలుంటాయి.

కుంభం: వార మధ్యభాగంలో మీకు ఆర్థిక లాభం చేకూరగలదంటాను. అందుకు తగిన అనుకూల గ్రహస్థితి కలదు గదా! మరి ఆరోగ్యమో, ఏమంత తృప్తికరంగా ఉండదు. పైగా రాశిలో కేతుగ్రహస్థితి కూడా అనారోగ్యానికి హేతువవచ్చు. రచనావ్యాసంగం, కళా వ్యాసంగం ఫలించగలదు. స్త్రీలకు :— గౌరవం వృద్ధి చెందటం, స్వల్పాదాయం సంభవం కాగలదు.

మీనం: మిమ్ములను గౌరవించే వారిని, మీ మాటను మన్నించే వారికి, నానావిధాల చెప్పుకునే సహాయం చేయగలరు. అందువల్ల గౌరవం పెరగటం, నూతనావకాశాలు లభింపగలవు. శత్రురోగ ఋణబాధలు వెన్నాడగలవంటాను. స్వల్పాదాయం లేకపోలేదు. స్త్రీలకు :— ఉద్యోగంలో, రచనావిధానంలో, కళారంగంలో ప్రగతి కనిపిస్తుంది.

— విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి



"రంగవీడ" లిమిటెడ్ పూర్ణచంద్ర ఆర్ట్స్ వారి ఆఫీసు చిక్కడపల్లిలో ప్రారంభించిన సందర్భంలో పూజచేస్తున్న యడ్ల హరిటివెంకట్రావుగారు (ఎ.పి. వ్యవసాయ శాఖామాత్యులు)

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, Mallikarjuna Rao Street Gandhinagar, Vijayawada-3. Editor : S Radhakrishn-

ప్రాచీన వైభవాన్ని పదాలుగా ఆలాపించే ప్రౌఢ శిథిలాలు.

గత చరిత్ర వీరోచిత గాథలతో నిండి వుంది. అనేక వందల ప్రాచీన కట్టడాలు, కదిపితే చాలు ప్రేమ పురాణాలు, మహోజ్వల జీవితాల మధుర కథలు విని పిస్తాయి. కాలగర్భంలో కలిసిపోయిన దర్గా, దర్వాలు మన కళ్ళ ముందు సజీవంగా నిలుస్తాయి.



కొండలలో ప్రతిధ్వని

కాంగ్రా కోట : అనేక మంది ఆక్రమణ దారులకు విపరీత ఆకర్షణ అయిన చరిత్రపూర్వపు కోట.

ధైర్యసాహసాలకు పట్టు కొమ్మ

చిత్తోర్ ఘడ్ : రాజపుత్రుల వీరత్వానికి అమర చిహ్నం. వీరనారి పద్మిని పాదస్పర్శతో పవిత్రమైన ప్రదేశం. భక్త మీరాబాయ్ ఆలయం.

లోహాఘడ్ : భరత్‌పూర్‌కు వాయవ్యంగా వున్న అజేయమైన కోట.

విజయ చిహ్నాలైన డెబ్భైఆరు బురుజులు

గోల్కొండ : హైదరాబాదు సమీపం లోని చరిత్రాత్మకమైన కోట.

ఒక సుల్తాను ఘనత

శ్రీరంగపట్నం : 13వ శతాబ్దంలో నదీ ద్వీపం మీద నిర్మాణ మైంది. ఇది టిప్పు సుల్తాన్ చివరి పోరాటానికి రణరంగమైన కోట.

బుద్ధుని కాలంలో

రాజ్‌గీర్ : అజాతశత్రువు నిర్మించిన ఈ కోట, దేశంలోని అతిప్రాచీన శిథిల కోట. ప్రాచీన మగధ రాజధానీ నగరం కూడా.

సూర్యభగవానుని వారసుడు


రోహతస్ ఘడ్ : చక్రవర్తి హరిశ్చంద్రుని కుమారుడు నిర్మించినది. ఈయన సూర్య భగవానుని వారసుడని చెబుతారు. 1857లో ఇది స్వాతంత్ర్య యోధులకు కూడలిగా ఉండేది.

ఉజ్వల చరిత్ర నిశ్శబ్ద గీతాలు

మాండు : 10వ శతాబ్దపు భోజరాజుకు స్థానబలిమి. బజ్‌బహదూర్, హిందూ గాయని రూపమతి వీరి అమర ప్రేమ గాథకు రంగం ఇదే.


ప్రతాప్‌ఘడ్ : శివాజీకి అఫ్జల్‌ఖాన్‌కీ మధ్య జరిగిన కీలక సంఘటనకు రంగం ఇదే.

చరిత్ర ఒడిలో విశ్రాంతికి రండి.
మీరు మీ విశ్రాంతి కాలాన్ని
పొడిగించేందుకు ఇంకా ఎన్నో కనబడతాయి.





ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కు భారతదేశంలో 62 కేంద్రాలు, పొరుగు దేశాలలో 7 కేంద్రాలు ఉన్నాయి. అక్కడ నుంచి ఆయా గమ్యాలకు చేర్చే సదుపాయాలు. కొద్ది గంటలలోనే మీరు కావలసిన చోటుకు చేరుకుంటారు.



ఇండియన్ ఎయిర్‌లైన్స్

మీ ట్రావెల్ ఏజెంట్‌తో సంప్రదించండి.
మీకు కలలుగనే విశ్రాంతి ప్రయాణానికి
ఈ రోజే ఏర్పాట్లు చేసుకోండి.

గతకాలపు విశేష ఆకర్షణ.